తెలుగు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-5-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 92 పేజీలు: 10+4 వెల: 8.00

డ్రాగన్ రహస్యాలు చెప్పండి: అమెరికా ఆఫర్ 5
పెహల్గాం ఉగ్రదాడిపై కేంద్రానికి ఎన్ఐఏ నివేదిక 7

## దేశం గర్వించేలా 'యంగ్ ఇండియా' స్కూల్స్

### రూ.21 వేల కోట్లతో 105 పాఠశాలలు: డి.సిఎం భట్టి


మధిర నియోజకవర్గంలో శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన డి.సిఎం భట్టి

**బోనకల్ (ఖమ్మం), ప్రభాతవార్త:** తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా నిలవనున్నదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశం గర్వించే స్థాయిలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం 21 వేల కోట్ల రూపాయలు మంజూరు చేసిందని వెల్లడించారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్భుతమైన మేధస్సుతో సమాజానికి మానవ వనరులను అందించాలన్నదే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఉద్దేశం అన్నారు. సాన పట్టిన వజ్రాల్లాగా తయారుచేసి ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే విధంగా విద్యా బుద్ధులు చెప్పే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ >>2

## ఉగ్రవాదులు, వారి మద్దతుదారులపై కఠిన చర్యలు

### అంగోలా అధ్యక్షుడితో భేటీలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, మే 3:** ఉగ్రవాదం మానవాళిని పీడిస్తున్న అతిపెద్ద ముప్పు అని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. >>2




# కులగణనపై రెండు భారీ సభలు?

### కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్!

### హాజరుకానున్న ఖర్గే, రాహుల్, ప్రియాంక?

### ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే3:** తెలంగాణలో కులగణనపై భారీ బహిరంగ సభలు నిర్వహించే యోచనలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉంది. కులగణనపై రాష్ట్రంలో రెండు సభలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. గతంలో నిర్ణయించినట్లుగానే కరీంనగర్ జిల్లాలో ఒక సభ, నల్లగొండ జిల్లాలో మరో సభ నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ సభలకు రాహుల్‌గాంధీ,మల్లిఖార్జున ఖర్గే,ప్రియాంక గాంధీలను ఆహ్వానించాలని నిర్ణయించారు. రెండోరోజుల పాటు ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిష్ఠానం దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం రాబోయే జనగణనలో కులగణన నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో శుక్రవారం జరిగిన సిడబ్ల్యుసీ సమావేశంలో నేతలు కులగణనఅంశంపై చర్చించారు. తెలంగాణలో ఇప్పటికే కులగణన చేపట్టి ఆ వివరాల ఆధారంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండు బిల్లులను సైతం అసెంబ్లీ ఆమోదించింది. >>2



## నేడు నీట్ పరీక్ష

### దేశ వ్యాప్తంగా 557 కేంద్రాలు

### 24 లక్షల మంది దరఖాస్తు

### రాష్ట్రంలో 190 కేంద్రాలు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** ఆరాష్ట్రంలో దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబిబిఎస్‌తోపాటు బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-2025 యుజీ కోర్సు పరీక్ష నేడు(ఆదివారం) దేశ వ్యాప్తంగా జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ఇప్పటికే పూర్తి చేసింది. దేశ వ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. వారి కోసం 557 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రానికి నిమిషం ఆలస్యం అయినా అనుమతించరు. రెండు గంటల ముందు నుంచి >>2

# రేవంత్‌ది చేతల సర్కార్‌కాదు



### రాష్ట్రంలో తూతు మంత్రంగా కులగణన సర్వే..

### మౌలిక వసతులకు మోడీ సర్కార్ ప్రాధాన్యం

### సమయాన్ని తగ్గించేందుకు ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణం

### హైదరాబాద్-విజయవాడ మధ్య ఆరులేన్ల రోడ్డుకు కృషి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నది చేతల ప్రభుత్వం కాదని, మాటల ప్రభుత్వమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కెసిఆర్‌ను గద్దె దింపిన రాష్ట్ర ప్రజలు మరో నియంతను గద్దెనెక్కించారని అన్నారు. అందుకే ప్రజలంతా బిజెపి వైపు చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వస్తే అప్పుడు బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలను ఇచ్చి విస్మరించి ప్రజలను నిండా ముంచిందని అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సర్వేపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కుల సర్వే మాత్రమే చేసిందని, ఏ సర్క్యూలర్ చూసినా సర్వే అని మాత్రమే ఉంటుందని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేశామని గొప్పగా చెప్పుకుంటున్న ఆ సర్వే కూడా తూతూ మంత్రంగానే చేశారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నిర్వహించిన సర్వేపై చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. ఎక్కడి రమ్మంటే అక్కడకు వస్తా అంటూ సవాల్ విసిరారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా 90 శాతం జిల్లాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. అభివృద్ధి విషయంలో దేశ ముఖచిత్రాన్ని మార్చే దిశగా వేగంగా ముందుకెళ్లుందన్నారు. మౌలిక వసతులు సమగ్రంగా కల్పితమైతే, దేశంలో వేగవంతమైన, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, ఈ దిశలో రహదారులు, రైలు, విమాన, పోర్టు, టెలీ కనెక్టివిటీ వంటి అంశాలకు కేంద్రం అత్యంత ప్రాధాన్యత కల్పించి, మౌలిక వసతుల కల్పన చేస్తుందన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల్లో రహదారులు, రైలు, విమాన, పోర్టు, టెలికనెక్టివిటీలను మెరుగుపరచేందుకు కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. పక్కా రోడ్లతో ఇంధన వినియోగ వ్యయం తగ్గుతుందన్నారు. ప్రమాదాలు తగ్గుతాయి, రవాణా వేగవంతమవుతుంది, గమ్యస్థానానికి తక్కువ సమయంలో చేరుకోవచ్చునన్నారు. గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వం అభివృద్ధి చెందిన నగరాలతో పోటీ పడే స్థాయిలో జాతీయ రహదారుల అభివృద్ధిని చేపట్టిందన్నారు. రోడ్ల అభివృద్ధి ద్వారా దేశంలో లోకల్, గ్లోబల్ బిజినెస్ అభివృద్ధి సాధ్యమవుతుంది. పెట్టుబడుల ఆకర్షణకు రహదారులు, రైలు, విమాన కనెక్టివిటీలు ఎంతో కీలకం అన్నారు. వాజ్‌పేయి హయాంలో తొలిసారిగా స్వర్ణచతుర్భుజి పేరుతో 70,000కి పైగా జాతీయ రహదారుల కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేసింది. కానీ అప్పట్లో కొన్ని >>2



## పాక్ దిగుమతులపై నిషేధం

### దాయాదికి భారత్ ఝలక్

**న్యూఢిల్లీ, మే 3:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌ను ఆర్థికంగా దెబ్బకొచ్చే చర్యలను భారత్ మరింత ముమ్మరం చేసింది. ఇప్పటికే అన్ని రకాల దౌత్య సంబంధాలు తెంచుకుంటోన్న కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో గట్టి షాకిచ్చింది. ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై నిషేధం విధించింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. పాకిస్థాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది. పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయ్యే లేదా ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే అన్నిరకాలా వస్తువుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తున్నాం. అనుమతులు ఉన్న ఉత్పత్తులైనా, స్వేచ్ఛాయుత దిగుమతులైనా పాక్ నుంచి ఎలాంటి వస్తువులను అనుమతి ఉండదు. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయి. ఈ నిషేధం నుంచి ఏవైనా మినహాయింపులు కావాలంటే భారత ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. దేశ భద్రత, ప్రజా విధాన ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర వాణిజ్య వెల్లడించింది. అయితే భారత్‌పాక్ మధ్య వాణిజ్యానికి ఉన్న ఏకైక రవాణా మార్గం అటారీ వాఘా సరిహద్దు. ఇప్పటికే దానిని భారత్ మూసివేసింది. 2019లో పుల్వామా దాడి తర్వాత నుంచి పాక్ నుంచి చాలావరకు దిగుమతులు తగ్గించుకుంది. పాక్ ఉత్పత్తులపై 200శాతం సుంకాన్ని భారత్ విధిస్తోంది. ఇక అప్పటి నుంచి కొన్ని రకాల ఫార్మా ఉత్పత్తులు, పండ్లు, నూనెగింజల వంటి వాటిని మాత్రమే దిగుమతి చేసుకుంటోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి పాక్‌కు 447.65 మిలియన్ డాలర్ల విలువైన వస్తువులు ఎగుమతి అయ్యాయి. కానీ పాక్ నుంచి కేవలం 0.42 మిలియన్ డాలర్ల ఉత్పత్తులను మాత్రమే భారత్‌కు దిగుమతి అయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా భారత్ జరుపుతున్న వాణిజ్యంలో ఇది కేవలం 0.1శాతంమాత్రమే. అయితే పాక్‌లోని కొన్ని పరిశ్రమలు భారత్‌కు చేసే ఎగుమతుల పైనే ఆర్థికంగా ఆధారపడుతున్నాయి. ఆర్గానిక్ కెమికల్స్, ప్లాస్టిక్స్, విలువైన లోహ >>2

# రూ.22 వేల కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

### -మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



### శిక్షణ పొందిన అసిస్టెంట్ ఇంజనీర్లకు సర్టిఫికేట్ల అందజేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే3:** భారతదేశంలో పేదలకు ఇంత పెద్ద ఎత్తున రూ.5 లక్షలతో సంవత్సరానికి నాలుగున్నర లక్షల ఇండ్లు నిర్మిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ఏడాది రూ.22 వేల కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని ఇందుకు సంబంధించి మరికొద్దిరోజుల్లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తామని, ఇప్పటికే పైలట్ గ్రామాల్లో ఇండ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ లో అవుట్ సోర్సింగ్‌లో నియామకమైన 350 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ( న్యాక్) లో ఆరు రోజుల పాటు శిక్షణ పొందారు. శనివారం న్యాక్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శిక్షణ పొందిన ఇంజనీర్లకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అవినీతికిఆస్కారం లేకుండా నిజాయితీ నిబద్దతతో పనిచేసి పేదవాడి చిరకాల కోరిక నెరవేరుస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగస్వాములు కావాలని అసిస్టెంట్ ఇంజనీర్లకు విజ్ఞప్తి చేశారు. ఎంపికైన 350 మంది ఇంజనీర్లలో 45శాతం మహిళలే ఉండడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఎన్ని వత్తిళ్లు వచ్చినా కూడా మెరిట్ పద్దతిలోనే ఎంపిక చేయడం జరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఏ సంక్షేమ పథకం కింద ఒక్క లబ్దిదారునికి రూ.5 లక్షలు ఇస్తున్న పథకం లేదని అన్నారు. ఇండ్ల పథకాల్లో కూడా కేంద్రం ఇస్తున్న నిధులతోనే అన్ని రాష్ట్రాలు సరిపెడుతున్నాయని కానీ తెలంగాణ రాష్ట్రంలో >>2

## ఫ్యూచర్ సిటీలో ఇ-సిటీ

### వేయి ఎకరాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి

### సిరా నెట్ వర్క్స్, ఎల్‌సిజిసి రెజల్యూట్ గ్రూప్ రూ.300 కోట్ల పెట్టుబడి

### 2500 మంది యువతకు ఉపాధి: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మే 3 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటిలో ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ సిటి(ఈ సిటి)ని అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రంలో సంయుక్తంగా రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన టెలికాం ఉత్పత్తుల >>2



## పంట రుణ పరిమితి పెంపు

### వరికి ఎకరానికి రూ.వెయ్యి అదనం

### రూ.4 వేల వరకూ పెరిగిన పామాయిల్

### ఈ ఆర్థికసంవత్సరంలో టెస్కాబ్ వార్షిక రుణ పరిమితి ఖరారు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు (టెస్కాబ్) వార్షిక రుణ పరిమితిని ఖరారు చేసింది. రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ చేసిన ప్రతిపాదనల ఆధారంగా టెస్కాబ్ ఈ నిర్ణయం తీసుకుంది. వరి, పత్తి, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలతోపాటు చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు సాగుకు టెస్కాబ్ వార్షిక రుణ పరిమితిని నిర్ధారించింది. ఆమోదించిన రుణ పరిమితి వివరాలను ప్రభుత్వం, బ్యాంకులు, అన్ని జిల్లాలకు పంపించింది. ఈ కొత్త రుణ పరిమితి ప్రకారం రైతులకు పంట రుణాల పంపిణీ జరుగనుంది. ఇదే సమయంలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ 2025-26 మార్గదర్శకాలను అనుసరించి బ్యాంకులు రుణాల మంజూరుకు సిద్ధం కావాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి పంటలకు లభించే రుణ పరిమితి గణనీయంగా పెరిగింది. విత్తనోత్పత్తి చేసే రైతులకు మరింత ఎక్కువ పరిమితి ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, చిరుధాన్యాలు, పప్పుదాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటలతో పాటు పశు, పక్షి, చేపల పెంపకానికి కూడ రుణ పరిమితి పెంచినట్లు టెస్కాబ్ ప్రకటించింది. 2025-26 వానాకాలం మరియు యాసంగి సీజన్‌కు వర్తించే ఈ కొత్త పరిమితుల్లో, వరి పంటకు ఎకరానికి >>2



# ఆరు నెలల కష్టం బురదనీటి పాలు

### 48 రోజుల్లో 29 సార్లు అకాలవర్షం

### ప్రకృతి, ప్రభుత్వం అన్నదాతపై ముప్పేటదాడి

### కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి పడిగాపులు

### టార్పాలిన్ అద్దెలు, హమాలీ భారంతో దిగజారిన రైతు పరిస్థితి

**హైదరాబాద్, మే 3,ప్రభాతవార్త:** యాసంగిలో అన్నదాతలపై వడగళ్ల వర్షం ముప్పేట దాడి చేస్తోంది.అకాలవర్షం పంట చేతికందే దశలో నోటికాడి కూడును లాగేస్తున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా వడగళ్ళు,అకాల వర్షం మార్చి రెండోవారం నుంచి తన ప్రతాపాన్ని చూపించడం మొదలైంది. గత నలభై ఎనిమది రోజుల్లో 29 సార్లు అకాలవర్షం అన్నదాతపై కుమ్మరించింది.ఆరు నెలల అన్నదాతల కష్టాన్ని బురదనీటి పాలు చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా బార్దాన్‌ల కొరత,హమాలీలకొరత,లారీల కొరత ఉండటంతో యాసంగిలో వరి సాగుచేసిన రైతుల పరిస్థితి దైన్యంగా మారింది.ధాన్యం సేకరణ జాప్యంతో రైతులు అనిశ్చితికి గురవుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించిన రాశులు కళ్లెదుటే తడిసి ముద్దవుతుంటే, రైతు కంట కన్నీరు. ధారాళంగా వస్తోంది.కనీసం పెట్టుబడులైనా వస్తాయని ఎదురుచూసిన వారి ఆశలు అడియాసలయ్యాయి. గత వారం రోజులలోనే వరుసగా మూడు,నాలుగు రోజులుగా వర్షం తెలంగాణలో పడుతోన్నది. శుక్రవారం రాత్రి వేళల్లో వీచిన ఈదురు గాలులు, వాన బీభత్సంతో అకాల వర్షానికి అనేక చోట్ల వరి నేలవాలింది. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. వర్షం పడటంతో మళ్ళీ మళ్లీ వడ్ల ఆరబోత. తూర్పార తప్పడం లేదు. దీనివలఆర్థిక భారం పడుతోంది.కూసుమంచి మండలం ముత్యాలగూడెం గ్రామానికి చెందిన ఊడుగు కౌసల్యఉప్పలయ్య దంపతులు 20 రోజుల క్రితం చేగొమ్మలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి 350 బస్తాల సన్నధాన్యాన్ని తరలించారు. నాలుగు రోజుల క్రితం వచ్చిన వర్షానికి 200 బస్తాల ధాన్యం తడిసింది. మళ్లీ దాన్ని ఆరబెట్టారు. గురువారం కాంటాలయ్యాయి. తడిసిన వడ్లను ఆరబెట్టేందుకు రూ.6వేలు >>2

## గుర్తింపు ఇవ్వలేదు.. కానీ అడ్మిషన్లకు అనుమతించారు!

### ఇంటర్ బోర్డు ట్విస్టింగ్ నిర్ణయం

### ఇప్పటి వరకు 1810 కాలేజీలు దరఖాస్తు

**హైదరాబాద్, మే 03, ప్రభాతవార్త:** తెలంగాణ ఇంటర్ బోర్డు ట్విస్టింగ్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్ కాలేజీలకు 2025-26 విద్యా సంవత్సరంలో అనుమతిని ఇప్పటి వరకు ఇవ్వలేదు. కానీ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కాలేజీల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకోవడానికి మాత్రం నోటిఫికేషన్‌ను >>2



న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శనివారం అంగోలా రిపబ్లిక్ అధ్యక్షుడు జోవో మాన్యుయేల్ గొన్‌కాల్వ్స్ లౌరెంకోకు స్వాగతం పలుకుతున్న ప్రధాన మంత్రి మోడీ. చిత్రంలో రాష్ట్రపతి ముర్ము

## మద్దతుదారులపై కఠిన చర్యలు

>> భారత పర్యటనలో ఉన్న అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సోతో ప్రధానిమోడీ భేటీ అయ్యారు. తర్వాత వీరిద్దరూ కలిసి మీడియాసమావేశంలోమాట్లాడారు పహల్గాం ఉగ్రదాడి ఘటనను మోడీ ప్రస్తావించారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు. పహల్గాం దాడినేపథ్యంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి అంగోలా మద్దతు పలికింది. అందుకు ఆదేశానికి కృతజ్ఞతలు చెపుతున్నట్లు మోడీ చెప్పారు. ఉగ్రవాదులు వారికి మద్దతు ఇచ్చేవారిపైనా కఠినమైననిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి మేం కట్టుబడి ఉన్నామని మోడీ పునరుద్ఘాటించారు. ఇటీవలే బీహార్‌లో కూడా మోడీ పహల్గాం దాడిప్రస్తావిస్తూ తీవ్రస్థాయిలో హెచ్చరికలుచేసారు. ఉగ్రదాడి వెనక ఉన్నవారు, కుట్రలోభాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తామని అన్నారు. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి ట్రాక్‌చేసి శిక్షిస్తామని యావత్‌భారతీయులకు హామీ ఇస్తున్నట్లు చెప్పారు.

## రేవంత్‌ది చేతల సర్కార్‌కాదు

>> పార్టీలు దీనిని అవమానించాయి. ఆ స్వర్ణచతుర్భుజి ప్రేరణతోనే మోడీ ప్రభుత్వం అనేక రాష్ట్రాల రాజధానులను, జిల్లా కేంద్రాలను కనెక్ట్ చేసేలా ప్రయత్నిస్తుందన్నారు. తెలంగాణలోని 32 జిల్లాలను జాతీయ రహదారులతో కనెక్ట్ చేసిన ఘనత మోడీ ప్రభుత్వానిదే అన్నారు. 2014లో తెలంగాణలో 2500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారులు ఉండగా, ఇప్పుడు అవి సుమారు 5200 కిలోమీటర్లకు పెరిగాయని, గత పదేళ్లలో రూ.1,25,485 కోట్లు జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. హైదరాబాద్ నుంచి బాంబే, నాగపూర్ రోడ్డు, వరంగల్ ద్వారా భూపాలపల్లి రోడ్డు, విజయవాడ ద్వారా చెన్నై రోడ్, కర్నూలు ద్వారా బెంగళూరు రోడ్డు వంటి అనేక జాతీయ రహదారుల ద్వారా కనెక్టివిటీ పెంపొందించబడింది. హైదరాబాద్-శ్రీశైలం మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు జాతీయ రహదారి765పై మన్ననూరు నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వరకు నాలుగులేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. హైదరాబాద్‌విజయవాడ మధ్య జాతీయ రహదారి65ను 6 లేన్లకు విస్తరించేలా చర్యలు తీసుకువచ్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెంగాణలో పలు రోడ్డు, రవాణా ప్రాజెక్టులు భూసేకరణ ఆలస్యమవుతున్న కారణంగా నత్తనడకన నడుస్తున్నాయి. ఈ విషయంలో గత సిఎం కెసిఆర్‌కి, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని కోరడం జరిగిందన్నారు. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేల పేరుతో రవాణా వ్యవస్థను సరళతరం చేసేలా దేశ వ్యాప్తంగా రూ.4.5 లక్షల కోట్ల ఖర్చుతో 10 వేల కిలోమీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ కారిడార్స్ నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలో దాదాపు రూ. 4500 కోట్లతో 136 కి.మీ. మేర పనులు జరుగుతున్నాయన్నారు. సూరత్-సోలాపూర్-చెన్నై కారిడార్ 1056 కి.మీ.రూ. 40,615 కోట్లతో పనులు జరుగుతున్నాయి.

## ఫ్యూచర్ సిటీలో ఇ-సిటీ

>> సంస్థలు సిరా నెట్ వర్క్స్(తైవాన్), ఎల్‌సిజిసి రెజల్యూట్ గ్రూప్(తెలంగాణ) ప్రతినిధులతో మంత్రి శనివారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఎలక్ట్రానిక్ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి వారికి వివరించారు. ఈ తరహ పరిశ్రమలు ఏర్పాటులో పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో వారి అవసరాలకు అనుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యయ్యేందుకు ముందుకొచ్చిన సిరా నెట్‌వర్క్స్, ఎల్‌సిజిసి రెజల్యూట్ గ్రూప్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుమారు 10 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే ఈ పరిశ్రమ ద్వారా 2500 మంది యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇక్కడ 5జీ నెట్ వర్క్స్, మల్టీ లేయర్ నెట్‌వర్కింగ్ సొల్యూషన్స్, సర్వర్స్ తదితర టెలికాం ఉత్పత్తులను తయారు చేస్తారన్నారు. ఈ పెట్టుబడితో ఇండో-తైవాన్ మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో టిజిఐఐసి సిఈఓ మధుసూదన్, టి ఫైబర్ ఎండి వేణు ప్రసాద్, సిరా నెట్వర్క్స్ ప్రతినిధులు చుయాన్, జాయ్ భట్టాచార్య, డౌగియాస్, ఎల్ సిజిసి రెజల్యూట్ గ్రూప్ నుంచి రణ్వీందర్ సింగ్, గీతాంజలి సభర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## పాక్ దిగుమతులపై నిషేధం

>> సమ్మేళనాలు, మినరల్ ఫ్యుయల్స్, నూనె ఉత్పత్తులు, కొన్ని రకాల పిండి పదార్థాలు, బంక, ఎంజైమ్స్, వర్ణ ద్రవ్యాలు, మసాలా దినుసులు వంటివి భారత్ దిగుమతి చేసుకునే వస్తువుల్లో ఉన్నాయి. ఇప్పుడు భారత్ వాటిపై నిషేధం విధించగా పాక్‌లో ఆయా రంగాల పరిశ్రమలు కుదేలయ్యే అవకాశం ఉంది. దిగుమతులు, దిగుమతులపై ఆంక్షలు విధించిన గంటల్లో భారత్ ఆ దేశ మెయిల్స్, పార్శిళ్లపై కూడా నిషేధం విధించింది. పొరుగు దేశానికి మెయిల్, పార్శిళ్ల సేవలను భారత్ నిలిపివేసింది. వాయు, రోడ్డు మార్గాల ద్వారా జరిగే మెయిల్, పార్శిళ్ల సేవలను నిలిపివేసినట్లు ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర కమ్యూనికేషన్ పరిధిలోని తపాలా శాఖ ఈ ఉత్తర్వులను జారీ చేసింది భారత్ పాకిస్థాన్‌లమధ్య ఉన్న ఏకైక రవాణా మార్గం అట్టారి వాఘా సరిహద్దు. ఇప్పటికే మూసివేసారు. 2019లో కూడా పుల్వామా దాడితర్వాతనుంచి దాయాదినుంచి మనం చాలావరకూ దిగుమతులు తగ్గించాం. పాక్ ఉత్పత్తులపై కేంద్రం 200శాతం సుంకం విధించింది. కొన్ని రకాల ఫార్మా ఉత్పత్తులు పండ్లు, నూనెగింజలు వంటివాటిని మాత్రమే దాయాదినుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దిగుమతులు స్వల్పమే అయినా పాక్‌లోని కొన్ని పరిశ్రమలు భారత్‌కు చేసే ఎగుమతులపైనే ఆర్థికంగా ఆధారపడుతున్నాయి. ఆర్గానిక్ కెమికల్స్, ప్లాస్టిక్స్, విలువైన లోహాలు, ఖనిజ ఇంధనాలు, నూనె ఉత్పత్తులు కొన్ని రకాల పిండిపదార్థాలు, బంక, ఎంజైమ్స్, వర్ణద్రవ్యాలు, మసాలా దినుసులు వంటివి దిగుమతిచేసుకుంటోంది. ఇపుడు భారత్ వాటిపై నిషేధం విధించడంతోపాక్‌లో అన్నిరంగాల పరిశ్రమలు కుదేలవుతాయి.

## రుణ పరిమితి పెంపు

>> రూ.1,000 పెంపు చోటు చేసుకోగా, మొక్కజొన్న, పత్తి, వేరుశనగకు రూ.2 వేలు చొప్పున పెంచారు. సజ్జ, కంది, మినుములకు రూ.1,000 చొప్పున, పామాయిల్ సాగుకు రూ.4 వేలు వరకూ పెంపు చేశారు. పత్తి పంటకు గతేడాది రూ.46 వేలు రుణ పరిమితి ఉండగా ఈ ఏడాది రూ.48 వేలకి పెరిగింది. విత్తనోత్పత్తి చేసే రైతులకు మరింత ఎక్కువ పరిమితి లభిస్తుంది. నిరుటి కన్నా వరికి ఎకరానికి కేవలం రూ.వెయ్యి పెంచారు. మొక్క జొన్న, పత్తి, వేరుశనగకు రూ.2వేల చొప్పున పెం చారు. సజ్జకు, కంది, మినుముకు రూ.వెయ్యి పెంచారు. పామాయిల్‌కు మాత్రం రూ.4వేలు పెరిగింది. అయితే ఈ పెంపుదల వాస్తవ సాగు ఖర్చులు పరిగణనలోకి తీసుకోకుండా నామమాత్రంగా రుణపరిమితి ఖరారుచేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

>> పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ ప్రభుత్వం రూ.5 లక్షలతో 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఇండ్లను లబ్దిదారుడే నిర్మించుకునేలా పథకాన్ని రూపొందించిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం కొద్దిరోజుల్లోనే నాలుగు లక్షల మంది జాబితా ఫైనల్ చేయబోతున్నామని విధుల్లో చేరిన వెంటనే అసిస్టెంట్ ఇంజనీర్లు ఈ జాబితాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలు, వత్తిళ్లకు గురికాకుండా అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు లభించేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల చెల్లింపుల్లో ఎలాంటి మధ్యవర్తులు ప్రమేయానికి ఆస్కారం లేకుండా ఉండేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్దిదారులకు ప్రతి సోమవారం చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. నిర్మాణ రంగంలో తనకు ఉన్న అనుభవంతో తక్కువ ఖర్చు, నాణ్యతతో ఇండ్లను నిర్మించడానికి అధికారులకు పలు సూచనలు చేశామని, యువ ఇంజనీర్లు కూడా ఈ అంశాలపై ప్రధానంగా దృష్టి సారించి లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

**పదోన్నతులు పొందిన 21 మందికి సర్టిఫికేట్లు అందజేత**

స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖలో 21 మందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. గ్రేడ్ 2లో పనిచేస్తున్న10 మంది సబ్ రిజిస్ట్రార్లను గ్రేడ్1కి, సీనియర్ సహాయకులు పనిచేస్తున్న 11 మందికి గ్రేడ్2 పదోన్నతులు కల్పించారు. వీరికి మంత్రి గారు పదోన్నతి పొందిన సర్టిఫికేట్లను అందజేశారు.

## వారం - వర్జ్యం

**తేది : 04-05-2025, ఆదివారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**వైశాఖ మాసం, ఉత్తరాయణం,**
**వసంత ఋతువు, శుక్ల పక్షం**
సప్తమి ఉ.7.20
పుష్యమి మ.12.58
వర్జ్యం రా.2.22- తె.4.02
దు.సా.4.42-5.33
శుభసమయం : ఉ.6.40-7.20
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ఇంటా బయటా కొద్దిపాటి సమస్యలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. వాహనసౌఖ్యం.

**వృషభం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. బంధువుల తాకిడి పెరుగుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం :** ఉద్యోగాలు సామాన్యంగా ఉంటాయి. ఆర్థిక పరిస్థితులు అనుకూలి స్తాయి. వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**సింహం:** చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**కన్య :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**తుల :** ఉద్యోగాలలో ప్రోత్సాహకరంగా ఉంటుంది. సన్నిహితుల నుండి శుభఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** పనులలో విజయం సాధిస్తారు. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. వస్తుసేకరణ.

**ధనుస్సు:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలతో హోదాలు, పదోన్నతులు పొందుతారు.

**మకరం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**కుంభం:** కొన్ని పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి రావు.

**మీనం:** కుటుంబ బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఉద్యోగాలలో స్థానమార్పులు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆరు నెలల కష్టం బురదనీటి పాలు

>> ఖర్చయింది. మిగిలిన 150 బస్తాల్లో సగం శుక్రవారం రాత్రి వర్షానికి తడిశాయి. మరో రూ.4 వేలు ఖర్చుచేస్తే తప్ప పంట చేతికిరాదు. ఇదే తెలంగాణ వ్యాప్తంగా మరెందరో రైతులది ఇదే వ్యథ. కనీసం పెట్టుబడైనా తిరిగొస్తుందా? అని బిక్కమొహం వేస్తున్నారు. టార్పాలిన్ కవర్లు కూడా అందుబాటులో లేకపోతే అద్దెకు రైతులు తెచ్చుకొంటున్నారు. వర్షాలతో ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ ఖమ్మం జిల్లాతో పాటు దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, కొత్తగూడెం, సుజాతనగర్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రాశులు తడిశాయి. ఒక్కోరైతు ధాన్యాన్ని ఆరబెట్టేందుకే రూ.6,000 నుంచి రూ.10,000 భరించారు. రాత్రింబవళ్లు కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. మూడు వారాలైనా కాంటాలు వేసే పరిస్థితులుండటం లేదు. కొనుగోళ్లలో వేగం పెంచకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలో శుక్రవారం సాయంత్రం వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయ్యింది. కమ్మరపల్లి, చీకోడ్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వర్షం ధాటికి కొట్టుకుపోయింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. సకాలంలో తరలించకపోవడంతో కాంటాలు పెట్టిన బస్తాలు కూడా తడిసిపోయాయి. పెద్దపల్లి జిల్లా మంథని డివిజన్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. మంథని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యంలో చేరిన వర్షపు నీటిని శుక్రవారం ఎత్తిపోస్తూ రైతులు కనిపించారు. పోచమ్మవాడ కొనుగోలు కేంద్రంతోపాటు గోపాల్పూర్లోనూ ధాన్యం వర్షపునీటిలో కొట్టుకుపోయింది. ఆరుగాలం కష్టపడితే చేతికందిన పంట కళ్ల ముందు వర్షపు నీటిలో కొట్టుకుపోవడంతో రైతు బండారి లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశాడు. డివిజన్లోని అయా మండలాల్లో ధాన్యం తడిసింది. మహబూబాబాద్ జిల్లాలోని కురవి, మరిపెడ, కేసముద్రం, డోర్నకల్, గూడూరు, మహబూబాబాద్, నర్సింహులపేట, బయ్యారం, గార్ల మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వ్యవసాయ మార్కెట్లు, ఐకేపీ సెంటర్లలో ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ లో దొడ్డిపట్ల రాములు రైతు ధాన్యం చెరువులోకి కొట్టుకుపోయింది.

**హమాలీల కొరత లారీలు సకాలం లో అందుబాటులోకి తేరు**

ఎండల కారణంగా ధాన్యం తూకానికి, లారీల్లో లోడ్ చేసేందుకు స్థానిక హమాలీలు ముందుకు రావడం లేదు. బిహార్ హమాలీలు వస్తేనే ధాన్యం కాంటాలు ప్రారంభమవుతున్నాయి. రామారెడ్డి మండలం గిద్దలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి 100 మందికి పైగా రైతులు ధాన్యం తెచ్చారు ధాన్యం కాంటా హమాలీల కొరతతో ఆలస్యం అవుతోంది దోమకొండ మండలంలోని "లింగుపల్లి, సంగమేశ్వర్, అంబారీపేట్లలో హమాలీల కొరతతో సేకరణ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మిల్లులు కొరత ఉన్న జిల్లాలో తీవ్రంగా హమాలీల కారణంగా ఇబ్బంది పడుతున్నారు. మంచిర్యాల జిల్లా నుంచి కరీంనగర్ జిల్లాకు ధాన్యం కేటాయిస్తున్నారు. అదే విధంగా వరంగల్ కు ఖమ్మం నుంచి ధాన్యం కేటాయిస్తున్నారు. ఇక్కడ లోడింగ్ అన్‌లోడింగ్‌కు హమాలీల కొరత ఏర్పడుతోంది. గత నెల నుంచి వరికోతలు ఊపందుకున్నాయి. ఇదే సమయంలో అకాల వర్షాలు వరుసగా కురుస్తున్నాయి. సాయంత్రమైతే చాలు గాలివాన బీభత్సం సృష్టిస్తోంది. గిట్టుపాటు, బోనస్ ఆశతో ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తే, అవి తడిసి ముద్దవుతుండటంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎలాగోలా కష్టపడి 17 శాతం వచ్చేదాకా వడ్లను ఆరబెడుతుంటే వాటిని కాంటా వేయించడంలో నిర్వాహకులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పట్టిన బస్తాలను లోడు చేసేందుకు హమాలీల కొరత ఎదురవుతోంది. ఇంకోవైపు జిల్లాలో నిల్వలు ఇప్పటికే నిండుగా ఉండటంతో హనుమకొండ జిల్లాలోని మిల్లులకు కేంద్రాలను ట్యాగ్ చేశారు. ఆయా కారణాలతో బస్తాల రవాణా ఆలస్యమవుతోంది. ఈ సీజన్లో కొన్ని చోట్ల ధాన్యం రాశులు ఆరేడుసార్లు తడిచిపోవడం బాధాకరం. మళ్లీ ఆరబెట్టేందుకు, తూర్పార పట్టేందుకు కూలీలతో కలిసి ఇంటిల్లిపాదీ కష్టపడుతున్నారు. మెదక్ జిల్లా , నర్సాపూర్, చేగుంట, తూప్రాన్, పెద్దశంకరంపేట, పాపన్నపేట, శివ్వంపేట ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించేందుకు అన్నదాతలు హమాలీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసేందుకు హమాలీలు లేకరోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. స్థానికంగా కొంత మంది కూలీలు ఉన్నప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి రావాల్సి ఉండడంతో కొనుగోళ్లు ఊపందుకోవడం లేదు. తూప్రాన్ పుర పరిధి బ్రాహ్మణపల్లిలో హమాలీలు లేక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. దీంతో 15 రోజుల నుంచి రైతులు నిరీక్షిస్తున్నారు. వర్షం నుంచి కాపాడుకునేందుకు అష్ట కష్టాలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. చేగుంట, నార్సింగి మండలాల్లో ధాన్యం కొనుగోళ్లకు హమాలీలు లేక ఇబ్బంది. ఎదురవుతున్నాయి. కొన్ని గ్రామాల్లో స్థానిక కూలీలను ఏర్పాటు చేసుకున్నారు. చేగుంటలో హమాలీలు రాకపోవడంతో కొనుగోలు ప్రారంభం కాలేదు. రుక్మాపూర్, రాంపూర్, నార్సింగ్ మండలం జప్తిశివనూర్లో స్థానికులకు ఎక్కువ కూలీ ఇచ్చి సమేకూర్చుకున్నారు.

**గన్నీబ్యాగుల కొరత తరుగు కింద నాలుగు కిలోల అదనం తూకం**

కొనుగోలు కేంద్రాలలో గన్నీబ్యాగుల కొరత కూడా అధికంగా ఉంది. కొనుగోలు కేంద్రాల్లో 40 కిలోల సంచికి 600 గ్రాములే అదనంగా తూకం వేయాలి. కానీ మిల్లర్లు, నిర్వాహకులు కుమ్మక్కై రెండు కిలోల రెండువందల గ్రాములు తూకం వేస్తున్నారు. అంటే 1600 గ్రాములు అదనంగా తీసుకుంటున్నారు. ఈ అదనపు ధాన్యాన్ని నింపేందుకు అన్నదాతలే సంచులు సమకూర్చాలని నిర్వాహకులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. లేదంటే తూకం వేసేది లేదని పేర్కొంటున్నారు. దీంతో అన్నదాతలు చేసేదేమి లేక సంచులను నిర్వాహకులకు ఇస్తున్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్, లక్షెట్‌పేట్, దండెపల్లి, జన్నారం, రామారెడ్డి, పోసానిపేట, ఉప్పల్ వాయి, లింగంపేట, ఎల్లారెడ్డి మండలంలోని అజామాబాద్‌లో తరుగుపై ప్రశ్నిస్తే నిబంధనల సాకుతో తూకం వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నదాతలు పేర్కొంటున్నారు. అదనంగా తూకం వేసిన విషయాన్ని బహిరంగపరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ధాన్యం కేంద్రాలు నిర్వాహకులు బెదిరింపులకు దిగుతున్నారు.



శ్రీనగర్‌లోని దాల్ సరస్సు వద్ద శనివారం పహారా కాస్తున్న భద్రతా సిబ్బంది

# గుర్తింపు ఇవ్వలేదు..

>> జారీ చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు మే 31 వరకు వేసవి సెలవులు కొనసాగుతుండగా.. అడ్మిషన్లకు తుది గడువు మే 31 వరకు అంటూ పేర్కొంది. అంటే రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో వేసవి సెలవుల్లోనే అడ్మిషన్లను తీసుకోవాలని ఇన్‌డైరెక్ట్‌గా ఇంటర్ బోర్డు ఆదేశించినట్టయింది. ఈ ఏడాది ఫిబ్రవరి 1న ఇంటర్ బోర్డు కార్యదర్శి ఇతర అధికారులు ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ కోసం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ సందర్భంగా విలేకరులు ప్రతి ఏడాది రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు గుర్తింపు ఇవ్వకుండానే అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇస్తున్నారని.. అలాగే గుర్తింపు ప్రక్రియ కూడా చాలా ఆలస్యం అవుతుందని పేర్కొనగా.. ఈ ఏడాది 2025-26లో అలా కాకుండా అఫ్లియేషన్ ప్రక్రియ పూర్తయిన తరువాతనే అడ్మిషన్లకి నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని విలేకరులకు తెలిపారు. తీరా వచ్చేసరికి ఇంటర్ అడ్మిషన్ల నోటిఫికేషన్ విషయంలో ప్రతి ఏడాదిలాగానే ఈ సారి కూడా ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు ఇవ్వకముందే అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ నెల 1 నుంచి 31 వరకు అడ్మిషన్లు తీసుకోనున్నట్టు ప్రకటించారు. జూన్ 2 నుంచి క్లాసులను ప్రారంభించాలని.. జూన్ 30లోపు మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. మే 3 రాత్రి 9 గంటల వరకు కూడా రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్ కాలేజీలకు కూడా ఇంటర్ బోర్డు 2025-26 అనుమతి ఇవ్వలేదు. శనివారం(మే 3) సాయంత్రం వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్ కాలేజీల్లో 1810 కాలేజీలు గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నట్టు ఇంటర్‌బోర్డు అధికారులు తెలిపారు. అయితే వాటిలో కూడా ఏ ఒక్క కాలేజీకి 2025-26 విద్యా సంవ్సరానికి సంబంధించిన అనుమతిని ఇవ్వలేదు. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అపరాధ రుసుం లేకుండా నేటి(మే 4 ఆదివారం)తో గడువు ముగియనుంది. అపరాధ రుసుంతో జూన్ 8 వరకు అవకాశం కల్పించారు. ఇంటర్ బోర్డు ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలకు ఇవ్వాల్సిన అనుబంధ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయకుండానే రాష్ట్రంలో ఇంటర్ అడ్మిషన్లకు షెడ్యూల్‌ను జారీ చేసింది. జూన్ 30 వరకు మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగించడానికి అనుమతి ఇచ్చారు. జూన్ 2 నుంచే ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు క్లాసులను ప్రారంభించనున్నట్టు షెడ్యూల్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, గురుకులాలు, మోడల్ స్కూల్, కేజీబీవీలు, కంపోజిట్ కాలేజీలు అన్ని కూడా ఈ షెడ్యూల్‌ను అమలు చేయాలని బోర్డు కార్యదర్శి ఉత్తర్వులో స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు ఆయా కాలేజీల్లో ఎన్ని సెక్షన్లకు అనుమతి ఉంది.. ఎన్ని సీట్లకు అనుమతి ఉందనే విషయాన్ని కాలేజీ ఎంట్రన్స్‌లో స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రతి రోజూ కూడా ఆయా కాలేజీలు ఏ ఏ కోర్సులో ఎంత మంది చేరారు.. ఇంకా ఎన్ని సీట్లు ఖాళీ ఉన్నాయో తప్పకుండా పేర్కొనాలని సూచించారు. కాలేజీలు ప్రతి సెక్షన్‌లో 88 మందికి మించి అడ్మిషన్లు తీసుకోరాదని స్పష్టం చేశారు. అదనపు సెక్షన్లకు అనుమతి తీసుకున్న తరువాతనే అడ్మిషన్లను చేపట్టాలని స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమించిన కాలేజీలకు పెనాల్టీలను విధించడమే కాకుండా గుర్తింపు రద్దు చేసే అవకాశాలను పరిశీలించనున్నట్టు బోర్డు కార్యదర్శి షెడ్యూల్ జారీలో స్పష్టం చేశారు. అడ్మిషన్ తీసుకునే ప్రతి విద్యార్థి ఆధార్ తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎస్సీ-15 శాతం, ఎస్టీ-10 శాతం, బీసీ-29 శాతం, పీహెచ్‌సీ-5 శాతం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్-5 శాతం, ఎక్స్‌సర్వీస్ మెన్-3 శాతం, ఈడబ్ల్యూఎస్-10 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని.. 33 శాతం బాలికలకు రిజర్వేషన్లను అమలు చేయాలని పేర్కొన్నారు.

## దేశం గర్వించేలా 'యంగ్ ఇండియా' స్కూల్స్

>> రెసిడెన్షియల్ స్కూల్స్ ని డిజైన్ చేయడం జరిగిందని వివరించారు. ప్రజా ప్రభుత్వ ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మాదిరిగా దేశంలో ఎక్కడ కూడా ఇలాంటి స్కూల్స్ లేవన్నారు. గత దశాబ్ద కాలంగా బిఆర్ఎస్ కబంధ హస్తాలలో కొట్లాడి కోరి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధికి దూరమైందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సకల సదుపాయాలతో కూడిన విద్యా, వైద్యం అందించడానికి ముందుకు వెళ్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బ్రాండ్ గా యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసుకొని రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యా బోధన అద్భుత ప్రజు పాఠావాలతో ప్రపంచంతో పోటీపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామమని ప్రజా ప్రభుత్వం ప్రకటన చేసినప్పుడు ఇది సాధ్యమేనా? అంటూ టిఆర్ఎస్ హాస్యస్పదం చేసిందని, ఎల్కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని ప్రకటన (టిఆర్ఎస్)మేము చేసినట్లుగానే ఇది కాగితాలకే పరిమితం అవుతుందని టిఆర్ఎస్ భావించిందన్నారు. 21 వేల కోట్ల రూపాయలతో రాష్ట్ర వ్యాప్తంగా 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు కాబోతున్నాయని, ఈ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు క్రికెట్, ఫుట్బాల్ అవుట్డోర్, ఇండోర్ ఆటలకు సంబంధించి క్రీడా ప్రాంగణాలు ఉండే విధంగా దాదాపు 25 ఎకరాల్లో డిజైన్ చేశామని వివరించారు. విద్యార్థులతో పాటు టీచింగ్ స్టాఫ్!! ఉండే విధంగా వసతి గృహాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పాఠశాల నిర్వాహణకు సంబంధించి వాటర్, విద్యుత్, సెక్యూరిటీ సిబ్బంది కూడా ఇందులోనే వసతి ఉండేలా డిజైన్ చేశామన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వ ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ దేశానికి రోల్ మోడల్ గా నిలువబోతాయన్నారు.

## కులగణనపై రెండు భారీ సభలు

>> ఈ నేపథ్యంలో తాజాగా కేంద్ర ప్రభుత్వం సైతం కులగణనకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరిస్తోందని కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా చెబుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రాష్ట్రంలో భారీ బహిరంగ సభను నిర్వహించి తెలంగాణలో తాను అనుసరించిన విధానం, తమ డిమాండ్ వల్లే కేంద్ర ప్రభుత్వం కులగణకు సిద్ధమైంది అనే సందేశాన్ని దేశానికి పంపేలా సభ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.
ఈ సభలను త్వరలోనే నిర్వహించేందుకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఎప్పుడు నిర్వహించేందుకు వీలు ఉంటుందనే విషయంపై రెండు, మూడు రోజుల్లో స్పష్టతకు రానున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ లోటుపాట్లను గాడిలో పెట్టేందుకు తమకు ఇంతకాలం పట్టిందని ఇకపై పరిపాలనపై మరింత దృష్టి సారిస్తామని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే భారీ స్థాయిలో అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. సిఎంఓలో కూడా కొంత వరకు ప్రక్షాళన చేశారు. జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ, కేంద్రం కులగణన ఈలోగా ప్రారంభిస్తే స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయాల్సి రావచ్చునని అంటున్నారు.
ఇదిలా ఉంటే మంత్రివర్గ విస్తరణ చేయాలని ఆశావాహులు అధిష్ఠానంపై వత్తిడి చేస్తున్నారు. దాదాపు ఖాయం అనుకున్న మంత్రివర్గ విస్తరణ గత నెలలో వాయిదా పడింది. ఈ విషయంలో తెరపైకి కొత్త కొత్త డిమాండ్లు వస్తున్నాయి. అయితే ఈ అంశాన్ని ఇక నాన్చకూడదనే డిమాండ్లు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఈ అంశాన్ని శనివారం పార్టీ పెద్దలతో సిఎం కలిసి చర్చించినట్లు సమాచారం. అలాగే ఆపరేషన్ కగార్ ఆపాలని ఇటీవల శాంతి చర్చల కమిటీ సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. దీనిపై పార్టీ నిర్ణయం తర్వాతే ప్రభుత్వ ప్రకటన ఉంటుందని సిఎం వెల్లడించారు. ఈ అంశాన్ని కూడా పార్టీ పెద్దల దృష్టికి సిఎం తీసుకెళ్లినట్లు సమా చారం. కాగా, ఆయన శనివారంఢిల్లీలో పర్యటన ముగించుకు న్న సిఎం రేవంత్‌రెడ్డి రాత్రి హైదరాబాద్‌కు వచ్చేశారు.

## నేడు నీట్ పరీక్ష

>> విద్యార్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తున్నందున.. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు త్వరగా చేరుకోవాలని అధికారులు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ నుంచి నీట్-2025కి 72,507 మంది దరఖాస్తు చేసుకున్నారు. నీట్ పరీక్ష నేపథ్యంలో ఎంట్రెన్స్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీట్ ఎంట్రెన్స్ నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. రాష్ట్రంలో నీట్ ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహణకు 190 కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 72,507 మంది ఈ పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల లోపు పరీక్షా కేంద్రాలకు అనుమతించడం జరుగుతుందని స్పష్టం చేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పరీక్షను ప్రశాంతంగా నిర్వహించడానికి పరీక్ష కేంద్రాల వద్ద విస్తృత బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. నీట్ పరీక్షా కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లను చేస్తున్నామని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకోవడానికి, సరిపడా బయో మెట్రిక్ మిషన్లను సమకూర్చుకోవాలని సూచించారు. నీట్ పరీక్షలకు హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 62 పరీక్ష కేంద్రాలున్నాయని, వాటిలోనే 26,000 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో ఒక సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా, ఒక పోలీస్ అధికారిని ప్రత్యేకంగా నియమిస్తున్నట్టు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి టీవీలను, మౌలిక సదుపాయాలైన తాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

## నేటితో ముగియనున్న ఎప్ సెట్ పరీక్షలు

### శనివారం పరీక్షలకు 93.8 శాతం హాజరు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్(ఈఏపి) సెట్-2025 పరీక్షలు నేటి(ఆదివారం)తో ముగియనున్నాయి. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరగగా.. మే 2 నుంచి ఇంజనీరింగ్ పరీక్షలు జరుగుతున్నాయి. నేటితో ఇంజనీరింగ్ పరీక్షలు కూడా ముగియనున్నాయి. రెండోరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎప్ సెట్- 2025 కన్వీనర్ ప్రొఫెసర్ దీన్ కుమార్, కో కన్వీనర్, జేఎన్టీయూ రెక్టార్ ప్రొఫెసర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. శనివారం జరిగిన పరీక్షకి 93.87 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈఏపీ సెట్-2025కి 3,06,796 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో ఇంజనీరింగ్‌కి 2,20,049 దరఖాస్తులు వచ్చాయి. పరీక్షల నిర్వహణ కోసం 124 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను రెండు సెషన్‌లలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు .. తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. శనివారం ఇంజనీరింగ్ పరీక్షకి ఉదయం సెషన్‌లో 36,892 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 34,607 మంది హాజరయ్యారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 93.81 శాతం మంది హాజరయ్యారు. రెండో సెషన్‌లో 36,885 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 34,620 మంది హాజరయ్యారు. రెండో సెషన్‌లో పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 93.86 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు.



అవార్డు స్వీకరిస్తున్న స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండి ఐఎఫ్ఎస్ అధికారి సోనిబాలదేవి

## తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి ఫుట్‌బాల్ ప్రోత్సాహక అవార్డు

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ క్రీడను ప్రోత్సహించడంలో విశేషకృషి, సహకారం అందించినందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణను అఖిలభారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఎఐఎఫ్ఎఫ్) ఎఐఎఫ్ఎఫ్ వార్షిక అవార్డుల దినోత్సవం సందర్భంగా సత్కరించింది. ఈ మేరకు భువనేశ్వర్‌లో జరిగిన వార్షికోత్సవాల్లో తెలంగాణకు ఈ అవార్డు అందజేయగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలాదేవి ఐఎఫ్ఎస్ ఈ అవార్డును అందు కున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్‌చౌబే, ఒడిశా గౌరవ ఉపముఖ్యమంత్రి కనక్‌వర్ధన్ సింగ్‌దేవ్, ఒడియా భాషా సాహి త్యం, సాంస్కృతిక శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, ఐఎఎస్, ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండి సోనిబాలదేవి మాట్లాడుతూ ఇది తెలంగాణ ఫుట్ బాల్‌కు దక్కిన గౌరవమని, రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని పెంపొం దించడానికి తెలంగాణ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఎఐఎఫ్ఎఫ్‌కు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

## బలహీనవర్గాల అభివృద్ధికి కృషిచేసిన దామోదర సంజీవయ్య

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విహెచ్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** బలహీనవర్గాల అభివృద్ధికి కృషిచేసిన నాయకుడు దామోదర సంజీవయ్య అని ఆయన వర్ధంతిని జరుపుకొని ఘనంగా నివాళ్ళు అర్పించాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన దామోదర సంజీవయ్య వర్ధంతి మే 7 వ జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నివాళులు అర్పించాడానికి పార్టీ ముఖ్య నేతలంతా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.. దామోదర సంజీవయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహ ఆవిష్కరణ కోసం అదే రోజు వారి గ్రామానికి వెళ్తున్నా అని తెలిపారు. సొంత ఇల్లు లేని ఏకైక ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య అని ఆయన అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా దామోదర సంజీవయ్య అందించిన సేవలు వెలకట్టలేనివని గుర్తుచేసుకొన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పిరియడ్ లో బలహీన వర్గాల కోసం దామోదర సంజీవయ్య ఎనలేని కృషి చేశారు . నెక్లెస్ రోడ్డులో ఉన్న సంజీవయ్య విగ్రహానికి నివాళులు అర్పించడానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, శ్రేణులు భారీగా హాజరుకావాలని కోరినారు.

## రంగనాయకసాగర్‌లో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థుల మృతి

**చిన్నకోడూరు, మే 3, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్‌లో ఇద్దరు విద్యార్థులు ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. సిద్దిపేట ఎసిపి మధు అందించిన వివరాల ప్రకారం.. వరంగల్ పట్టణానికి చెందిన యాకుబ్‌బాబా, యజాజిఅలీ రెండు కుటుంబాలు హైదారాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యంలో రంగ నాయకసాగర్‌లో ఈత కొడుదామని వెళ్లినట్లు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న యజాజి అలీ కుమారుడు అర్బాజ్(15), యాకుబ్‌బాబా కూతురు మెహరాజ్(13) రంగ నాయకసాగర్‌లో సరదా కోసం ఈత కొడు తుండగా నీటిలో గల్లంతై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ సంఘ టన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో వెతికి మెహరాజ్, అర్బా జ్ మృతదేహాలను బయటకు తీశారని తెలిపారు. బాధితులు ఫిర్యాదు మేం కు చిన్నకోడూరు పోలీసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజలతో పోలీసులు స్నేహంగా మెలగాలి

### ఎస్‌హెచ్‌ఒల భేటీలో డిజిపి జితేందర్ వెల్లడి


డిజిపి కార్యాలయంలో శనివారం కొందరు ఎస్‌హెచ్‌ఒలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి జితేందర్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** పోలీసు స్టేషన్లకు వచ్చే ప్రజలతో పోలీసులు స్నేహంగా మెలగాలని, వారి సమస్యలు విని పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేయాలని డిజిపి జితేందర్ అన్నారు. పోలీసులంటే ప్రజలకు గౌరవం పెరిగేలా చూడాలని ఆయన తెలిపారు. డిజిపి కార్యాలయంలో కొందరు ఎస్‌హెచ్‌ఒలతో శనివారం జరిగిన భేటీలో డిజిపి జితేందర్ మాట్లాడుతూ అమెరికా సహా అనేక దేశాల్లో పోలీసులను ప్రజలు మిత్రులుగా చూసేవిధంగా మసలుకోవాలని కోరారని అన్నారు. భారత్‌లో పోలీసులంటే ఇప్పటికీ భయం వుందనే భావన వుందని, అమెరికా సహా అనేక దేశాల్లో దీనికి విరుద్ధంగా వుండడంతో పాటు అక్కడి పోలీసులను ప్రజలు ఎంతో గౌరవిస్తారని, ఇలాంటి పద్ధతి మన దేశంలోనూ రావాలని ఆయన అన్నారు. న్యాయం కోసం పోలీసు స్టేషన్లకు వచ్చేవారితో పోలీసులు సహృదయంతో మెలగాలని, ఇలా చేయడం వల్ల ప్రజల మనస్సులను గెలుచుకునే అవకాశం వుంటుందని ఆయన తెలిపారు. ఏదో కారణంగా పోలీసులు విధుల్లో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తే దాని ప్రభావం మొత్తం పోలీసు శాఖపై పడుతుందని ఆయన అన్నారు. పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ పక్షపాత ధోరణికి దూరంగా వుండాలని ఆయన కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న మిస్‌వరల్డ్ పోటీలకు బందోబస్తు నిమిత్తం పోలీసులు సన్నద్ధంగా వుండాలని డిజిపి జితేందర్ కోరారు. తమ తమ ప్రాంతాల్లో బందోబస్తును పక్కాగా ఏర్పాటు చేసుకోవాలని, ఎక్కడా తేడా రాకుండా చూడాలని ఆయన కోరారు. దేశంలోనే ఉత్తమ పోలీసింగ్‌కు రాష్ట్ర పోలీసు శాఖ పెట్టింది పేరుగా ఉందని, దీనిని ఇలాగే కొనసాగేలా చూడాలని, మిస్‌వరల్డ్ పోటీలకు బందోబస్తు నవ్యంగా ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. శాంతిభద్రతల అదనపు డిజిపి మహేష్ భగవత్ మాట్లాడుతూ మిస్‌వరల్డ్ పోటీలకు బందోబస్తును పక్కాగా ఏర్పాటు చేయాలని ఎస్‌హెచ్‌ఒలను కోరారు. ఈ పోటీలకు సమయం దగ్గర పడుతున్నందున పోలీసులు ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని ఆయన సూచించారు. కొందరు ఈ పోటీలను వ్యతిరేకిస్తున్నందున పోటీదారులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై వుందని ఆయన అన్నారు. మరో నెల రోజుల్లో వ్యవసాయ పనులు మొదలు కానుండడంతో కల్తీ విత్తనాలు, ఎరువుల బెడద లేకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఐజి రమణ కుమార్, డిఎస్‌పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ డిఏలు మంజూరు చేయాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి టిఆర్‌టిఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలి తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టిఆర్‌టిఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు కొత్తగా నియమితులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకి సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పైన సంపూర్ణ అవగాహన కలిగి ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి రామకృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడం పట్ల సంఘం నేతలు శనివారం ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు. సిఎస్‌ని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 5 డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా మార్చి నెల తర్వాత పరిశీలిస్తామని గతంలోనే హామీ ఇచ్చినందున పెండింగ్ డీఏల విడుదలకు చొరవ తీసుకోవాలని కోరారు. వాటితోపాటుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బిల్లులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో పెట్టారని, వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు.

పాత పెన్షన్ పునరుద్ధరణ, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2003 డీఎస్సీ వారిని పాత పెన్షన్ పరిధిలోకి తీసుకుని వచ్చేందుకు సత్వరం చర్యలు చేపట్టాలని టిఆర్‌టిఎఫ్ నేతలు సీఎస్‌కి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ బదిలీలు ప్రతి సంవత్సరం వేసవిలో నిర్వహించి విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే పూర్తి చేసేలా శాశ్వత బదిలీ కోడ్ రూపకల్పనకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఢిల్లీ పర్యటనతో రేవంత్‌రెడ్డి తెలంగాణకు ఏం సాధించారు?

### 42 సార్లు ఢిల్లీకి చక్కర్లుకొట్టినా నోరు మెదపడం లేదు: మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 3:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 42 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినా.. తెలంగాణకు సాధించింది ఏంలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒ పత్రిక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణకు జరిగే నష్టంపై నోరు మెదపకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. మరోవైపు ఉపాధి హామీ కూలీలకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని.. వారి జీవితాలతో ఆడుకుంటుందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు కేంద్ర ప్రభుత్వం రెండు కలిసి ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రానికి మంజూరైనా నరేగా పనిదినాలను కేంద్ర ప్రభుత్వం సగానికి తగ్గించడం శోచనీయమని అన్నారు. 2024-25లో 12.22 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా, ఈ సంవత్సరం కేవలం 6.5 కోట్ల పనిదినాలకే పరిమితం చేసిందని ఆరోపించారు.

కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 మంది ఎంపీలు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నరేగా పనిదినాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 4 నెలల వేతనాలు చెల్లించాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు.

## త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

### మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటి ఏర్పాటు చేసి అన్ని క్రీడల అభివృద్ధికి జిల్లాల వారిగా ప్రత్యేక అకాడమీలు నెలకొల్పుతామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. క్రీడల్లో గ్రామీణ ప్రాంత యువత శిక్షణకు ప్రాధాన్యత నిచ్చేలా తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. చదువుతో పాటు ప్రతి ఒక్కరు క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని ఆయన కోరారు. శనివారం నాడు మంత్రుల నివాసంలో తనను కలిసిన తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన సలహాదారు కోసరాజు లక్ష్మణ్, మీడియా కో-ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డిలను అభినందించారు. వారికి నియామక పత్రాలు అందజేసారు. బ్యాడ్మింటన్ క్రీడ మరింత విస్తరించేందుకు పాటు పడాలని తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిన శ్రీధర్‌బాబు వారికి దిశానిర్దేశం చేసారు. మంత్రిని కలిసిన వారిలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్ ప్రతినిధి యువిఎన్‌బాబు తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

### ఆహార, పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డిఎస్ చౌహాన్



**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు ఏజన్సీలు ట్యాబ్ ఎంట్రీ వేగంగా చేస్తే ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవతంగా ముగుస్తుందని రైతు ఖాతాలోకి ఎమ్మెస్పీ డబ్బులు కూడా చేరు తాయని ఆహార పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డిఎస్ చౌహాన్ తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లాలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి కొనుగోలు వ్యవహారాలను పరిశీలించి కొనుగోలు కేంద్ర నిర్వహకులకు తగిన సూచనలు కూడా చేశారు. ఉనికిచర్ల, ధర్మసాగర్, తెల్లకులగూడెం ప్రాథమిక కొనుగోలు కేంద్రాల్లో ఆయన మాట్లా డుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు కల్పించాలని టార్పాలిన్ కవర్లు ఉండాలని ప్యాడీ తేమ కొలిచేయంత్రాలు సరిగా పనిచేస్తున్నాయా లేవా చూసుకోవాలని కోరారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటవెంట జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. ధర్మసాగర్ ఐకెపి కొనుగోలు కేంద్రంలో కూడా ఆయన తనిఖీ చేశారు. ప్రతి వరి కొనుగోలు కేంద్రానికి వాతావర ణ హెచ్చరికల సమాచరం కూడా అందిస్తున్నామని దీనిని బట్టి ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేసు కోవాలని సూచించారు. సగటు నాణ్యతా ప్రమా ణాలు కలిగిన సరుకులు తీసుకొని రావాలని ఎలాంటి కోతలు ఉండవని ఆయన రైతులతో మా ట్లాడుతూ తెలిపారు. రైతులు తేమ, తాలు, మట్టిపెళ్లలు లేకుండా చూడాలని సూచించారు.

## జలమండలిపై అభివృద్ధి పనులపై పురపాలక శాఖ సెక్రటరీ ఇలంబర్తి సమీక్ష

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** జలమండలిలో పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు, మంచినీటి సరఫరా మురుగునీటి వ్యవస్థ నిర్వహణపై రానున్న మూడు సంవత్సరాలను లక్ష్యంగా చేసుకుని చేపట్టాల్సిన కార్యాచరణపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి సమీక్ష నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన ఈ సమీక్షా సమావేశానికి ఎండి అశోక్‌రెడ్డితో పాటు, ఐడి మయాంక్ మిట్టల్, డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎండి అశోక్ రెడ్డి జలమండలిలో పురోగతిలో ఉన్న వివిధ ప్రాజెక్టులు, బోర్డులోని వివిధ విభాగాలు వాటి పనితీరు, నగరానికి నీటి సరఫరా, ఎస్‌టిపిలు, మురుగు శుద్ధి నిర్వహణతో పాటు భవిష్యత్తు ప్రణాళికలు, ప్రాజెక్టుల గురించి వారికి వివరించారు. అలాగే జలమండలిలో చేపట్టిన వివిధ సంస్కరణలు, రెవెన్యూ, ఐటి, ట్యాంకర్ బుకింగ్ డెలివరీ, మెట్రో కస్టమర్ కేర్, స్కాడా సిస్టం, పని చేసే ప్రాంతాల్లో కార్మికుల కోసం జలమండలి చేపట్టే రక్షణ చర్యలతో పాటు ఇప్పటి దాకా చేపట్టిన ప్రాజెక్టులు కృష్ణా, గోదావరి, హడ్కో రిజర్వాయర్లు, ఓఆర్ఆర్ ఫేజ్ 1, 2 ప్రాజెక్టులు, మురుగు శుద్ధి కోసం చేసే ఎస్‌టిపిల ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా పురపాలకశాఖ సెక్రటరీ ఇలంబర్తి మాట్లాడుతూ రానున్న మూడు నెలలు, సంవత్సరంలో జలమండలి చేపట్టే వివిధ ప్రాజెక్టులు, తాగునీరు, సివరేజ్ నిర్వహణపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అదేవిధంగా జలమండలి వేసవి కార్యాచరణపై చర్చించిన సెక్రటరీ నగరంలో ట్యాంకర్ బుకింగ్, డెలివరీల సరళి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్లు సుదర్శన్, శ్రీధర్, ఫైనాన్స్ డైరెక్టర్ పద్మావతి, పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సిజిఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ఐ సెట్-2025 దరఖాస్తు గడువు 10వ తేదీ వరకు పెంపు

### ఇప్పటి వరకు 51,857 మంది దరఖాస్తు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్-2025కి సంబంధించిన దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్టు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆలువాల రవి తెలిపారు. శనివారం(మే 3)తో దరఖాస్తు గడువు ముగియడంతో.. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు గడువును ఈ నెల 10 వరకు పొడిగించినట్టు కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను మార్చి 10 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మార్చి 6న జారీ చేశారు. ఇప్పటి వరకు 51,857 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలను జూన్ 8, 9 తేదిల్లో రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు రూ. 550 కాగా.. జనరల్ విద్యార్థులకు రూ. 750గా నిర్ణయించారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

## బంజారాహిల్స్‌లో స్వాధీనం చేసుకున్న 12 ఎకరాల స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడే పనులకు వినియోగిస్తాం

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** బంజారాహిల్స్ రోడ్ నెం12లోని ఎమ్మెల్యే కాలనీని అనుకుని ఉన్న 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడే పనుల కోసం వినియోగిస్తామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. షేక్‌పేట మండల పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం 12లో కబ్జాదారుల నుంచి కాపాడిన 12 ఎకరాల స్థలాన్ని శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఎన్నో ఏళ్లుగా అనేక రకాలైన వివాదాలు సృష్టించి ఎమ్మెల్యే కాలనీ పక్కనున్న ప్రభుత్వ స్థలాలను ఆక్ర మించేందుకు ప్రయత్నాలు జరిగాయని, స్థానిక తహసీల్దార్ అనితారెడ్డితో పాటు జిల్లా యంత్రాంగం సమన్వయంతో స్థలాన్ని కాపాడడంతో పాటు ఫెన్సింగ్ వేయించడం అభినందనీయమన్నారు. ఈ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడేలా వినియోగిస్తామని మంత్రి పేర్కొన్నారు.


hmda

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
అర్బన్ ఫారెస్ట్రీ
HGCL ఆఫీస్ బిల్డింగ్, నానక్‌రామ్ గూడ, హైదరాబాద్-500032

టెండర్ ప్రకటన

RC.No.02/LSD/UF/HMDA/2025, తేది: 30.04.2025

HMDA, సంజీవయ్య & NTR పార్క్‌ల వద్ద స్ప్రింక్లర్/హాప్ అప్ సిస్టమ్ నెలకొల్పటానికి మరియు BPP పార్క్‌లలో పని చేసే తోటమాలిలకు ESI & EPF సర్వీస్‌ల ఏర్పాటుకు ఏజెన్సీ ఎంపిక నిమిత్తం అటువంటి స్వభావం గల పనులు అమలు చేయడంలో గతంలో అనుభవమున్న ఏ రాష్ట్రానికి చెందిన వారైనా నమోదిత కాంట్రాక్టర్లు లేదా కేంద్ర ప్రభుత్వ విభాగాలు/సంస్థల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై టెండర్లు ఆహ్వానిస్తోంది. టెండర్ దాఖలుకు చివరి తేది: 20.05.2025. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ http://tender.telangana.gov.in దయచేసి వీక్షించండి.

సం/- డైరెక్టర్, అర్బన్ ఫారెస్ట్రీ, HMDA

DIPR.No.1298-PP/CL/Advt/1/2025-26, తేది: 03.05.2025



**BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD-II**
First Floor, Triveni Complex, Abids, Hyderabad

**Case No. OA (TA) No. 412 OF 2022**
**Summons under Sub section(4) of Section 19 of the Act, read with sub rule(2A) of rule 5 of Debt Recovery Tribunal (Procedure) Rule.1993**

**Between: M/s. Asset Reconstruction Company Limited** (herein referred as **ARCIL**), A Securitization and Asset Reconstruction Company, Having its registered Office at Ruby, 10th Floor, 29, Senapati Bapat Marg, Dadar (West), Mumbai-28. Having its Branch at 207, Bhuvana Towers, S D Road, Secunderabad. Rep.by its Authorized Officer, **Sri Ganta Sreeram, S/o. G S Raju**, Aged 51 Years, Occ.chief Manager/ Authorized Officer ... **Applicant**

**AND**

**1) Sailesh Kumar Gujjar, S/o. Late G Nagender Rao (HUF, Karta)**, R/o.4-1-42, 43 & 45/A, Subash Road, old Bhoiguda, Secunderabad-500003.
**2) Nandini Gujjar, W/o. Sailesh Kumar Gujjar**, R/o.4-1-42, 43 & 45/A, Subash Road, Old Bhoiguda, Secunderabad-500003. ... **Defendants**

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

Whereas **OA. (TA) No.4/2024** was Listed before Hon'ble Presiding Officer/ Registrar on 28.04.2025 Where this Hon'ble Tribunal is pleased to issue summons/ Notice on the Said Publication U/s.19(4) of the Act. (OA) Filed against you for Recovery of **Rs.2,18,32,913-96 Paisa** (Application along with Copies of Documents etc. Annexed). In accordance with sub sec.(4) of Sec.19 of the Act. you the defendants are directed as under.
(i) To Show Cause within **30 days** of the service of Summons as to why relief Prayed for Should not be granted.
(ii) To disclose particulars of parties or assets other than Properties and assets Specified by the Applicant Under Serial No.3A of the Original Application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or Such Other assets and properties disclosed under serial No.3A of the Original Application, pending hearing and disposal of the application for attachment of properties.
(iv) You shall not transfer by way of Sale, Lease or otherwise, except in the Ordinary Course of your business any of the assets over which Security interest is created and Other assets and Properties specified or disclosed under serial No.3A of the Original application without the Prior approval of the Tribunal.
(v) You shall be Liable to account for the Sale Proceeds realized by the Sale of Secured assets or other Assets and Properties in the Ordinary Course of Business and deposit such sale proceeds in the Account maintained with the Bank or Financial Institution Holding security Interest over such assets.
You are also directed to File the Written Statement with a copy thereof furnished to the Applicant and to appear before **Registrar/ DRT-II on 14.07.2025 at 10.30 AM**, failing which the Application shall be heard and decided in your absence.
**Given Under my Hand and Seal of this Tribunal on this 03 day May 2025.**

Registrar


# మిస్‌వరల్డ్ పోటీల నేపథ్యంలో ట్రై కమిషనరేట్లలో హైఅలర్ట్

### పోటీల్లో పాల్గొంటున్న వారు పర్యటించే ప్రాంతాల్లో ముందస్తు భద్రత

### చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, యాదగిరిగుట్ట, రామప్ప దేవాలయంసహా ఇతరచోట్ల భారీ బందోబస్తు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం అదిరెలా ఉండాలని సర్కారు భావిస్తుండడంతో ఇందుకు తగినట్లుగా పోలీసు శాఖ భారీగా బందోబస్తు చేబట్టింది. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత దేశంలోని మరోసారి ఉగ్రవాదులు దాడులకు పాల్పడే వీలుందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో మిస్ట్ వరల్డ్ పోటీలకు వేదికగా ఉన్న హైదరాబాద్‌లో అసాధారణ భద్రత ఏర్పాటు చేశారు. ఈ నెల 10న మొదలై 20 రోజులపాటు సాగనున్న ఈ పోటీల్లో 120 దేశాలకు చెందిన పోటీదారులు పాల్గొననున్నారు. 116 దేశాల నుంచి సమ్మతం రాగా కొన్ని దేశాలకు చెందిన పోటీదారులు ఇప్పటికే నగరానికి చేరుకున్నారు. ఈ పోటీలు ఎక్కువగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధుల్లోనే ఉండనుండడంతో ట్రై కమిషనరేట్ల పోలీసులు అందుకు తగినట్లుగా బందోబస్తు చేబట్టారు. మిస్ వరల్డ్ పోటీదారులు జంటనగరాలతోపాటు శివార్లలోని పలు పర్యాటక ప్రాంతాల్లో పర్యటించనుండడంతో ఆయా ప్రాంతాల్లో ముందస్తు భద్రత చేబట్టారు. పోటీదారులు పాతబస్తీలోని లాడ్‌బజార్, మోతిగల్లీలలో పర్యటించనున్నారు. ఇక్కడ తయారయ్యే గాజులతోపాటు ఇక్కడి ముత్యాలకు దేశ విదేశాల్లో పేరుండడంతో ఈ రెండుచోట్ల పోటీదారులు పర్యటించి ఇక్కడి విశేషాలను తిలకించనున్నారు. దీంతో పాటు ఇదే ప్రాంతంలో గల పురాతన చౌమహల్లా ప్యాలెస్ వరకు పోటీదారులు ఈ నెల 12న హారిటేజ్ వాక్ చేయనున్నారు. దీంతో ఈ ప్రాంతంలో పోటీ దారులు హారిటేజ్ వాక్‌చేసే సమయంలో పోలీసుల నుంచి గుర్తింపుకార్డులు పొందిన వారు మినహా ఇతరులకు అనుమతి ఉండబోదు. 13నన చౌమహల్లా ప్యాలెస్‌లో పోటీదారుల కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేస్తుండడంతో ఇందుకోసం కూడా బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతోపాటు పోటీదారులు యాదగిరిగుట్ట, రామోజీ ఫిలిం సిటీ, రామప్ప దేవాలయం, పిల్లలమర్రి తదితర ప్రాంతాల్లోనూ పర్యటించనున్నారు. ఇందుకోసం పర్యాటక శాఖ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేయగా పోటీదారులను హైదరాబాద్ నుంచి పలు గ్రూపులుగా ఆయా ప్రాంతాలకు తీసుకువెళ్లే బాధ్యతలను పోలీసు శాఖ తీసుకుంది. మిస్ వరల్డ్ పోటీలకు బందోబస్తు ఏర్పాట్లను డిజిపి జితేందర్ స్వయంగా సమీక్షిస్తున్నారు.

బందోబస్తు నోడల్ ఆఫీసర్‌గా గ్రేహౌండ్స్ అదనపు డిజి స్టీపెన్ రవీంద్రను సర్కారు నియమించింది. ఆయా ప్రాంతాల్లోని పోలీసులతో ఆయన సమన్వయం చేసుకుని పోటీదారులకు భద్రతను పర్యవేక్షిస్తారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే పోటీదారులతోపాటు వారి వెంట వచ్చే ఆయా దేశాలకు చెందిన అతిథులు, అంతర్జాతీయ మీడియా సిబ్బంది విడిదిచేసే స్టార్‌హోటళ్లు, గెస్ట్ హౌస్‌ల వద్ద కూడా భద్రత పటిష్టం చేశారు.

మిస్ వరల్డ్ పోటీలు జరిగే సమయంలో యావత్ ప్రపంచం తెలంగాణవైపు చూసే వీలుండడంతో భద్రతలో ఎక్కడా తేడా రాకుండా పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంది. ఇక పాకిస్థాన్ ఉగ్రవాదుల హిట్ లిస్టులో హైదరాబాద్ చాలాకాలం నుంచి ఉండడం తెలిసిందే. మిస్ వరల్డ్ పోటీలకు భంగం కలిగించేందుకు ఉగ్రవాదులు ప్రయత్నించే వీలుందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో కేంద్ర నిఘా వర్గాల సహకారంతో రాష్ట్ర పోలీసులు భద్రతను పక్కాగా కొనసాగిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలకు బందోబస్తు తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొనడంతో పోలీసులు ఇందుకోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

# అధ్యయనం శూన్యం..ఆరాటం ఘనం

**భాగ్యనగర్ భాస్కర్ కుమార్**

సాగరమున్నా తీరనిది నీ దాహమురా..... కోకిలగానం కాకిపాడితే ద్రోహమురా" ఆచార్య ఆత్రేయ అన్నట్లు గోదావరి,కృష్ణా వాటి ఉపనదుల జలరాశుల పరవళ్లు తొక్కే తెలంగాణ గడ్డపై ఉన్న ప్రజలకు గొంతు తడుపుకోని పరిస్థితి దాపురించింది.. కాంట్రాక్టు సొమ్ముల కోసం లోపభూయిష్ఠ నిర్మాణాలు చేపట్టిన నీటిపారుదల శాఖ ఇంజినీర్లు ఎసిబి కేసుల్లో ఇరుక్కొనే సంకట పరిస్థితి నెలకొంది. పిసిఘోష్ నివేదిక వెలువడితే కాళేశ్వరం ఇఎన్‌సి హరీరామ్ బాటలో ఐఎఎస్‌లు, ఇంజనీర్లు కటకటాల వెనుకకుపోయే ప్రమాదం కూడా ఉంది. కాళేశ్వరం లిఫ్ట్‌ఇరిగేషన్ పథకం వైఫల్యంపై జాతీయ ఆనకట్టల ప్రాధికారసంస్థ తుదినివేదిక ఇచ్చిన తరువాత వాస్తవాలు మరుగునపడేందుకు తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న వాదోపవాదాలతో రాజకీయలు వేడెక్కినాయి. తెలంగాణ నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం కూలిన పాపం ముమ్మాటికి బిఆర్‌ఎస్‌దే అని నిందించారు. రోడ్లు భవనాలుశాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకట రెడ్డి ఒకడుగు ముందుకు వేసి "బుద్ది ఉన్నోడు మళ్ళీ కాళేశ్వరం మరమ్మతు కోరడు" అంటూ ఖరాఖండిగా ఆ ప్రాజెక్టు తెల్లఏనుగు అని సంకేతం ప్రజలకు ఇచ్చారు. బిఆర్ ఎస్ నాయకుడు కాళేశ్వరం నిర్మాణ సమయంలో నీటిపారుదలశాఖ మంత్రిగా వ్యవహరించినా హరీష్‌రావు తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టుకోవడానికి ఒప్పందంలేదు, డిపిఆర్‌లేదు,కానీ టెండర్లు పిలిచింద్రు ఎక్కడో పోయి చేవెళ్ళ కాడ తవ్వుతరు, మెదక్ జిల్లా సిద్ధిపేట వద్ద తవ్వింద్రుఅసలు తుమ్మడిహట్టి వద్ద ఒక్క తట్టెడు మట్టి ఎత్తిపోయలేదుకాంగ్రెస్ తప్పుచేసింది అంటూ కాంగ్రెస్‌ను నిందిస్తారు. మీరు చేసిన తప్పును సవరించడానికి మేం కాళేశ్వరంతో ప్రయత్నం చేశాం. తుమ్మడి హట్టి వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17డిసెంబర్ 2008 లో ప్రాణహిత చేవెళ్లకు శంకుస్థాపన చేశారు. 2007లోనే అంతకు ముందే టెండర్లు పిలిచారు కూడా, నాలుగేళ్లలో ప్రాణహిత చేవెళ్ల పూర్తి చేస్తామని ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ ప్రకటించారు. కానీ ఏడేళ్ల అధికారంలో ఉన్నా మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా కనీసం రెండు ప్రభుత్వాలు కలిసి అంతరాష్ట్ర ఒప్పందం చేసుకోలేదు. 2012 నాటికి ఆనాటినప్రభుత్వం తుమ్మడిహట్టి ప్రాజెక్టు నిర్మించక పోగా సర్వేఅండ్ మోబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరుతో రూ. 1426 కోట్లు పనిచేయకుండానే అడ్వాన్సులు కాంట్రాక్టరుకు నిధులు ముట్టజెప్పారు. ఆ నాలుగు ఏళ్లలో భూసేకరణ వంటి పనికోసం రూ.160కోట్లు వ్యయం చేశారు. ఆ దోపిడిలో నేటి నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆనాటి నీటి



పారుదలశాఖ మంత్రి సుదర్శన్‌రెడ్డిలు కూడా బాధ్యులే అంటూ హరీష్‌రావు ఆరోపిస్తూ రంగంలోకి దిగారు. తుమ్మడి హట్టిలో 160 టిఎంసిల నీరులభ్యత కాదని సిడబ్ల్యుసి ఇచ్చిన నివేదిక ఆధారంగానే కాళేశ్వరం ప్రతిపాదించామని ఇది కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ సూచించిన స్థలమే అంటూ హరీష్ రావు వాదిస్తున్నారు. తుమ్మడిహట్టి వద్ద కడితే కాంగ్రెస్‌కు పేరు ప్రతిష్టలు వస్తాయని కేవలం కీర్తి కండూతి, కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు దండుకోవడానికి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు సైట్ మార్చినట్లు కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి మొదలు బూత్‌లెవల్ కాంగ్రెస్ కార్యకర్తలు విమర్శిస్తున్నారు. కాళేశ్వరం నిర్మాణ లోపాలను ఎన్‌డిఎస్, విజిలెన్స్ నివేదికలు తప్పుపట్టాయి. ఎల్‌అండ్ టి సంస్థ మేడిగడ్డ లోపాలను పునరుద్దరణ చేయాలని కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌ప్రాజెక్టు నిర్మాణంలో భారీగానే అక్రమాలు జరిగాయని విజిలెన్స్ విచారణకు నివేదికలో పేర్కొంది. ఇటీవల ఎన్‌డిఎస్ ఇచ్చిన తుది నివేదిక కూడా "భారీ ప్రాజెక్టుల నిర్మాణాలకు థర్డ్‌పార్టీతో ఆడిట్ చేయించాలన్న నిబంధన ఉండగా అది అమలుకాలేదు. నీటిపారుదలశాఖ,నిర్మాణసంస్థ మినహా మరోపక్షంతో మదింపు చేయించి ఉంటేలోపాలను ఆదిలోనే పసిగట్టే వీలుండేది. నిర్మాణ సామగ్రి పరిమాణం.. నాణ్యత ప్రమాణాల మేరకు వినియోగిస్తున్నారా.. అవి మన్నుతాయా లేదా అనే పరీక్షలను థర్డ్ పార్టీతో చేయించలేదు. క్వాలిటీ కంట్రోల్ విభాగం చీఫ్ ఇంజినీర్ నేతృత్వంలో ఈప్రక్రియ జరగాల్సి ఉండగా అమలు చేయలేదు.నిర్మాణ ప్రారంభం నుంచి చివరివరకు ఎలైన్మెంట్, కోరింగ్ చేసే సమయంలో లోపాలున్నాయా అని క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లు పర్యవేక్షించాల్సి ఉంది. కానీ, పని ప్రాంతాలను పరిశీలించకుండానే ధ్రువీకరించినట్లు అవగతమవుతోంది" అంటూ నివేదించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలు పెను ప్రమాదంలో ఉన్నాయని జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ స్పష్టం చేసింది. ఇక ఆ బ్యారేజీలు యథాతథంగా నిరుపయోగమే అన్నరీతిలో నివేదికలోని అంశాలున్నాయి. ఈ బ్యారేజీలకు జరిగిన విస్తృత, పెను నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని...సమగ్ర పునర్నిర్మాణం, రీడిజైన్ చేయాలని పేర్కొంది. నిర్మాణ లోపాలు, డిజైన్ లోపాలు, నాణ్యత తనిఖీ లేకపోవడం, నీటి ఒత్తిడి ఎంత అన్నదానిపై తప్పుడు అంచనాలు. అన్నీకలిసి సీకెంట్ ఫైల్స్ కూలిపోవడం, బ్యారేజ్ ఎగువ,దిగువల్లో రంధ్రాలు పడ్డాయనితేల్చింది. మూడు బ్యారేజీలకు విస్తృత, పెను నష్టం జరిగిందని పేర్కొంది. ఈ నష్టం ఇక్కడితోనే ఆగదని, నీటి ఒత్తిడి ఎక్కువైతే మొత్తం పూర్తి బ్యారేజీలకే ప్రమాదమని పేర్కొంది. మూడు బ్యారేజీల్లోని ప్రతి ఒక్కటి ఈ ప్రమాదపుటంచులో ఉంటాయని తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు దెబ్బతిన్న నేపథ్యంలో ఏం చేయాలన్న దానిపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో కోరిన సంగతి తెలిసిందే. పలు పరీక్షలు చేసిన అనంతరం, దాదాపు 14 నెలల అధ్యయనం తర్వాత ఎన్‌డీఎస్‌ఏ తన నివేదికను గురువారం రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పంపించింది. నివేదికలో అనేక కీలక సిఫార్సులు చేసింది. సమగ్ర పునర్ నిర్మాణ డిజైన్ చేయాలని, జియో ఫిజికల్ పరీక్షలు, జియో టెక్నికల్ పరీక్షలు చేసి, ఆధునిక హైడ్రాలిక్ నమూనాలు(నీటి ప్రవాహ ఒత్తిడికి సంబంధించిన నమూనాలు)ను ఉపయోగించి ఈ పునర్ నిర్మాణ రీడిజైన్ చేయాలని చెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టుస్థిరత్వం, స్థితిస్థాపకతను నిర్ధారించేందుకు... అన్ని విభాగాల మధ్య సహకారం చాలా కీలకమని స్పష్టం చేసింది. నిర్మాణ సమయంలో నాణ్యతను తనిఖీ చేసే మంచి వ్యవస్థ లేదని, ప్రత్యేకించి కటాఫ్ గోడలు నీటి ఒత్తిడిని తట్టుకునేలా నిర్మించలేదని తెలిపింది. ర్యాఫ్ట్‌కు, కటాఫ్ వాల్స్‌కు నేరుగా సంబంధం ఉందని చెప్పింది. బ్యారేజీలు దెబ్బతినడానికి ఈ రెండూ ప్రధాన కారణాలని తెలిపింది. బ్యారేజీపై అదే ఒత్తిడి పడితే మొత్తం బ్యారేజీ అంతా ప్రమాదంలో పడుతుందని వెల్లడించింది. మిగతా రెండు బ్యారేజీల పరిస్థితి కూడా అదే విధంగా ఉన్నట్లు తెలిపింది. "బ్యారేజీల నిర్మాణం చేయడానికి నిర్మాణ ప్రదేశాల్లో భూసారం తెలుసుకోవడానికి తగిన పరీక్షలు చేయాలి. అయితే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఒకచోట ప్రతిపాదించి, మరో చోటికి మార్చారు. ఈక్రమంలో భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలు చేయకుండానే నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టుల డీపీఆర్‌కు అనుమతి రాకముందే నిర్మాణం చేపట్టారు" అని నివేదిక ఆక్షేపించింది."జాతీయ ఆనకట్టల భద్రత చట్టం2021 ప్రకారం వానాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయనే దాన్ని పరిశీలించాలి. 2022 వరదల కన్నా ముందు, తర్వాత బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయనే దాన్ని పరిశీలించలేదు. నిబంధనల ప్రకారం ఈ రిపోర్టులు తయారుచేసే బాధ్యత డ్యామ్ ఓనర్‌దే(మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల చీఫ్ ఇంజనీర్). అయితే డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారం బ్యారేజీలను పరిశీలించనే లేదు. మూడు బ్యారేజీల్లోనూ హైడ్రో మెకానికల్ లోపాలున్నాయి" అని నివేదిక గుర్తు చేసింది. ●


భారత పార్లమెంట్ జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థను (ఎన్‌డిఎస్ఎ)ను రాజ్యాంగంలోని 246 ప్రకరణ ప్రకారం ఏడో షెడ్యూల్‌లోని ఉమ్మడి జాబితాలోని ఎంట్రీ 56,97లను ఉపయోగించి 2021లో రూపొందించారు. ఎన్‌డిఎస్‌ఎ ఒక కేంద్ర నియంత్రణ సంస్థగా ఉంటుంది.డ్యామ్‌భద్రత, ప్రమాణాలు అమలు చేయిస్తుంది. డ్యామ్ భద్రతకు మార్గదర్శకాలు రాష్ట్రాలమధ్య భద్రతావివాదాలు పరిష్కరిస్తుంది.డ్యామ్‌ల ప్రమాదాలు నివారణకు ప్రమాదాల మూల్యాంకనం చేయడం భద్రత చర్యలపై సలహాలుఇస్తుంది. లోక్‌సభలో 2ఆగస్టు 2019,రాజ్యసభలో 8 డిసెంబరు 2021లో ఆమోదం తెలుపగానే భారత రాష్ట్రపతి 13డిసెంబరు 2021లో గెజిట్ ప్రకటించారు.ఎన్‌డిఎస్‌ఎ 8డిసెంబరు 2021లో అమలులోకి రాగా భారత జలశక్తి మంత్రిత్వశాఖ 18ఫిబ్రవరి 2022లో ఎన్‌డిఎస్‌ఎ సంస్థకు అస్థిత్వంకల్పించింది. జాతీయ డ్యామ్ సేఫ్టీచట్టం ఉద్దేశ్యం డ్యామ్‌లవైఫల్యం వల్ల కలిగే విపత్తులను నివారించేందుకు, డ్యామ్‌లను సమర్థవంతంగా పర్యవేక్షించడం, తనిఖీచేయడం నిర్వహించడం, రక్షణచర్యలు తీసుకోవడం ద్వారా మానవ జీవనం, ఆస్థి, పర్యావరణం రక్షించే శక్తివంతమైన ఒక ప్రాధికార సంస్థను స్థాపించడమే ఈ చట్టం వెనుక ఉన్న ప్రాధన్యత ఉద్దేశ్యం. ఎన్‌డిఎస్‌ఎ చట్టం ప్రకారం 17 ఫిబ్రవరి 2022లోనే డ్యామ్ భద్రతకు సంబంధించిన విధి విధానాలను మార్గదర్శకాలను డ్యామ్‌ల ప్రమాణాలు ఆచరించదగినవి రూపొందించారు.కాళేశ్వరంకోసం ఎన్‌డిఎస్‌ఎ వేసినకమిటీలో చంద్రశేఖర్ అయ్యర్‌తోపాటు అమితాబ్‌మీనా, బిమన్నా, యుఎస్ విద్యార్థి, రాహుల్ కమార్‌సింగ్, ఆర్‌జిపాటిల్,ఎస్‌కెశర్మ ఆర్ చిత్ర సభ్యులుగా ఉన్నారు.కాళేశ్వరం నిపుణులు సూచించిన ఏ పని తెలంగాణ నీటిపారుదలశాఖ చేపట్టక పోగా ప్రాజెక్టుస్థలాలలో గ్రౌటింగ్ చేసి వాస్తవాలు వెల్లడికాకుండా తాత్కాలికంగా క్షేత్రస్థాయిలో భూభౌతిక పరిస్థితి అధ్యయనం చేయకుండా అడ్డంకులు సృష్టించారు.

# స్వర్గమా .. నరకమా?

జమ్ము కాశ్మీర్

**ఎ.వి.వి ప్రసాద్**

నిన్నటిదాకా భూతల స్వర్గమే.. ఇప్పుడదే నరక కూపమైపోయింది. పహల్గాం ఊచకోత ఘటనతో మొత్తం జమ్ముకాశ్మీర్ అంతా గత పన్నెండు రోజులుగా వణికిపోతూనే ఉంది. సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలైతే ప్రాణాలు అరచేత పట్టుకుని దిక్కుతోచిన వైపు పరుగులు తీస్తున్నారు. కాశ్మీరీయులకు ఉగ్రదాడులు కొత్త కాకపోవచ్చు కానీ.. ఏప్రిల్ 22న జరిగిన ఘటన మాత్రం అత్యంత భయానకమైనదే. కాశ్మీర్ అందాలను చూసి పరవశించేవారందరు మళ్లీ ఇదేం ఘోరం అంటూ విస్తుపోతున్నారు. ఎందుకంటే.. అప్పుడప్పుడు చిన్నచిన్న దాడులు మినహా జమ్ము కాశ్మీర్లో కొంతకాలం నుంచి పరిస్థితులు ప్రశాంతంగానే ఉంటున్నాయి. ముఖ్యంగా 370 అధికరణం రద్దు, కొద్ది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. పహల్గాంలోని సుందరమైన లోయల్లో విహరించడానికి నిత్యం వందలు, వేలమందిపర్యాటకులు వస్తూంటారు. అటువంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో 26 మందిని బలిగొంటూ చిందిన రక్తం చూసిప్రపంచమే నివ్వెరపోయింది. ప్రజా ప్రభుత్వం పగ్గాలు చేపట్టడంతో తమకు ఇక ఎలాంటి ప్రమాదం రాబోదనే అంతా భావించారు. ముఖ్యంగా సరిహద్దు గ్రామాల ప్రజలు కూడా నిశ్చింతగా కాలం గడుపుతున్నారు. కాశ్మీర్లో అభివృద్ధి కార్యక్రమాలు కూడా ఊపందుకున్నాయి. దేశ,విదేశాల నుంచి వచ్చేపర్యాటకుల వరద కూడా పెరిగింది. రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలనే డిమాండ్ మినహా రాజకీయ పార్టీలకు కూడా ఆందోళనలు చేసే అవకాశం తగ్గిపోయింది. అమర్నాథ్‌యాత్రకు అంతా సిద్ధమవుతున్న తరుణంలో సానుకూల వాతావరణాన్ని భగ్నం చేస్తూ ఉగ్రవాదులు ఏ 'లక్ష్యం'తో ఈ దాడి జరిపారన్నదే అందరి ప్రశ్నగా వినిపిస్తోంది. గతంలో కంటే అధికంగా ఉద్రిక్తతలు పెరిగిపోవడం అందరినీ మరింతగా భయకంపితులను చేస్తోంది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారన్న విషయం నిర్ధారణకావడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింతగా పెరిగిపోయాయి. పర్యవసానంగా భారత్ ప్రభుత్వం పాక్‌తో గల సింధు జలాల పంపిణీ ఒప్పందాన్ని సస్పెండ్ చేసిన తర్వాత ఉభయ దేశాల మధ్య పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. సరిహద్దు ప్రాంతాలనుంచే గాక మొత్తం రాష్ట్రమంతా ప్రజలు భీతావహులై మూటాముల్లె సర్దుకుని ఇతరరాష్ట్రాలకు తరలిపోతుండడంతో ప్రభుత్వానికి ఇదో కొత్త సమస్యగా మారింది. నేడో, రేపో పాక్‌తో యుద్ధం తప్పదనే అనుమానం అందరిలో బలపడడంతో అది ప్రజలలో అభద్రతా వాతావరణాన్ని పెంచుతోంది.



పహల్గాం దాడి

నియంత్రణ రేఖ వెంబడి ప్రతిరోజు కాల్పులు జరుగుతూండడంతో అక్కడి గ్రామాలన్నీ దాదాపు ఖాళీ అయినట్లు సమాచారం. దాడి జరిపిన ఉగ్రవాదులు ఇంకా కాశ్మీర్ లోనే ఉన్నారని అధికారులు ప్రకటించడం, వారి కోసం జరుపుతున్న అన్వేషణలో సాధారణ ప్రజలు అనేకరకాలుగా వేధింపులకు గురి కావడంతో 'అశాంతి' అధికమైవారు ఇతరప్రాంతాలకు తరలిపోవడానికి దారితీస్తోంది. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో కాశ్మీర్‌లోని 48 పర్యాటక ప్రదేశాలను మూసివేయడంతో కొన్ని వేలకుటుంబాలు ఉపాధిని సైతం కోల్పోయాయి. దానితో వారు కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నారు. పరిస్థితి మెరుగుపడిన తర్వాత ఆ పర్యాటక కేంద్రాలను పునఃప్రారంభించినా ఆ రంగం కోలుకోవడానికి చాలాకాలమే పట్టవచ్చు. కాశ్మీర్ ప్రభుత్వానికి పర్యాటక పరిశ్రమ ద్వారానే అధిక ఆదాయం లభిస్తూంటుంది. ఇప్పుడు ఈ పరిశ్రమ సంక్షోభంలో పడడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా కుదేలయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికైతే భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతలు గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయనే చెప్పాలి. దేశంలోని పాక్ జాతీయులను వెనక్కి పంపే చర్యలు కూడా సాగుతున్నాయి. పాక్ కూడా అటువంటి చర్యలే తీసుకొంటోంది. కానీ అటారీ వాఘా సరిహద్దు వద్ద నెలకొన్న ప్రతిష్టంభన చూస్తే పాక్ ఎంత అమానుషంగా వ్యవహరిస్తున్నదో అర్థమవుతుంది. పాకిస్థానీల వీసాల రద్దు నిర్ణయం తర్వాత భారత్ నుంచి దాదాపు వెయ్యి మంది పాక్ దేశస్థులు వెళ్లిపోయారు. ఈప్రక్రియ జరుగుతుండగా గత గురువారం పాక్ హఠాత్తుగా తమ కౌంటర్లను మూసివేసి 'నో ఎంట్రీ' బోర్డులు పెట్టడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. గత నాలుగు రోజులుగా అక్కడ ఆ ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. పాక్‌కు చెందిన అన్ని రకాల విమానాలకు గగన తలాన్ని మూసివేస్తూ భారత్ నిర్ణయించడంతో పర్యాటకులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతోంది. అలాగే పాక్ కూడా భారత్ విమానాలకు తమ గగనతలాన్ని మూసివేసింది. దీనితో పాక్‌నుంచి దక్షిణాసియా,ఆగ్నేయాసియా దేశాలకు వెళ్లే విమానాలు చైనా లేదా శ్రీలంక మీదుగా చుట్టు తిరిగి వెళ్తాండడంతో అది మరో కొత్త సమస్యగా మారింది.పాక్ సైనికులు భారత్ భూభాగంలోకి కాల్పులు జరపడం ఎక్కువ కావడంతో వాటిని నియంత్రించడానికి ఏ చర్యలు తీసుకొంటున్నారనేది అర్థంకాకుండా ఉంది. ఆ కాల్పుల వల్ల ఎంతో ప్రాణనష్టం జరుగుతున్నా ఇప్పుడు దానిని పట్టించుకొనే వారే కనిపించడం లేదు.ఉభయదేశాల నుంచి వరుసగా వినిపిస్తున్న ప్రతీకార ప్రకటనలు మినహా ఉద్రిక్తతలు తగ్గించే చర్యలే లేవు.ఇది మరింత విచారకరమైనఅంశం. ఉగ్రవాదులను పట్టుకొనే క్రమంలో సాధారణ ప్రజల ఇబ్బందులను పట్టించుకొనక పోవడం కూడా విచారించవలసిన విషయమే. కాశ్మీర్ లోనే మాటువేసి ఉన్న ఉగ్రవాదులను పదిరోజులు దాటినా కనుగొనలేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వారిని ఏరివేసే కార్యక్రమాన్ని తొలుత ముమ్మరం చేయాలి. శాంతి భద్రతల పునరుద్ధరణే లక్ష్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి వ్యూహంతో కదలాలి. ప్రజల ప్రాణాలను ప్రభుత్వాలు కాపాడగలిగినప్పుడే కాశ్మీర్ మళ్లీ స్వర్గ ధామమవుతుంది. ●

# భయంగుప్పెట్లో 'లష్కరే చీఫ్'!

పాకిస్థాన్

**గన్ని మోహన్**

ఉగ్రదాడులతో భారత్‌కునిత్యం కంట్లో నలుసుగా మారిన లష్కరే తాయిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు భయం అంటే ఇప్పుడు తెలిసొచ్చింది. హాఫీజ్‌ను అరెస్టు చేసామని, ప్రస్తుతం జైలులో ఉన్నాడని పాకిస్థాన్‌ప్రభుత్వం వెనకేసుకు వస్తున్నా అతడు ఉంటున్న ఇంటినే సబ్‌జైలుగా మార్చేసి, పాకిస్థాన్ ఆర్మీ భద్రతను పెంచింది. నిత్యం భారత్‌పై అక్కసు వెళ్లగక్కే హాఫీజ్ కనుసన్నల్లోనే పహల్గాంవ్ ఉగ్రదాడి జరిగిందని దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థఎన్‌ఐఎ స్పష్టంచేసిన నేపథ్యంలో పాకిస్థాన్‌కు ఎటుచూసినా వెన్నులో వణుకుపుడుతోంది. సాయం కోసం గల్ఫ్, అరబ్ దేశాలను అర్థిస్తోంది.ఆర్థికంగా కూడా ఏకాకినిచేసే కార్యాచరణలో భారత్ నిమగ్నం కావడం, ఇప్పటికే గగనతలం మూసివేత, సరిహద్దులు మూసివేత, అత్యత కీలకమైన సింధూజలాలను నిలిపివేయడం వంటివాటితో పాకిస్థాన్‌కు కష్టం,నష్టం అంటే ఏమిటో తెలియజెప్పింది. ఇదే క్రమంలో పాకిస్థాన్‌లోనే స్థిరనివాసం ఏర్పరుచుకున్న లష్కరే తాయిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారీఎత్తున బందోబస్తు ఏర్పాటుచేసింది. కిలోమీటరు దూరంలో హైరిజల్యూషన్ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఐఎస్‌ఐ చీఫ్ పర్యవేక్షణలో హాఫీజ్‌కు భద్రత కొనసాగుతోంది. ఎస్‌ఎస్‌జి కమాండోలు, పాకిస్థాన్ రేంజర్స్ వంటి సాయుధ బందోబస్తు మధ్య హాఫీజ్ పాకిస్థాన్‌లోనే ఉంటున్నాడు. ముంబయి దాడుల సూత్రధారి అయిన లష్కరే చీఫ్‌ను ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి నిషేధిత ఉగ్రవాదుల జాబితాలో చేర్చిన సంగతి తెలిసిందే. అటు అమెరికా కూడా మోస్ట్ వాంటెడ్ అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. బ్రిటన్ ఇతర యూరోపియన్ దేశాలు కూడా అదేక్రమంలో హాఫీజ్‌ను నిషేధిత జాబితాలో చేర్చి మోస్ట్ వాంటెడ్‌గా పేర్కొన్నాయి. ఉగ్రవాదులు,ఉగ్రవాద స్థావరాలకు ఆశ్రయం కల్పిస్తున్న పాకిస్థాన్ ఎట్టకేలకు తాము తప్పుచేసామని ఉగ్రవాదులతో సంబంధాలున్న మాట నిజమేనంటూ అటు రక్షణమంత్రి, ఇటు విదేశాంగ మంత్రులు సైతం అంగీకరించిన క్రమంలోహాఫీజ్‌ను అప్పగించే క్రమంలో మాత్రం ససేమిరా అంటున్నాయి. మేమే విచారణచేసి చర్యలు తీసుకుంటామని చెపుతూ వచ్చిన పాక్ అతడి ఇంటినే జైలుగా మార్చి అదే జైలు అని ప్రపంచాన్ని నమ్మిస్తోంది. ఈక్రమంలో హాఫీజ్ పేరుకు జమాత్ ఉద్‌దవా అనే సంస్థను స్థాపించి సామాజిక సేవాసంస్థగా కార్యకలాపాలు సాగిస్తూ వాటి ముసుగులోనే ఉగ్రవాదాన్ని రెచ్చగొడుతున్నట్లు భారత నిఘా సంస్థలుసైతం పసిగట్టిన సంగతి తెలిసిందే. ఫలాహ్ ఎ ఇన్సానియత్ ఫౌండేషన్, అల్‌మదీనా, ఐసర్ ఫౌండేషన్ వంటివి ప్రపంచ ఆంక్షల నుంచి తప్పించుకోడానికి హాఫీజ్‌కు ముసుగుగా ఉపయోగపడుతున్నాయి.



హాఫీజ్ సయీద్

లష్కరే రాజకీయ సంస్థ మిల్లీ ముస్లింలీగ్‌ని అమెరికా ఇప్పటికే నిషేధించింది. అయినా కూడా పాక్ రాజకీయాలను ప్రభావితంచేసే సంస్థగా మిల్లీ ముస్లిం లీగ్ పనిచేస్తోంది. ఇక లష్కరేకు ఆర్థికంగా వెన్నుదన్నుగా జమాత్ ఇ ఇస్లామి హవాలా నెట్‌వర్క్ పనిచేస్తోంది. భారత్‌తోపాటు దక్షిణాసియాలో రహస్య మార్గాలద్వారా నిధులను బదలీచేస్తుంది. ఉగ్రవాదులకు లాజిస్టిక్, ఆయుధాల సేకరణ, స్లీపర్‌సెల్స్‌కి డబ్బులు ఇచ్చే ఆర్థిక లావాదేవీలు భారీ ఎత్తున సాగిస్తోంది. వీటన్నింటినీ కూడా భారత్ నిఘా సంస్థలు సత్వరమే గుర్తించాయి.లష్కరే తాయిబా లాగే జైష్‌మహ్మద్‌కు కూడా ఇలాంటి నెట్‌వర్క్ ఉన్నట్లు భారత నిఘా ఏజెన్సీలు పసిగట్టాయి. ఇక హాఫీజ్‌కు భారీభద్రతను కల్పించిందంటే పహల్గాంవ్ దాడి సూత్రధారి అని నిర్ధారణ అయింది. అందువల్లనే ఏ నిమిషంలో అయినాసరే హాఫీజ్ ప్రాణాలకు ముప్పు ఉంటుందన్న సందేహాలు పాక్‌ను చుట్టుముడుతున్నాయి. అందువల్లనే ఆతడి రక్షణ బాధ్యతను కూడా షెహబాజ్‌షరీఫ్ సర్కారు చేపట్టింది. కిలోమీటరు దూరం వరకూ ఆతని ఇంటిమీదుగా ఎలాంటి రాకపోకలు సాగించేందుకు వీలులేని పటిష్టమైన భద్రతా వలయాన్ని సృష్టించింది. హాఫీజ్ ఇంటి పరిసరాల్లో డ్రోన్ల కదలికలుకూడా నిషేధించారు. లష్కరే అనుబంధంగా పనిచేస్తున్నది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈపహల్గాంవ్ ఉగ్రదాడి చేసిందని తేల్చిన ఎన్‌ఐఎ ఇపుడు హాఫీజ్,ఈ అనుబంధసంస్థ కార్యకలాపాలపైనే ఫోకస్ పెంచింది. ఏ నిమిషంలో ఏరూపంలో భారత్ తమపైకి వస్తుందో అన్న భయంలో అల్లాడుతున్న పాకిస్థాన్‌కు ఇప్పుడు తమ దేశంలో ఆశ్రయం పొందుతున్న కీలక ఉగ్రనెట్‌వర్క్‌ల చీఫ్‌లను కూడా రక్షించుకోవడం ప్రధాన బాధ్యతగా మారింది. అయితే ఇప్పటివరకూ కాశ్మీర్ భూభాగమే ప్రధాన అజెండాగా కొనసాగించిన ఈ లష్కరే చీఫ్ ఎంతోమంది ముష్కరులను తయారుచేసి భారత్‌పైకి వదిలాడు. జమ్ము కాశ్మీర్‌లోనే నిరుద్యోగ యువతను ఆకర్షించి వారిని సుశిక్షితులైన లష్కరే కమాండర్లుగా మార్చేస్తున్నట్లు కూడా దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. దీనికితోడు పాకిస్థాన్ ఐఎస్‌ఐ, ఆర్మీలు కూడా చొరబాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తుండటం వల్లనే భారత్‌లోకి చొరబడి భీభత్సం సృష్టిస్తున్నారు. పార్లమెంటుపై దాడి,ముంబయి ఉగ్రదాడులు వంటి వాటితో ప్రపంచానికి తెలిసిన హాఫీజ్‌కు భారీ భద్రతను ఏర్పాటు చేయడం ద్వారా ఆ చీఫ్‌కు భయం అంటే ఏమిటో తెలిసొచ్చేలా చేసింది భారత్. అనుక్షణం భయం గుప్పిట్లో బతుకుతున్న ఈ లష్కరేచీఫ్‌ను కాపాడుకోవడం పాకిస్థాన్‌కు కూడా రానున్నకాలంలో శిరోభారం అవుతుందనే చెప్పాలి. ఉగ్రవాద నిర్మూలనలో భారత్‌కు సహకరించాలని అమెరికా కూడా పదేపదే చెపుతూ వస్తోంది. ఈక్రమంలో పాక్‌కు ఇప్పుడు చైనా, రష్యా, గల్ఫ్‌దేశాల సాయం అనివార్యం అవుతోంది. అలాగే తూర్పున ఉన్న బంగ్లాదేశ్‌తో చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్న సంగతి తెలిసిందే.ఇవన్నీ ఒక ఎత్తయితే తన ఛాందసవాద ఉగ్రవాదంతో నిత్యం భారత్‌కు కంట్లో నలుసుగా మారిన హాఫీజ్‌కు పహల్గాంవ్ ఉగ్రదాడితో ప్రాణభయం వెంటాడుతోందన్నది మాత్రం నగ్నసత్యం. ●

# హక్కులను ఉల్లంఘిస్తున్న ట్రంప్ నియంతృత్వ ధోరణులు



**డా॥ కత్తి పద్మారావు**

అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచాన్ని వణికిస్తుంది. ట్రంపు పరిపాలనా వ్యవస్థలో అమెరికాలో కూడా తిరుగుబాటు ప్రారంభమైంది. తిరుగుబాటును అణచడానికి డొనాల్డ్ ట్రంపు నియంతగా వ్యవహరిస్తున్నారు. ట్రంపు నియంతృత్వానికి అమెరికాలో కూడా తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా అమెరికా నియంత సామ్రాజ్యవాది ఇతర దేశాలపై అతిగా పన్నులు విధించి దగ్గర దగ్గర విదేశీ వస్తు బహిష్కరణకు పాల్పడుతూ చైనాపై తీవ్రమైన పన్నులు విధిస్తూ భారతదేశ మేధో సంపన్నతను అడ్డుకుంటున్న డొనాల్డ్ ట్రంప్ విధానాలు ప్రపంచంలో మళ్లీ హిట్లర్ను గుర్తు చేస్తున్నాయి. నిజానికి ఇటీవల జరిగిన సంఘటన మానవ హక్కులపై ట్రంపుచేస్తున్న దాడిగా అభివర్ణిస్తున్నాయి. మానవ హక్కులను, పౌర హక్కులను ట్రంప్ తన నియంతృత్వ ధోరణిలో ఉక్కుపాదం మోపుతున్నాడు. పాలస్తీనాకు మద్దతుగా అమెరికాలో ప్రదర్శననిర్వహించిన కొలంబియా విశ్వవిద్యాలయ విద్యార్థి మహమూద్ ఖలీలను అధికారులు నిర్బంధించారు. పశ్చిమాసియాలో శరణార్థుల తోడ్పాటు కోసం ఏర్పాటైన ఐరాస సహాయ పునరావాస కార్యకలాపాల సంస్థ (యూఎస్‌ఆర్డబ్ల్యూఏ)తో తన అనుబంధాన్ని దాచి ఉంచారనే కారణంతో అతనిపై ఈ చర్య తీసుకున్నారు. యూఎస్‌ఆర్ డబ్ల్యూఏ సిబ్బంది కొందరు హమాస్ కోసం పని చేస్తున్నారంటూ ఇజ్రాయెల్ ఆ సంస్థను నిషేధించింది. రంజనీ శ్రీనివాసన్ న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిని. పాలస్తీనా అనుకూల ప్రదర్శనల్లో పాల్గొన్నారనే నెపంతో ఆమె విద్యార్థి వీసాను రద్దు చేశారు. దీంతో విశ్వవిద్యాలయం ఆమె అడ్మిషన్‌ను ఉపసంహరించింది. రంజనీని వెనక్కిపంపారు. అమెరికాలో నివసించడానికి, చదువుకోడానికి వీసా పొందడం ఒక గొప్ప గౌరవమని... హింసకు, టెర్రరిజానికి అనుకూలంగా వాదించేవారు ఆ గౌరవంపొందే అర్హత కోల్పోతారని అమెరికా హోమ్లాండ్ సెక్యూరిటీ విభాగానికి చెందిన ఒక అధికారి వ్యాఖ్యానించారు. మరో ప్రక్క ట్రంప్ భారతదేశం మీద చైనా మీద విపరీతమైన ద్వేషాన్ని ప్రకటిస్తున్నాడు. నిజానికి ఇండియా అమెరికాల వాణిజ్య భాగస్వామ్యం ఈనాటిది కాదు. అది దశాబ్దాలుగా జరుగుతుంది. ఒకనాడు అమెరికా స్వేచ్ఛకు,స్వాతంత్ర్యానికి, సౌభ్రాతృత్వానికి ఆదర్శంగా నిలిచింది. నిజానికి రెండు దేశాల మధ్య 202324లో సుమారు 119.7 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. ఈ కాలంలో అమెరికాకు ఇండియా 77.5 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు చేసింది. ప్రపంచ దేశాలన్నింటికీ భారత్ చేస్తున్న ఎగుమతుల్లో ఇది 17.7శాతం. అమెరికా నుంచి భారత్‌కు వచ్చిన దిగుమతుల విలువ 42.1బిలియన్ డాలర్లు. ఇది భారత్‌కు వచ్చిన మొత్తందిగుమతుల్లో 6,2శాతం, భారత్‌కు అమెరికా నుంచి వస్తున్న దిగుమతుల కంటే మనదేశం అగ్రరాజ్యానికి చేస్తున్న ఎగుమతులే అధికం. దీనివల్ల అమెరికాతోఇండియా వాణిజ్య మిగులు సాధిస్తోంది. అమెరికా దిగుమతుల్లో 17శాతం చైనా నుంచి, 13శాతం కెనడా నుంచి, 14శాతం మెక్సికో నుంచి మూడు శాతం భారత్ నుండి వస్తున్నాయి. అమెరికాకు బాగా ఎగుమతి అవుతున్న ఆరు ఉత్పత్తుల్లో చైనాదే పైచేయి. భారత్ ఎగుమతుల వాటా తక్కువే. ఇండియా ప్రధానంగా ఇంజినీరింగ్ వస్తువులు, బంగారు ఆభరణాలు, రత్నాలు, ఔషధాలు, పెట్రోలియం ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ట్రంప్ విధించిన సుంకాలు రెండంకెల స్థాయిలో ఉన్నరత్నాలు, ఆభరణాలు, ఖనిజాలు, ఇంధనాలు, ఔషధాలు, ఇనుము, ఉక్కు, అణు రియాక్టర్లు, సేంద్రియ రసాయనాల ఎగుమతులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అలాగే నాలుగంకెల స్థాయిలోఉన్న వజ్రాలు, ఔషధాలు, పెట్రోలియం ఇంధనాలు, ఆభరణాలు, వాహన విడిభాగాలు, సముద్ర ఆహారం, మొబైల్ ఫోన్లు, వ్యవసాయ రసాయనాలు, జౌళి, ఏరోస్పేస్ పరికరాల ఎగుమతులు కూడా ఒక మోస్తరుగా సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. అమెరికాలో ట్రంప్‌కు వ్యతిరేకంగా



దేశవ్యాప్తంగా మానవ హక్కుల కోసం అంతర్గతంగాను, బహిర్గతంగాను జరుగుతున్న అణచివేతల మీదయువకులు, విద్యార్థులు మేధావులు ఆలోచనాపరులు, ప్రొఫెసర్లు వీళ్ళు అంతా కూడా ట్రంప్ పరిపాలనలోని ఆరాచకాలకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటాలు చేస్తున్నట్లు వాషింగ్టన్ పత్రికలు తెలుపుతున్నాయి.తాజాగా అమెరికాలో రాజులు లేరు అన్న నినాదంతో ర్యాలీలు చేపట్టారు.బ్యానర్లు, ప్లకార్డులతో వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. ట్రంప్ విధానాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు అంటూ నినదించారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా సాగుతున్న ట్రంప్ పాలనతో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫెడరల్ ప్రభుత్వంలో ఎలన్ మస్క్ పాత్రకు కొన్ని చోట్ల ఆందోళనలు నిర్వహించారు. కాగా, పౌర హక్కుల కార్మిక సంఘాలు, ఎల్జీబీటీక్యూ సంస్థలు,న్యాయవాద సంఘాలు, వృద్ధులు, ఎన్నికల సంస్కరణల సంఘ ఆధ్వర్యంలో 50 రాష్ట్రాల్లో హ్యాండ్సాఫ్ ఆందోళనల కొనసాగింపుగా తాజా నిరసనలు జరిగాయి. అమెరికా విధానాలు అమెరికాలోని మానవ హక్కులకే గాక అమెరికా రాజ్యాంగ సూత్రాలకే విఘాతం కలిగిస్తున్నాయనేది మనకు అర్థం అవుతుంది. నిజానికి ట్రంప్ హార్వర్డ్, కొలంబియా విశ్వవిద్యాలయాలపై నియంతృత్వ ఆంక్షలు విధించటమేగాక నిధులు కూడా ఆపే ప్రయత్నాన్ని ప్రపంచమంతా దుయ్యబడుతుంది.జాన్డ్యూయి వంటి మేధావి ఆవిర్భవించినటువంటి కొలంబియా విశ్వవిద్యాలయం డా॥ బి.ఆర్. అంబేద్కర్ వంటి భారతీయ మేధావులెందరో అధ్యయనం చేసిన కొలంబియా విశ్వవిద్యాలయం మీదే ఆంక్షలు విధించటాన్ని ప్రపంచ మేధావులు తప్పు పడుతున్నారు. ప్రపంచం మొత్తంగా జాన్ డ్యూయి ప్రజాస్వామ్య విధానాలను అనుసరిస్తున్న ఈ సందర్భంలో అమెరికాలోనే విద్యపై, జ్ఞానంపై దాడి జరగటం బాధాకరమైన విషయం. ఈ సందర్భంగా అమెరికా మేధావులు, పూర్వమంత్రులు ట్రంప్ విధానాలను దుయ్యబడుతున్నారు. గత సంవత్సరం అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయెలికి వ్యతిరేకంగా ఆందోళనలు ప్రారంభమైన తర్వాత కేంద్రంగా ఈ యూనివర్శిటీ పనిచేస్తోంది. ఈ యూనివర్శిటీకి గల 400 మిలియన్ డాలర్ల నిధులను ప్రభుత్వం స్తంభింపజేసింది. ఖలీ కొలింబియాలో చట్టపరంగానేనివసిస్తున్నాడు. అతడు ఇమ్మిగ్రేషన్ అధికారుల అదుపులో ఉన్నాడు. ఈ యూనివర్శిటీలో ఆందోళనలను నిర్వహించినందుకు అతడిని స్వదేశం పంపేందుకు ప్రభుత్వం రంగాన్ని సిద్ధం చేసింది. కొలంబియాలో నిరసన తెలిపేవారు ముఖాలకు ముసుగు వేసుకోరాదనీ, వారు తమ ముఖాలు కనిపించేట్టు ఉండాలనీ, అడిగినప్పుడు గుర్తింపు కార్డులను చూపాలని బీబీసీ పేర్కొంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే తాము గత విద్యా సంవత్సరంలో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నామనీ, స్టాఫ్ సభ్యులు, విద్యార్థులు సురక్షితంగా ఉన్నారని తమ యూనివర్శిటీ ఆవరణ అంతా ప్రశాంతంగా ఉందని తాత్కాలిక అధ్యక్షుడు కట్టినా ఆర్మ్ స్ట్రాంగ్ ఈమెయిల్లో తెలియజేశారు. ఉన్నత విద్యా సంస్థల నిర్వహణలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సముచితం కాదని ఆయన అన్నారు. ట్రంప్ ప్రభుత్వం ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో 210 మిలియన్ డాలర్ల రిసెర్చ్ గ్రాంట్లను నిలిపివేసినట్టు యాహు. కామ్ వెల్లడించింది. ఇలాంటి బెదిరింపులు ఇతర యూనివర్శిటీలకు కూడా వస్తున్నాయి. భూతాపంపై పరిశోధనకు సంబంధించి నాలుగు మిలియన్ డాలర్ల నిధులను ప్రభుత్వం నిలిపివేసింది. ఈ యూనివర్శిటీ గత ఏడాది (2024లో) 455 మిలియన్ డాలర్ల నిధులను ప్రభుత్వం నుంచి స్వీకరించింది. అయితే, ట్రంప్ డిమాండ్లకు తాము తలొగ్గబోమని ఈస్గూబర్‌స్పష్టం చేశారు. ట్రంప్ ప్రభుత్వం తీరుతెన్నులు 1950వ దశకం తర్వాత దేశంలో యూనివర్శిటీల స్వేచ్ఛా నిర్వహణకు ముప్పుగా తయారయ్యాయని ఆయన అట్లాంటిక్‌లో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. స్టాన్ఫోర్డ్ యూనివర్శిటీ కూడా హార్వార్డ్ యూనివర్శిటికి మద్దతుగా నిలిచింది. ప్రపంచ దేశాలు అన్ని ట్రంప్ ఆదేశాలు ఏవిధంగా తమకు హాని చేస్తాయో అని భయపడుతున్నారు. ఈసందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కులపోరాటం సమైక్యంగా సముజ్వలంగా ప్రపంచ మానవాళి అంతా కలిసి చేయవలసిన చారిత్రక సందర్భం వచ్చింది. ప్రపంచం ఇటువంటి నియంతలను ఎంతోమందిని ఎదుర్కొని ముందుకువెళ్ళింది. ప్రపంచ చరిత్రను మార్చ గల్గినవారు ప్రపంచ మానవులే. ●



## ప్రపంచ పెద్దావిడగా ఇంగ్లండ్ మహిళ

**లండన్, మే 3:** ప్రపంచంలోనే అత్యధిక వయసు కలిగిన వ్యక్తిగా ఇంగ్లండ్‌కు చెందిన ఏథెల్ కేటర్‌హామ్(115) నిలిచారు. 116 ఏళ్లు జీవించిన సిస్టర్ ఇనా కనబారో లుకాస్ ఇటీవల కన్నుమూయడంతో ఇపుడు ఏథెల్‌కు ఈఘనత దక్కింది. ఆమె 1909 ఆగస్టు 21న జన్మించారు. ప్రస్తుతం ఆమె కేంబెర్లీలోని విలాసవంతమైన హాల్‌మార్క్ లేక్‌వ్యూ నర్సింగ్‌హోమ్‌లో నివసిస్తున్నారు. ఎవరితోనూ వాదనలకు దిగకుండా ప్రశాంతంగా గడపడమే తన సుదీర్ఘజీవిత రహస్యమని ఏథెల్ చెప్పారు. 18 ఏళ్ల వయసులో ఆమె భారత్‌కు వచ్చి ఒక బ్రిటిష్ కుటుంబంలో మూడేళ్లపాటు పిల్లల సంరక్షకురాలిగా కూడా పనిచేసారు.

# శిర్గాంవ్ ఆలయంలో తొక్కిసలాట

## ఆరుగురు మృతి, 50 మందికి గాయాలు

**పనాజి, మే 3:** గోవాలో తీవ్ర విషాదం జరిగింది. శిర్గావ్‌లోని ఓ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందారు. మరో 50 మందికి పైగా భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన గోవా సీఎం ప్రమోద్ సావంత్ తొక్కిసలాటలో గాయపడిన వారిని పరామర్శించారు. ఈ ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి స్పందించారు. శిర్గావ్‌లోని శ్రీ లైరాయ్ ఆలయంలో శుక్రవారం నుంచి వార్షిక జాతర ప్రారంభమైంది. దీంతో లైరాయ్ అమ్మవారిని దర్శించుకునేందుకు గోవా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆ ఆలయంలో అనాదిగా వస్తున్న నిప్పులపై నడిచే ఆచారం ఉంది. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొన్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా రద్దీ కావడం వల్ల భక్తులు ఒకరినొకరు తోసుకోవడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు నార్త్ గోవా పోలీసులు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న ఎమర్జెన్సీ సర్వీసెస్ సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు తెచ్చేందుకు ప్రయత్నించారు. సహాయక



చర్యలు చేపట్టి క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. జాతర దృష్ట్యా వచ్చే రద్దీని నియంత్రించేందుకు ఆలయ నిర్వాహకులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు తర్వగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఈ ఘటనపై గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆస్పత్రికి తొక్కిసలాటలో గాయపడిన వారిని పరామర్శించారు. అంతేకాకుండా ఘటనాస్థలాన్ని కూడా పరిశీలించారు. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనకు ఫోన్ చేసిన తొక్కిసలాట ప్రమాదంపై ఆరా తీసినట్లు పేర్కొన్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని కేంద్రం భరోసా ఇచ్చినట్లు తెలిపారు.



# డ్రాగన్ రహస్యాలు చెప్పండి

## జిన్‌పింగ్ అసంతృప్తులకు యుఎస్‌ఎ ఆఫర్

**వాషింగ్టన్, మే 3:** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పాలనలో అణచివేతను ఎదుర్కొంటున్న అక్కడి ప్రభుత్వ ఉద్యోగులను ఉద్దేశిస్తూ అమెరికా నిఘా సంస్థ సిఐఎ సంచలన ప్రకటన చేసింది. 'రండి.. మాతో కలిసి పనిచేయండి' అంటూ మాండరిన్ భాషలో రిక్రూట్‌మెంట్ విడియోలను విడుదల చేసింది. సైనిక పరంగా, వ్యూహాత్మకంగా చైనా తమకు అతిపెద్ద విరోధిగా భావిస్తున్న అగ్రరాజ్యం బీజింగ్ చేపడుతున్న గూఢచర్య ఆపరేషన్లకు ప్రతిచర్యగా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. చైనా అధికారుల నుంచి రహస్యాలు సేకరించేందుకే ఈ విడియోలని సిఐఎ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ చెప్పడం గమనార్హం. 'నిఘా వ్యవస్థలో మానవ వనరులను పెంచుకోవడంతో పాటు చైనాపై మరింత దృష్టి పెట్టేందుకు ఈ చర్యలు చేపట్టాం. ఆర్థికంగా, సైనికపరంగా, సాంకేతికతంగా ప్రపంచంపై ఏకఛత్రాధిపత్యం చెలాయించాలని చైనా భావిస్తోంది. ఆ దేశం నుంచి మాకు గూఢచర్యం ముప్పు పొంచి ఉంది. దాన్ని పరిష్కరించుకునేందుకే ఈ విడియోలు విడుదల చేశాం. చైనా అధికారుల నుంచి రహస్యాలు సేకరించడమే వాటి లక్ష్యం' అని రాట్‌క్లిఫ్ వెల్లడించారు. అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సిఐఎ) యూట్యూబ్, 'ఎక్స్' ఖాతాల్లో ఈ రెండు విడియోలను విడుదల చేయగా గంటల వ్యవధిలోనే 50 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి.

రెండు నిమిషాలకుపైగా నిడివి ఉన్న ఈ విడియోల్లో అధ్యక్షుడు జిన్‌పింగ్ కమ్యూనిస్టు పార్టీలో అవినీతి వ్యతిరేక ఉద్యమం పేరుతో రాజేసిన నిప్పును ఉదహరిస్తూ సినిమాటిక్ సన్నివేశాలను జోడించారు. నిజాయితీగా పనిచేస్తున్న ఓ పార్టీ నాయకుడు అధికార ఒత్తిళ్లకు తలొగ్గాల్సిన పరిస్థితిలో ఉంటాడు. దాన్ని అంగీకరించలేక, భయంతో బతకలేక సిఐఎను ఆశ్రయిస్తున్నట్లుగా ఆ విడియోలో ఉంది.

'నా జీవితాన్ని, నా భవిష్యత్తును నా కంట్రోల్‌లో ఉంచుకోవాలంటే సిఐఎలో చేరాలి' అనే క్యాప్షన్‌తో అమెరికా సంస్థ ఈ విడియోలను విడుదల చేసింది. చైనా అధికారులకు మరింత చేరువవ్వాలనే ఉద్దేశంతో మాండరిన్ భాషలో రూపొందించింది. ప్రస్తుతం ఈ విడియోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. వీటిపై చైనా ఇంకా స్పందించలేదు.

# రామ్ దర్బార్‌లో దేవతామూర్తుల విగ్రహాలు

**అయోధ్య, మే 3:** అయోధ్య రామాలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రామాలయం మొదటి అంతస్తులోని రామ దర్బార్‌లో దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ముహూర్తం ఖరారైంది. పవిత్రమైన గంగా దసరా రోజున జూన్ 5న దేవతామూర్తులను ప్రతిష్ఠించనున్నారు. తర్వాతి రోజు (జూన్ 6) నుంచి రామయ్య దర్శనం కోసం భక్తులను అనుమతించనున్నారు. జూన్ 3 నుంచి అయోధ్య రామ మందిరంలో మూడు రోజులపాటు మతపరమైన కార్యక్రమాలు జరుగుతాయి. అన్ని విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు జూన్ 5తో ముగుస్తాయి. ఆ తర్వాత రామ భక్తులకు దర్శనం లభిస్తుంది. రామదర్బార్‌లో రామయ్య, సీత, లక్ష్మణుడు, ఇతర దేవుళ్ల దర్శనం కోసం శ్రీరామజన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు కీలక నిర్ణయం తీసుకుంది. ముందుకుగా వచ్చేవారి కోసం 750 పాస్‌లను జారీ చేయాలని నిర్ణయించింది. దేవాలయ



ప్రాంగణంలో సమావేశమైన ఆలయ కమిటీ ఈ మేరకు వెల్లడించింది. రామాలయ నిర్మిస్తున్న ఎల్ అండ్ టీ, టాటా ఇంజినీర్లతో కలిసి ఆలయ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనుల పురోగతిపై ఆందోళన వ్యక్తం చేశారు.

ఆలయ సముదాయంలో నిర్మిస్తున్న ఏడు దేవాలయాల పనులు మే నెల చివరినాటికి పూర్తవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే రామాలయ సముదాయంలోని రెండు దేవాల యాల్లో మినహా అన్నింట్లోనూ ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారని నృపేంద్ర మిశ్రా తెలి పారు. మే 23న రామ దర్బార్ గర్భగుడిలో విగ్రహాలు ప్రతిష్ఠిస్తామని వెల్లడించారు. మే 30కంటే ముందే లక్ష్మణుడి విగ్రహాన్ని శేషావతార్ ఆలయంలో ప్రతిష్ఠ చేస్తామని పేర్కొన్నారు. అన్ని దేవాలయాలలో విగ్రహాలను ప్రతిష్ఠించిన తర్వాత పూజలు స్పష్టం చేశారు. జూన్ 3, 5 వరకు అయోధ్య రామాలయంలో మతపరమైన కార్యక్రమాలు జరుగుతాయి. ఆ తర్వాత భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేస్తాం. మొదటి అంతస్తులో భక్తుల బరువు, రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాన్ని నిర్మించాం. మొదటి అంతస్తులోకి భక్తుల ప్రవేశం ఆధారంగా సీబీఆర్ఐ రూర్కీ మూడు నెలల పాటు అధ్యయనం నిర్వహిస్తుంది. ఆలయంలోని రాళ్లు ఏమైనా దెబ్బతిన్నాయా లేదా అని పరిశీలిస్తుంది. అందుకు ఆలయంలో 10 సెన్సార్లు ఏర్పాటు చేశామని నృపేంద్ర మిశ్రా తెలిపారు.

# పర్వతాల్లో సరదా హైకింగ్..



## కాళ్ల కింద రూ. 2.87కోట్ల నిధి

**ప్రాగ్వే, మే 3:** ప్రకృతిని ఆస్వాదిద్దామని హైకింగ్‌కు వెళ్లిన ఇద్దరు వ్యక్తులకు అనూహ్యంగా కోట్లాది రూపాయల సంపద దొరికింది. చెక్ రిపబ్లిక్‌లోని ఈశాన్య పర్వతాల్లో ఈ సంఘటన వెలుగుచూసింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం చెక్ రిపబ్లిక్‌లోని పోడ్కర్కోనోసి పర్వతాల్లో ఇటీవల ఇద్దరు పర్యాటకులు హైకింగ్‌కు వెళ్లారు. అలా వారు ముందుకు వెళ్తుండగా ఆ ప్రాంతంలో 598 బంగారు నాణేలు, ఆభరణాలు, పొగాకు సంచులు కనిపించాయి. అంత మొత్తాన్ని అక్కడ చూసిన పర్యాటకులు ఆశ్చర్యపోయారు. ప్రస్తుతం ఈ సంపద అంతా ఈస్ట్ బొహెమియన్ మ్యూజియంలో ఉంది. ఇది జరిగింది ఫిబ్రవరి నెలలో అయినా తాజాగా మ్యూజియం ఆ విషయాన్ని ఇప్పుడు వెల్లడించింది. స్వాధీనం చేసుకున్న నాణేలు 1808 కాలం నాటివిగా గుర్తించినట్లు తెలిపింది. ఫ్రాన్స్, బెల్జియం, ఒట్టోమాన్ సామ్రాజ్య కాలం నాటి ఆ నాణేలు 1921 తర్వాత ఎవరైనా దాచిపెట్టి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. వంద సంవత్సరాల క్రితమే వాటిని భూమిలో దాచిపెట్టినట్లు అంచనా వేస్తున్నారు. 'హైకర్స్ ఆ సంపదను చూపించినప్పుడు నేను ఎంతో ఆశ్చర్యపోయా. వీటిని ఇంకా విశ్లేషిం చాల్సి ఉంది. అయితే ఆ విలువైన లోహాల ప్రారంభ విలువే రూ. 2.87కోట్లు (340,000 డాలర్లు) గా ఉండొచ్చు. భూమిలో విలువైన వస్తువులను నిధుల రూపంలో నిల్వ చేయడం ప్రీహిస్టారిక్ సమయంలో ఒక ఆచారంగా ఉండేది. అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న సమయంలో దానిని భూమిలో దాచి, తర్వాత వచ్చి దానిని తీసుకుందామనుకునే ఉద్దేశమే ఈ నిధి వెనక కారణం కావొచ్చు'అని మ్యూజియం ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. రెండో ప్రపంచయుద్ధ సమయంలో నాజీలు ఈనిధిని దాచి ఉండొచ్చన్న వాదనా ప్రచారంలో ఉంది. అయితే చెక్ రిపబ్లిక్ చట్టాల ప్రకారం ఆ నిధిలో పదిశాతం హైకర్స్‌కు దక్కొచ్చని ఉందని మీడియా కథనం పేర్కొంది.

# ఖండాంతర క్షిపణిని పరీక్షించిన పాక్



**న్యూఢిల్లీ, మే 3:** సర్ఫేస్ టు సర్ఫేస్ అబ్దలి బాలిస్టిక్ క్షిపణిని పాకిస్థాన్ పరీక్షించింది. శనివారం ఆ పరీక్ష జరిగింది. సుమారు 450 కిలోమీటర్ల దూరం ఆ క్షిపణి ప్రయాణించగలదు. పెహల్గామ్ ఉగ్రదాడి ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ ఆర్మీ సైనిక విన్యాసాలు చేపడుతున్నది. దానిలో భాగంగా క్షిపణి పరీక్ష జరిగినట్లు తెలుస్తోంది. అబ్దలి వెపన్ సిస్టమ్‌ను పాకిస్థాన్ టెస్ట్ చేసింది. ఇండస్ విన్యాసాల్లో భాగంగా ఆ వెపన్ వ్యవస్థను పరీక్షించినట్లు ఇస్లామాబాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నది. యుద్ధ సన్నద్ధతలో భాగంగా ఆ క్షిపణి పరీక్షించినట్లు ఐఎస్పీఆర్ పేర్కొన్నది. ఆర్మీ స్ట్రాటజీ ఫోర్సెస్ కమాండ్ ఆ పరీక్షను ప్రత్యక్షంగా వీక్షించింది. క్షిపణి పరీక్ష సక్సెస్ కావడంతో ప్రెసిడెంట్ అసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లు శుభాకాంక్షలు తెలి పారు. ఇండస్ కసరత్తుల్లో భాగంగానే ప్రయోగించామని పాక్ చెపుతోంది. సైనికుల కార్యాచరణ, సంసిద్ధతను నిర్ధారించడం, క్షిపణుల అధునాతన నావిగేషన్ వ్యవస్థ సహా కీలకమైన సాంకేతిక పరిమితులను ధృవీకరించడమే లక్ష్యంగా ఈప్రయోగంచేసినట్లు ప్రకటించింది. గతనెల 24,25 తేదీల్లో కరాచీ తీరం వెంబడి ఎకనామిక్ ఎక్స్‌క్లూజివ్‌జోన్‌లో భూతలం నుంచి గగనతలంపైకి క్షిపణి ప్రయోగాలు నిర్వహించేందుకు పాక్ నోటిఫికేషన్ విడుదలచేసింది. తర్వాత గతనెల 26,27 తేదీల్లో మరోసారి మళ్లీప్రకటనచేసింది. తాజాగా గతనెల 30, మే 2 మధ్య మరోసారి పరీక్షలుచేపడుతున్నట్లు ప్రకటించింది. అయితే పాక్ తరచూ ఇలాంటి ప్రకటనలు చేస్తూ భారత్‌ను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే గడచిన తొమ్మిది రోజులుగా వాస్తవాధీనరేఖ వెంబడి పాక్ సైన్యం వరుసగా కాల్పులు జరుపుతోంది. ఉగ్ర దాడి తర్వాత భారత్ తమపై ప్రతీకార దాడిచేసే అవకాశం ఉందని పాక్ మంత్రులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడి ప్రభుత్వం సరిహద్దుల్లో భారీ సైన్యాన్ని మోహరిస్తున్నది.



## పెళ్లికాబోతున్న యువతిపై యాసిడ్ దాడి

**ఆజమ్‌ఘర్, మే 3:** ఉత్తరప్రదేశ్‌లో దారుణం జరిగింది. 25 ఏళ్ల యువతిపై ఓ వ్యక్తి యాసిడ్‌తో దాడి చేశాడు. ఆ దాడిలో ఆమె ముఖం, భుజం, మెడ, శరీర పైభాగం తీవ్రంగా కాలాయి. వివరాల్లోకి వెళ్తే ఈ ఘటన యూపీలోని మో జిల్లాలో జరిగింది. రీమాకు ఇటీవలే పెళ్లి ఫిక్సైంది. ఆ పెళ్లి కోసం ఆమె ఏర్పాట్లు చేసుకుంటోంది. ఖర్చుల కోసం బ్యాంక్‌కు వెళ్లి డబ్బులు తీసుకువస్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమెను అడ్డగించారు. దాంట్లో ఓ వ్యక్తి యాసిడ్ తీసి ఆమెపై చల్లాడు. నువ్వు నాకు దక్కకుంటే, ఇంకెవ్వరికీ దక్కవద్దు అంటూ వార్నింగ్ ఇచ్చాడు. నిందితుడిని రామ్ జనమ్ సింగ్ పటే ల్‌గా గుర్తించారు. అతను రిమాతో కొన్నాళ్లు రిలేషన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మరో వ్యక్తితో పెళ్లి కుదుర్చుకోవడాన్ని అతను వ్యతిరేకించాడు. మే 27వ తేదీన రీమా పెళ్లి జరగాల్సి ఉన్నది. యాసిడ్ దాడితో తీవ్ర గాయాలైన ఆమెను ప్రస్తుతం ఆస్పత్రిలో చేర్పించారు. ఆజమ్‌ఘర్‌లోని గ్లోబల్ ఆస్పత్రిలో ఆమెకు చికిత్స చేస్తున్నారు. నిందితుడు పటేల్‌తో పాటు మరో బైకర్‌ను అరెస్టు చేశారు. దాడికి వాడిన బైక్‌ను కూడా సీజ్ చేశారు. నిందితుడు తాను కేవలం రీమా వెనుక భాగంలో యాసిడ్ చల్లాలనుకున్నట్లు చెప్పాడు. ఒకవేళ ఆమె పెళ్లి ఆగిపోతే అప్పుడు ఆమెను పెళ్లి చేసుకోవచ్చు అన్న ఉద్దేశాన్ని అతను వ్యక్తం చేశాడు.



## సిఐఎలో భారీగా ఉద్యోగాలకు కత్తెర

**వాషింగ్టన్, మే 3:** అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్న ట్రంప్ యంత్రాంగం భారీ ఎత్తున ఉద్యోగాల్లో కోత విధిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఉద్యోగాల తొలగింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఇందులో భాగంగా అమెరికా ప్రభుత్వం తాజాగా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలో సంస్కరణలకు సిద్ధమైంది. ఏజెన్సీలోని 1200 మంది ఉద్యోగులను తొలగించడానికి కసరత్తు జరుగుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఇదే పంథాలో మరికొన్ని ఏజెన్సీలలోనూ వేలాది ఉద్యోగుల తొలగింపులు ఉంటాయని వెల్లడించాయి. అయితే ఈ నివేదికలపై సిఐఎ ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో స్పందించాల్సి ఉంది.


సిఐఎలోని ప్రణాళికాబద్ధమైన కోతల గురించి అమెరికా ప్రభుత్వం చట్టసభ సభ్యులకు తెలియజేసినట్లు సమాచారం. ఏజెన్సీలో ఇకపై నియామకాల తగ్గింపునకు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఏజెన్సీలో కొత్త శక్తిని నింపడానికి మరింత మెరుగ్గా మార్చడానికి చేపట్టిన సమగ్ర వ్యూహంలో భాగంగా కొన్ని మార్పులు చేస్తున్నట్లు సిఐఎ ప్రతినిధి రాట్‌క్లిఫ్ తెలిపారు. తన నేతృత్వంలో సిఐఎ వ్యక్తిగత పక్షపాతాలు లేకుండా నిష్పాక్షి కంగా పని చేస్తోందన్నారు. ఎంత కష్టమైన ప్పటికీ తాము ప్రపంచంలో ఎవరూ వెళ్లలేని ప్రదేశాలు వెళ్లి ప్రతి మూలలోని నిఘా సమా చారాన్ని సేకరిస్తామన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల కోతల్లో భాగంగా ట్రంప్ యంత్రాంగం అక్కడి ప్రభుత్వ విభాగాలపై కొరడా ఝుళిపిస్తోంది. ఇందులో భాగంగా ఆరోగ్య శాఖలో 10వేల ఉద్యోగాలు, రెవెన్యూ సర్వీసులో 20 వేల ఉద్యోగాలు, 24వేల సైనిక ఉద్యోగాలు తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్మిక శక్తిని 82 వేల నుంచి 62 వేలకు తగ్గించుకోనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఉద్యోగాల తొలగింపునకు ట్రంప్ సర్కారు బైఅవుట్‌ను అస్త్రంగా చేసుకుంది. ఈ మేరకు ఒక ఈ మెయిల్ 20 లక్షల మంది ఉద్యోగులకు పంపారు. స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకొంటే ఎనిమిది నెలల జీతం ఇస్తారని అందులో పేర్కొన్నారు.

ఉద్యోగాలు మానేద్దామని అనుకొని ఆగిపోయిన వారు దీనిని ఎంచుకోవచ్చు. దీని ద్వారా ఇప్పటివరకు దాదాపు 40వేల మంది ఉద్యోగాల నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. దేశంలో అనవసర ఖర్చులు తగ్గించడమే లక్ష్యం గా ట్రంప్ డోజ్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఉద్యోగాల కోత విషయంలో మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం కీలక పాత్ర పోషించింది. ఈ ఉద్యోగాల తొలగింపు వల్ల అమెరికాకు వేల బిలియన్ డాలర్లు ఖర్చు మిగులుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు.


# దేశంలో పలు రాష్ట్రాల్లో పిడుగుల వానలు

**న్యూఢిల్లీ, మే 3:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పిడుగుల తో కూడిన వర్షం పడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం ఇండియన్ మెటియరోలాజికల్ డిపార్టుమెంట్ హెచ్చరించింది. ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తప్పనిసరిగా అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్,విదర్భ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తూర్పు రాజస్థాన్ మొదలు పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, బీహార్ మీదుగా గంగా పరివాహక పశ్చిమబెంగాల్ వరకు పిడుగుల వాన పడే ప్రమాదం ఉందని ఐఎండీ పేర్కొంది. పైన పేర్కొన్న అన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కూడా పడే అవకాశం ఉందని తెలిపింది. అదేవిధంగా అసోం, కర్ణాటక, ఉత్తరాఖండ్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో జల్లులు కురుస్తాయని వెల్లడించింది. ఆయా



ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని తెలిపింది.

## కూలి కుటుంబాన్ని చిదిమేసిన భారీ వర్షం



**న్యూఢిల్లీ:** ఆకస్మికంగా కురిసిన భారీ వర్షం ఒక వ్యక్తి జీవితాన్ని అతలాకుతలం చేసింది. చెట్టు కూలి అతడి ఇంటిపై పడింది. దీంతో కుటుంబంలోని వారంతా మరణించారు. భార్యా పిల్లలు చనిపోయారు. పేద కూలీ అయిన అతడు మాత్రమే బతికిబయటపడ్డాడు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ విషాద సంఘటన జరిగింది. శుక్రవారం ఢిల్లీలో కుండపోతగా వర్షం కురిసింది. నజాఫ్‌గఢ్‌లోని ఖర్ఖరి నహర్ గ్రామంలో నివసిస్తున్న 30ఏళ్ల పేద కూలీ అజయ్ ఇంటిపై వేప చెట్టు కూలింది. ఆ ఇంట్లో నిద్రిస్తున్న అతడి భార్య 28 ఏళ్ల జ్యోతి, ముగ్గురు పిల్లలైన ఏడేళ్ల ఆర్యన్, ఐదేళ్ల రిషబ్, ఏడు నెలల ప్రియాంష్ మరణించారు. గాయపడిన అజయ్ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యాడు. అకాల వర్షం వల్ల కుటుంబంలోని వారందరినీ కోల్పోయిన అతడు ఒంటరిగా మిగిలాడు. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లాకు చెందిన అజయ్ పేద వ్యవసాయ కూలీ. ఢిల్లీలోని ఖర్ఖరి నహర్ గ్రామంలోని శిథిలావస్థకు చేరిన చిన్న ఇంట్లో ఐదేళ్లుగా ఒంటరిగా నివసిస్తున్నాడు. పొలంలో పనులు చేసి జీవిస్తున్నాడు. కష్టపడిన డబ్బును సొంతూరిలో ఉంటున్న భార్యకు పంపేవాడు. మరోవైపు అజయ్ ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని సొంత గ్రామానికి వెళ్లాడు. భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఢిల్లీలోని గ్రామంలో నివసిస్తున్న ఇంటికి తిరిగి వచ్చాడు. ముగ్గురు కొడుకులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలన్న ఉద్దేశంతో వారిని స్కూల్‌లో చేర్పించాడు.ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత మంచి ఇంట్లోకి మారాలని భావించాడు. కాగా, శుక్రవారం తెల్లవారుజా మున కురిసిన భారీవర్షానికి పాతఇంటిపై చెట్టు పడింది. ఆ ఇల్లు కూలడంతో అందులో నిద్రిస్తున్న అజయ్ భార్య, ముగ్గురు పిల్లలు మరణించారు. గాయాలతో బయటపడిన అతడు మాత్రమే ప్రాణాలు దక్కించుకున్నాడు. మరో వైపు కుటుంబ సభ్యులందరినీ అజయ్ కోల్పో వడం చూసి ఇరుగుపొరుగు వారు చలించి పోయారు. వర్షం అతడి కుటుంబానికి తీవ్ర నష్టం కలిగిం చిందని వాపోయారు. పొలంలో కష్టపడి పని చేసే పేద కూలీ, ఇతరులకు సహాయం చేసే అత డికి విధి ఇంత దారుణం చేస్తుందని ఎవరూ ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులతోపాటు సర్వం కోల్పోయిన అజయ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు అభ్యర్థించారు.


## ఒక్కరూపాయి, కొబ్బరికాయతో వివాహం

**సహారాన్‌పూర్(యుపి),మే 3:** వరకట్నం కోసం వేధింపులు జరుగుతున్న ఈ కాలంలోనూ ఓ యువకుడు పెద్ద మనసును చాటుకున్నాడు. పెళ్లి సందర్భంగా అత్తామామలు ఇచ్చిన రూ.31 లక్షల వరకట్నాన్ని వాళ్లకే తిరిగి ఇచ్చేసి తోటి యువతకు ఆదర్శంగా నిలిచాడు. వరుడి సూచన మేరకు కేవలం ఒక రూపాయి నాణెం, ఒక కొబ్బరికాయతో మొత్తం వివాహ క్రతువును పూర్తి చేశారు. ఈ ఘటన హరియాణాలోని కురుక్షేత్రలో ఏప్రిల్ 30న జరిగింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని సహారాన్‌పూర్ జిల్లా భాబ్సి రాయ్ పూర్ గ్రామానికి చెందిన శ్రీపాల్ రాణా కుమారుడు వికాస్ రాణా యువ న్యాయవాది. అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి. ఆయన తండ్రి శ్రీపాల్ రాణా బీఎస్పీ టికెట్‌పై యూపీలోని కైరానా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. అయితే, శ్రీపాల్ రాణా కుమారుడు వికాస్ రాణాకు హరియాణాలోని లుక్షి గ్రామానికి చెందిన అగ్రికా తన్వర్‌తో పెళ్లి సంబంధం కుదిరింది. వివాహ ముహూర్తం ప్రకారం ఏప్రిల్ 30న వికాస్ రాణా కుటుంబం ఊరేగింపుగా హరియాణాలోని కురుక్షేత్రకు వెళ్లారు. ఆ నగరంలోని ఒక హోటల్‌లో అట్టహాసంగా వివాహ వేడుకకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా తిలకం వేడుక జరుగుతున్న సమయంలో వధువు తల్లిదండ్రులు, పెళ్లికొడుకు వికాస్ రాణాకు వరక



ట్నంగా రూ.31లక్షల నగదును ఇచ్చారు. అయితే వరుడు వికాస్, వరకట్నం తీసుకోకుండా పెద్ద మనసును చాటుకున్నాడు. వరకట్నం తీసుకోవడం, ఇవ్వడం సామాజిక దురాచారం అని చెబుతూ, ఆ డబ్బు తీసుకోవడానికి నిరాకరించాడు. ఆ డబ్బును పెళ్లి కూతురి తల్లిదండ్రులకు తిరిగి ఇచ్చేశాడు. తమకు వధువే ఒక కట్నం అని వికాస్ రాణా అన్నారు. దీంతో వికాస్ రాణా, అగ్రికా తన్వర్‌ల పెళ్లి వేడుకను కేవలం ఒక కొబ్బరికాయ, ఒక రూపాయి నాణెంతో జరిపించారు. కట్నం తీసుకోకపోవడం ద్వారా వికాస్ రాణా సభ్య సమాజానికి, ఈతరం యువతకు గొప్ప సందేశాన్ని ఇచ్చారు. నా కొడుకు వికాస్ రాణా కర్ణాటక హైకోర్టులో న్యాయవాది. కోడలు అగ్రికా తన్వర్ పోస్ట్ గ్రాడ్యు యేట్. అభ్యుదయ భావంతో నా కుమారుడు వరకట్నం తీసుకోలేదని శ్రీపాల్ రాణా చెప్పారు. ఇలాంటి ఘటనలు వరకట్నం కోరుకునే యువతకు చెంపదెబ్బ లాంటివని అంటున్నారు.

# సింధుజలాల మళ్లింపు నిర్మాణాలను పేల్చేస్తాం



## పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ప్రేలాపనలు

**ఇస్లామాబాద్, మే 3:** పహల్గాంవ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్ పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఆ దాడి తర్వాత పాక్ నడ్డివిరిచేలా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. అందులో సింధుజలాల ఒప్పందం అమలు నిలిపివేత కూడా ఒకటి. దీని గురించి మాట్లాడుతూ తాజాగా పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ప్రేలాపనలు చేసారు. సింధుజలాలను మళ్లించేందుకు భారత్ ఏ నిర్మాణం చేపట్టినా ధ్వంసం చేస్తామంటూ ప్రేలాపనలు చేసారు. పహల్గాంవ్‌లోని బైసారన్ లోయలో గతనెల 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలా ఇరుదేశాలమధ్య వైషమ్యాలు తారస్థాయికిచేరిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే ఇందుకు ప్రతిగా నదీజలాల ఒప్పందాన్ని పక్కనపెట్టడం ఇదేప్రథమం. పాకిస్థాన్ ఆర్థికవ్యవస్థపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావంచూపిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఈ ఒప్పందం నిలిపివేత పాక్ నేతలు పలుమార్లు భారత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసారు. పాక్ మాజీ విదేశాంగమంత్రి పిపిపి చీఫ్ భిలాలవల్ భుట్టో జర్దారీ నోరు పారేసుకున్నారు. సింధునదిలో నీరు పారకపోతే రక్తం పారుతుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసారు. సింధూనది తమదేనని ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ పలు అసందర్భపు వ్యాఖ్యలు చేసారు.



## మంత్రి శ్రీధర్‌బాబుతో కొత్త సిఎస్ రామకృష్ణారావు భేటీ

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారావు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం సచివాలయంలో మంత్రిని కలిసారు. ఈ సందర్భంగా సిఎస్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా పనిచేసేలా రాష్ట్ర యంత్రాంగాన్ని ముందుకు నడిపించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులందరికీ చేర్చేలా ముందు కెళ్లాలని సిఎస్‌కు సూచించారు.

### గొర్రెల పంపిణీ స్కాం..

## కాంట్రాక్టర్ ఆస్తుల జప్తునకు కోర్టులో ఎసిబి పిటిషన్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏడాదిన్నర క్రితం వెలుగుచూసిన గొర్రెల పంపిణీ స్కాంలో మొదటి నిందితుడుగా వున్న కాంట్రాక్టర్ మొయినుద్దీన్ నేరు సంబంధించిన ఆస్తులను జప్తు చేసేందుకు మొదట నిర్ణయించింది. ఇందుకు సంబంధించి త్వరలో ఎసిబి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనుంది. ఈ కేసులో ఏడాదిన్నరగా పరారీలో వున్న మొయినుద్దీన్ దుబాయ్‌లో వున్నట్లు ఎసిబి గుర్తించింది. మొయినుద్దీన్‌తో పాటు అతని కుమారుడు ఇక్రముద్దీన్ కూడా పరారీలోనే వున్నాడు. మొయినుద్దీన్ కుటుంబం మొదట కొండాపూర్‌లో వుండగా ఆ తరువాత కోకాపేటకు మకాం మార్చింది. దుబాయ్ నుంచి వచ్చిన మొయినుద్దీన్‌ను ఎసిబి అరెస్టు చేసినట్లు వార్తలు వచ్చినా ఎసిబి అధికారులు వాటిని ధృవీకరించలేదు. తాము ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, అతను మొయినుద్దీన్ కాదని వారు తెలిపారు. ఈ కేసులో మొయినుద్దీన్‌తో పాటు అతని కుమారుడు ఇక్రముద్దీన్ తమకు వాంటెడ్ నేరగాళ్లని, వారిని పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు. మరోవైపు దుబాయ్‌లో వుంటున్న మొయినుద్దీన్ అతని కుమారుడు ఇక్రముద్దీన్ వీసా గడువు ముగియడంతో వారిని భారత్‌కు రప్పించేందుకు ఎసిబి అధికారులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇప్పటికే వారిపై ఎల్‌ఓసి జారీ చేయగా కోర్టు నుంచి అరెస్టు వారంట్లు చేయించేందుకు ఎసిబి అధికారులు ప్రయత్నిస్తున్నారు. మొయినుద్దీన్‌కు వంద కోట్ల రూపాయల ఆస్తులు వున్నట్లు ఎసిబి గుర్తించినట్లు సమాచారం.

## పూర్తి సామర్థ్యంతో థర్మల్ విద్యుత్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగనున్న దృష్ట్యా దేశంలోని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో పని చేయాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అన్ని యూనిట్లను ఆదేశించింది. కరెంట్ కొరత లేకుండా ఈ ఏడాది అక్టోబరు 15 వరకు విద్యుత్ ఉత్పత్తిని పూర్తిగా చేయాలని స్పష్టం చేసింది. ప్రస్తుత వేసవిలో ఏప్రిల్ నుండి జూన్ వరకు 260 గిగావాట్ల విద్యుత్‌కు పీక్ డిమాండ్ ఏర్పడే వీలుందని అంచనా వేసింది. గత ఏడాది సెప్టెంబరులో పీక్ డిమాండ్ 243 గిగావాట్లుగా రికార్డయింది. ప్రస్తుత వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మించి నమోదు కావడతో ఆ మేరకు కరెంట్ వినియోగంలో భారీగా పెరుగుదల చోటుచేసుకుంటోందని తెలిపింది.



చలో బస్‌భవన్‌లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

## ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలపై చలో బస్‌భవన్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 3, ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టిజిఎస్‌ఆర్‌టిసి, ఎస్‌డబ్ల్యుఎఫ్, ఐఎన్‌టియుసి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బస్‌భవన్ ఉద్రిక్తతకు దారితీసింది. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్దసంఖ్యలో బస్‌భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా టిజిఎస్‌ఆర్‌టిసి స్టాఫ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి, వైస్‌చైర్మన్ జి.అబ్రహాం, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో కార్మికులు పడుతున్న ఇబ్బందుల పైన అధికారులు, సూపర్ వైజర్ల కార్మికులపై వేధింపులు ఆపాలని, పనిభారాలను తగ్గించాలని, 2021 వేతన సవరణ అమలుకు, ఆర్టీసీలో యూనియన్లను అనుమతించాలని, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు రిటైర్ అయిన వారి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా మాస్టర్ సేల్ ప్రకటించాలని, ఆర్టీసీలో వెల్ ఫేర్ కమిటీలను రద్దు చేసి యూనియన్లను అనుమతించాలి. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయవలసిన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి. అపాయింటెడ్ డేను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వేతన సవరణకు సంబంధించి అలవెన్సులను ఏరియర్స్ లెక్కలు చేసి ప్రతి కార్మికులకు వివరాలు తెలపాలని, ఏరియర్స్ రిటైర్ మెంట్ సమయంలో కాకుండ సంవత్సర కాలపరిమితి పద్దతిలో సహా చెల్లించే విధంగా డిమాండ్లు ఇవ్వాలని, సమ్మె కాలంలో అక్రమంగా పెట్టిన పోలీస్ కేసులను ఎత్తివేయాలని, మహాలక్ష్మి పథకం వలన ఏర్పడ్డ కండక్టర్ల సమస్యలను వారికి తెలియకుండానే చిన్న చిన్న ఆరోపణలకు ఉద్యోగాల కోల్పోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో వెంటనే రిక్రూట్ మెంట్ చేపట్టాలని, కార్మికులపై పనిభారాలు తగ్గించడంతో పాటు అధికారుల వేధింపులు కక్షసాధింపులు ఆపాలని, ఎం.వి.యాక్ట్ ను అతిక్రమించిన డ్యూటీలను తగ్గించాలని, మహానగరంలో సిగ్నల్స్ విపరీతమైన ట్రాఫిక్ లో 14 గంటల నుండి 16 గంటల డ్యూటీలు షెడ్యూల్ చేయడం అన్యాయం అని, ఆ డ్యూటీలు చేసినవారు అనారోగ్యాల పాలౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 16 గంటలు డ్యూటీలు చేస్తూ షెడ్యూల్ ఓటీలో కోత, అసలు మహిళ కండక్టర్ల అత్యవసర పరిస్థితిలో పని చేయడానికి 8 గంటల డ్యూటీలు ఉన్నాయా? ప్రశ్నించారు. రన్నింగ్ బస్సులో వెనక డోర్ నుండి దిగి పడిపోయిన కేసుల్లో డ్రైవర్, కండక్టర్ ను సస్పెండ్ చేయడం, ట్రావెలింగ్ టికెట్ సస్పెండ్ చేయడం వంటి అంశాలపై ఇబ్బందులను గురిచేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

# సైబర్ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయాలి

### ఎన్‌సిఆర్‌పి అధికారుల వెల్లడి

### 79 శాతం కేసుల్లో 1930కి ఫిర్యాదుతోనే సరిపుచ్చుతున్న బాధితులు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై పోలీసులు చేబడుతున్న ప్రచార కార్యక్రమాలు ప్రజలను పూర్తిగా మార్చలేక పోతున్నాయి. సైబర్ నేరాలపై పోలీసులు అనేక రకాల ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నా బాధితులు మాత్రం ఈ విషయంలో స్పందించడం లేదని జాతీయ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) నివేదిక చెబుతోంది. సైబర్ నేరగాళ్ల బారినపడి లక్షల రూపాయల నుంచి కోట్లాది రూపాయలు పోగొట్టుకున్న వారిలో కేవలం 21.16 శాతం బాధితులు మాత్రమే పోలీసు స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారని ఆ నివేదిక వెల్లడించింది. సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు వెంటనే 1930కి ఫిర్యాదు చేయడం వరకు చేస్తున్నా ఆ తరువాత దీనిపై సమీప పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసి, కేసు పురోగతిని పట్టించుకోవడం లేదని ఎన్‌సిఆర్‌పి ని వేదిక చెబుతోంది. ఈ కారణంగా సైబర్ నేరగాళ్ల ఖాతాల నుంచి పోలీసులు జప్తు చేస్తున్న కోట్లాది రూపాయలు బాధితులకు చేరకుండా బ్యాంకుల్లో మ‌ులుగుతోంది 2024లో తెలంగాణ నుంచి ఎన్‌సిఆర్‌పికి లక్షా 14 వేల 174 ఫిర్యాదులు అందగా ఇందులో నుంచి కేవలం 24,643 కేసుల్లోనే బాధితులు పోలీసు స్టేషన్లకు వెళ్లి నేరుగా ఫిర్యాదు చేయడంతో ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ లెక్కన కేవలం 21.16 శాతం కేసులే ఎఫ్‌ఐఆర్‌లుగా మారాయి. ఈ కారణంగా బాధితులు పోగొట్టుకుంటున్న డబ్బులు వారికి అందడం లేదని ఎన్‌సిఆర్‌పి నిపుణులు చెబుతున్నారు.

బాధితులు తాము పోగొట్టుకున్న డబ్బులను తిరిగి పొందాల ంటే కచ్చితంగా ఎఫ్‌ఐఆర్‌లు నమోదయి వుండాలని ఎన్‌సిఆర్‌పి నిపుణులు అంటున్నారు. బాధితులు 1930కి ఫిర్యాదు చేసినంత మా త్రాన ఎఫ్‌ఐఆర్‌లు న మోదుకావని, దీని తరువాత నేరుగా సమీప పోలీసు స్టేషన్లకు వెళ్లి తాము మోసపోయిన విషయం గురించి వివరిస్తే 1930లో నమోదైన ఫిర్యాదు ఆధారంగా బాధితుల నుంచి మళ్లీ ఫిర్యాదు స్వీకరించి ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తారని ఎన్‌సిఆర్‌పి నిపుణులు చెబుతున్నారు. ఇలా చేస్తేనే బాధితులు పోగొట్టుకున్న డబ్బులు తిరిగి వారి బ్యాంకు ఖాతాలకు వస్తాయని వారంటున్నారు. కోర్టులో ఈ పద్ధతిని అంగీకరిస్తాయని వారు చెబుతున్నారు. ఇక చాలా కేసులో చిన్న మొత్తాలు పో గొట్టుకున్న బాధితులు 1930కు కూడా ఫిర్యాదు చేయడం లేదని ఎన్‌సిఆర్‌పి నిపుణులు చెబుతున్నారు. సైబర్ నేరగాళ్ల బారినపడ్డ వారంతా కచ్చితంగా పోలీ సులకు ఫిర్యాదు చేయడం మంచిదని వారంటున్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లోని సైబర్ నేరాలపై పోలీసుల నిర్లక్ష్యం**

ఇక సైబర్ నేరాల విషయంలో చాలా కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యం కూడా వుండడం మరో విశేషం. చాలా కేసుల్లో నిందితుల బ్యాంకు ఖాతాలలో డబ్బులు వు ండక పోవడంతో పోలీసులు కేసులు నమోదు చేయడం లేదని నిపుణుల పరిశీలనలో తేలింది. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల పోలీసు స్టేషన్ల లో ఈ సమస్య ఎక్కువగా వుందని నిపుణులు చెబుతున్నారు. చిన్నపాటి సైబర్ నేరాల విషయంలో కేసులు, గొడవలు ఎందుకని బాధితులతో పాటు పోలీసులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇతర కేసుల్లో నిందితులు పట్టుబడుతున్నా వారిపై గతంలో వున్న కేసులు వెలు గు చూడడం లేదని నిపుణులు అంటు న్నారు. ఈ కారణంగానే సైబర్ నేరాలలో రికవరీ శాతం ఐదు కంటే తక్కువగా వుంటోందని వారంటున్నారు.

# అక్రమంగా తరలిస్తున్న ధాన్యం పట్టివేత

### 7 లారీలు, ఐచర్ వాహనం స్వాధీనం

### 14మందిపై కేసు నమోదు

### వివరాలు వెల్లడించిన డిఎస్‌పి రాజశేఖర్‌రాజు

**మిర్యాలగూడ, మే 3, ప్రభాతవార్త:** ఆంధ్రా నుండి తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వాడపల్లి మీదుగా మిర్యాలగూడ ప్రాంతానికి తరలిస్తున్న సన్న ధాన్యాన్ని వాడపల్లి పోలీసులు పట్టుకున్నారు. శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి రాజశేఖర్ రాజు అక్రమ ధాన్యం పట్టివేత కేసు వివ రాలను వెల్లడించారు. ఆంధ్రాలోని నరసరావు పేట, ప్రకాశం, ఒంగోలు జిల్లాల నుండి ఈ ధాన్యం మిర్యాలగూడ వైపుతరలిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం సన్నవడ్లకు ఇస్తున్న మద్దతు ధర, అదే విధంగా బోనస్‌పొందేందుకు ఆంధ్రాకు చెందిన కొంతమంది దళారులు ఆ ప్రాంత





స్వాధీనం చేసుకున్న లారీలతో డిఎస్‌పి రాజశేఖర్‌రాజు, సిబ్బంది

రైతులను మోసం చేసి ఇక్కడికి ధాన్యాన్ని రవాణా చేస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. 15 రోజుల క్రితమే ధాన్యాన్ని నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసినప్పటికీ అక్రమ మార్గంలో తెలంగాణలోకి ప్రవేశిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 100కు పైగా లారీలను బార్డర్ నుంచి వెనక్కి పంపినట్లు తెలిపారు. నిఘా పెంచడంతో 8 లారీలతో పాటుఐచర్ వాహనంలో తరలిస్తున్న ధాన్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. వాటిని స్వాధీనం చేసుకొని 14మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సన్న ధాన్యం కొనుగోలు సీజన్ ముగిసే వరకు తనిఖీలను ముమ్మరం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ పిఎన్‌డి ప్రసాద్, ఎస్‌ఐలు మల్లికంటి లక్ష్మయ్య, శేఖర్, సైదులు, కె.సంజీవరెడ్డి పాల్గొన్నారు.

# సామాజిక మార్పునకు తెలంగాణ సర్కారు బాటలు

### నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్ మే 3, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఒక ముఖ్యమైన సామాజిక మార్పునకు బాటలు వేసిందని వనరుల్లో, విద్యా, ఉపాధి అవకాశాల్లో అణగారిన వర్గాలకు న్యాయం చేసే దిశగా ఈ మార్పు ఉంటుందని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో కులగణనను చేపట్టాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేయడం పట్ల నాగర్ కర్నూలు ఎంపీ డా. మల్లు రవి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం చేపటే కులగణనలో తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన నమూనాగా తీసుకోవాలని తీర్మానం చేయడం ఎంతో గర్వకారణమని తెలిపారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన కులగణన సర్వేను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

సీఎం చొరవతో రాష్ట్రంలో కుల గణన సర్వేను సమర్థవంతంగా, శాస్త్రీయంగా పూర్తిచేయగలిగారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో భాగమైన మంత్రివర్గం, అధికారులు, కిందస్థాయి సిబ్బంది అందరి కృషి అభినం దనీయం' అని డా. మల్లు రవి వివరించారు. సమాజంలో వాస్తవంగా ఏ వర్గాలు, కులాలు ఎంత శాతం ఉన్నాయన్న సమాచారం ప్రభుత్వం చేతిలో స్పష్టంగా ఉండాలి. అప్పుడే ఆయా వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం సమర్థవంతమైన ప్రణాళికలు చేపడుతుందని ఆయన అన్నారు. కేంద్రం కూడా తెలంగాణ మాదిరిగానే సమగ్రంగా కుల గణనను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని రద్దు చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు అమలు చేసేలా ఆర్టికల్ 15(5)ను తక్షణమే అమలు చేయాలని డా. మల్లు రవి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ మోడల్ ను, ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ కృషిని గుర్తించినందుకు ఆయన మరోసారి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులకు, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి మరోసారి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 8 కొత్త కోర్సులు

### 28 డిగ్రీ కాలేజీల్లో అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరం నుంచి 8 కొత్త కోర్సులను ప్రారంభించనున్నారు. పరిశ్రమలకు అనుసంధానంగా ఉండేలాగా.. మార్కెట్ అవస రాలకు అనుగుణంగా ఉండే కొత్త కోర్సులను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 28 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరం నుండి అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఏఈడిపి)ని ప్రవేశపెట్టనున్నారు. ఈ వినూత్న, పరిశ్రమల అనుసంధాన కోర్సులను ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. బి కామ్‌లో..బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్సూరెన్స్ (బిఎఫ్ ఎస్ ఐ), బికామ్..ఈకామర్స్ ఆపరేషన్స్, బి. కామ్.. రిటైల్ ఆపరేషన్స్, బిఎస్‌సి.. టూరిజం హాస్పిటాలిటీ, బిఎస్‌సి.. డిజిటల్/ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, బిఎస్‌సి... మార్కెటింగ్ అండ్ సేల్స్, బిఎస్‌సి.. ఫార్మాస్యూటికల్ మాను ఫ్యాక్చ రింగ్ అండ్ క్వాలిటీ, బిబిఏ కంటెంట్ అండ్ క్రియేటివ్ రైటింగ్‌లో కోర్సులను ప్రారంభిం చనున్నారు. రాష్ట్రంలో 2019లో చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సిబిసిఎస్)ని ప్రవేశపెట్టడం ఒక కీలకమైన సంస్కరణ. దీంతోపాటు రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) ద్వారా 2018 నుంచి అడ్మిషన్లను చేపడుతున్నారు.

# పత్తి కొనుగోళ్లలో భారీ కుంభకోణం

### బ్రోకర్లు, ట్రేడర్ల ఖాతాలోకి రూ. 3 వేల కోట్లు

### మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 3:** రాష్ట్రంలో పత్తి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని బిఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మార్కెట్లలో వంద లాది మంది బ్రోకర్లతో దందా కొన సాగుతున్నదని ఆరోపించారు. కుట్రపూరితంగా కాంగ్రెస్ నేతలు పత్తి రైతులను ముంచుతున్నారని విమర్శిం చారు. పత్తిని సేకరించకపోవడంతో దళారులకు అమ్ముకునేలా కుట్ర చేశారని వెల్లడించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె గోవర్ధన్ రెడ్డి, తుంగబాలు, వై.సతీష్‌రెడ్డి, రాఘవేంద్ర యాదవ్ లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు పత్తి రైతులను కూడా వదిలి పెట్టలేదన్నారు. రూ.7,500 మద్దతు ధర ఉన్న పత్తిని దళారులు రూ.5 వేలకే కొని రైతులను నిండా ముంచారని చెప్పారు. పత్తి సేకరణలో రూ.3 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. పత్తి కొనుగోళ్లపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో అక్టోబర్‌లోనే పత్తిని సేకరించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో పత్తి కాంటాలను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. పత్తి కుంభకోణంలో కాంగ్రెస్ పెద్దల హస్తం ఉందని చెప్పారు. హైకోర్టులో పిల్ వేస్తే ప్రభుత్వం ఇప్పటికీ కౌంటర్ దాఖలు చేయడంలేదని వెల్లడించారు. బ్రోకర్లు, ట్రేడర్లు టీఆర్ నంబర్లతో అక్రమ ఖాతాలు సృష్టించి సీసీఐకి పత్తిని అమ్ముకున్నారని చెప్పారు. ఒక్కో క్వింటాల్‌పై రూ.2 వేల దోపిడీ జరిగిందన్నారు. కుట్రలో భాగంగానే కొనుగోళ్లను ఆలస్యంగా ప్రారంభించారన్నారు. 2024-2025 లో 25 లక్షల మంది పత్తి పంట పండించారని, 49 లక్షలు బేల్స్ పత్తి పంట పండిందని చెప్పారు. సీసీఐ కొన్నది 41 లక్షల బేల్స్, ప్రైవేట్ ట్రేడింగ్ జరిగింది 8 లక్షల బేల్స్, సీసీఐకి అమ్మిన రైతులు 6 లక్షల 30 వేలు మాత్రమే, ట్రక్ పట్టీలు జారీ చేసినవి 9 లక్షలు మాత్రమే, 60 వేల టీఆర్ లు ప్రభుత్వం ఇచ్చింది. పత్తి మద్దతు ధర క్వింటాల్‌కు 7521 రూపాయలు అయితే ప్రైవేట్ మార్కెట్ లో రూ.5500 రూ.6000 మించలేదని తెలిపారు. సీసీ కెమెరాలు పరిశీలిస్తే దొంగలు దొరుకుతారని, 25 లక్షల మంది రైతుల కష్టాన్ని కాంగ్రెస్ నేతలు దోపిడీ చేశారని, సిట్టింగ్ జడ్జితో పత్తి కుంభకోణంపై దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. దీపావళి సందర్భంగా హైదరాబాద్ లో ఓ ఫైవ్ స్టార్ హోటల్లో సీసీఐ అధికారులు, ప్రముఖ ట్రేడర్స్ మధ్య జరిగిన రహస్య సమావేశం లో కుంభకోణానికి బీజం పడిందన్నారు. మూడు వేల కోట్ల రూపాయల మేర పత్తి రైతులను నిలువు దోపిడీ చేశారని, నకిలీ టీఆర్ నంబర్లతో పత్తి రైతులను కాంగ్రెస్ నేతలు మోసం చేశారని పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లను సీసీఐ ఆలస్యం చేయడం వల్ల రైతులు నష్టపోయారని, ట్రేడర్లు, బ్రోకర్ల అకౌంట్లలో పత్తి పంట డబ్బులు పడ్డా యని, ఇందులో సీసీఐ,మార్కెటింగ్ అధికారుల హస్తం ఉందని ఆరోపించారు.





శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

# మహిళలకు ప్రత్యేక బొగ్గుగనులు

### తొలి క్వార్టర్‌లో 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం

### సింగరేణి సిఎండి బలరామ్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** సింగరేణి సంస్థలో మహిళా ఉద్యోగినిల సంఖ్య పెరిగిన రీత్యా వీరికి ప్రత్యేకంగా బొగ్గు గనులు కేటాయించాలని సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ ఆదేశించారు. వీరి నిర్వహణలో నడిపించడానికి ఒక ఓపెన్ కాస్ట్ గనిని మరియు ఒక భూగర్భ గనిని ఎంపిక చేయాలన్నారు. అంతేకాకుండా ముందుగా ఒక పూర్తి షిఫ్టును కేవలం మహిళల చేతనే నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, 1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని ఏరియాల జనరల్ మేనేజర్లకు స్పష్టం చేశారు. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో సాధించిన బొగ్గు రవాణా 5.66 మిలియన్ టన్నులపై 2.7 శాతం వృద్ధితో గత నెలలో 5.81 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా సాధించామన్నారు. అలాగే గత ఏడాది ఇదే సమయానికి సాధించిన 36.18 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ పై 10.6 శాతం వృద్ధితో గత నెలలో 40 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబి తొలగించామని వివరించారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ లక్ష్యాలు సాధించాలన్నారు. అలాగే ఒడిశా రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకులో పనిచేసేందుకు సూపర్వైజర్ సిబ్బందిని ఎంపిక చేసి నెల రోజుల్లోగా అక్కడికి పంపించాలని చెప్పారు. కొత్తగా నియమించబడిన ఉద్యోగులను భూగర్భ గనుల్లో పనిచేసే విధంగా పోస్టింగులు ఇవ్వాలని సూచించారు. బొగ్గు రవాణా మరియు నాణ్యతపై కూడా ఆయన సమీక్షి ంచారు. నాణ్యత సరిగా లేనట్లయితే బొగ్గు అమ్మకాలు కుంటుబడతాయని, వినియోగదారులు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. కనుక నాణ్యతపై కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా పూర్తి పనిగంటలు సద్వినియోగం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా విధుల పట్ల నిర్లక్ష ్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను అభినందిస్తున్న ప్రధాని మోడీ

# చట్టసభల్లో బిసిలకు 50 శాతం వాటా ఇవ్వాలి

### ప్రధానమంత్రికి ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టి చట్ట సభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్,కృష్ణయ్య ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు. విజయవాడలో కలిసి ప్రధానమంత్రికి బిసిల డిమాండ్లపై విజ్ఞప్తి చేశారు. కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల కృష్ణయ్య ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు బిసిల జనాభా ప్రకారం 27 శాతం నుండి 56 శాతంకు పెంచాలని కోరారు. బిసిల విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్ల పై ఉన్న క్రిమిలేయరు తొలగించాలని కోరారు. బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి.

బీసీల అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలని కోరాడు. ఎస్సీ ఎస్టీ అట్రా సిటీ యాక్ట్ మాదిరిగా బిసిలకు బిసి యాక్ట్ తీసుకురావాలని కోరాడు. ఎస్సీ ఎస్టీ బిసిలకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు పెట్టాలని కోరాడు. కేంద్ర బడ్జెటులో రెండు లక్షల కోట్లు బీసీలకు కేటాయించి కేంద్రంలో బి.సి.లకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్,ఫీజు రియంబర్స్‌మెంట్ స్కీము విధానం సాచురేషన్ పద్ధతిలో ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్రాలు అమలు చేసే పదకాలకు 60 మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కోరాడు. జాతీయ బి.సి కార్పొరేషన్ ద్వారా బి.సి కుల వృత్తులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 15 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ డిమాండ్లు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని, ప్రధానమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు.

**కృష్ణయ్య నిజమైన నాయకుడు..: ప్రధాని మోడీ వ్యాఖ్య**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ దేశంలో 40 సంవత్స రాలుగా బిసిల గురించి పోరాడుతున్న నాయకుడు కృష్ణయ్య అని ప్రధానమంత్రికి చెప్పగా ప్రధాని స్పందిస్తూ కృష్ణయ్య నిజమైన నాయకుడని, అంకితభావం గల నాయకుడు అని ప్రశంసించారు.

# భర్త ముందే భార్యకు ఆకతాయిల వేధింపులు

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), మే 3, ప్రభాతవార్త:** భర్తతో కలిసి పబ్ నుంచి తిరిగి ఇంటికి వెళ్తుండగా మహిళను ముగ్గురు పోకిరీలు వెంబడించి, బెదరించి దాడికి పాల్పడిన ఘటన మధురానగర్ పిఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, ఏపిలోని ఒంగోలుకు చెందిన ఓ మహిళ(29) భర్త, మరిది, ఆడపడుచుతో కలిసి హైదరాబాద్, రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్న తన బంధువుల ఇంటికి వెళ్లారు. వీరంతా కలిసి గురువారం సాయంత్రం బేగంపేటలోని క్లబ్ 8 పబ్‌కు వెళ్లి రాత్రి 12 గంటలకు తిరిగి ఇంటికి బయలుదేరారు. అయితే పబ్ నుంచి బయటకు వస్తున్న సమయంలో పంజాగుట్టకు చెందిన సంపత్(28), సందీప్(28), కూకట్‌పల్లికి చెందిన ఉమేష్(28) ఆమెను గమనించి వెంటపడ్డారు. భర్తతో కలిసివస్తున్న వారిలో ఒకడు వెకిలిగా మాట్లాడుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. అంతేకాకుండా బీరు బాటిళ్లతో బెదరింపులకు దిగారు. బేగంపేట నుంచి రహమత్‌నగర్ వరకూ వారి వెంటపడుతూ వేధింపులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఆమె భర్త తన భార్యను ఇంటికి చేర్చి స్నేహితుడిని, డ్రాప్ చేయడానికి ఎస్‌ఆర్‌నగర్ మెట్రోస్టేషన్ దగ్గరికి రాగా మళ్లీ అదే ముగ్గురు యువకులు దాడికి దిగారు. వారు ప్రయాణిస్తున్న బైక్‌ను అడ్డగించి, ఫోన్లను బలవం తంగా లాక్కున్నారు. వెంటనే బాధితులు డయల్ 100 సహాయంతో పోలీసులకు సమాచారం అందించగా, స్పందించి మధురానగర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ముగ్గురు ఆకతాయిలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



### ఎటువంటి అసౌకర్యం కలగకుండా

# పటిష్ట బందోబస్తు

### అధికారులతో టెలికాన్ఫరెన్స్

### నిర్వహించిన సిఎస్ రామకృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 3:** ఈ నెల 10వ తేదీ నుండి హైదరాబాద్‌లో జరగనున్న మిస్ వరల్డ్ 2025కు సంబంధించిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు సీనియర్ పోలీసు అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులతో శనివారం తెలంగాణ రాష్ట్ర సచివాల యం నుండి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విస్తృత స్థాయి ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో సూచించిన విధంగా చేపట్టిన ఏర్పాట్ల పై సవివరమైన నివేదికను అందించాలని సీఎస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుండి వచ్చే అతిథులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ ను ఆదేశించారు. విమానాశ్రయం, హోటల్స్, అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించే వేదికల వద్ద గట్టి భద్రతను కల్పించాలన్నారు. పోటీదారుల కోసం సవివరమైన బుక్‌లెట్ సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దాలని జీహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. డీజీపి జితేందర్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఇతర అధికారులు ఈ టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

**హైదరాబాద్‌కు చేరుకున్న మిస్ కెనడా**

హైదరాబాద్ లో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న వివిధ దేశాల సుందరీమణుల రాక ప్రారంభమయింది. ఈ మిస్ వరల్డ్ పోటీల కంటెస్టర్లు ఈ నెల 6 వ తేదీ నుండి హైదరాబాద్ కు చేరుకుంటారు. మిస్ కెనడా మిస్ ఎమ్మా డీనా కాథరిన్ మోరిసన్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు శనివారం సాయంత్రం చేరుకున్నారు. శంషాబాద్‌కు చేరుకున్న మిస్ కెనడాకు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాల ప్రకారం అధికారులు ఘన స్వాగతం పలికారు.

# ప్రభుత్వ ఒత్తిడితో కులగణనకు కేంద్రం అంగీకారం

### శాస్త్రీయంగా కులగణన చేపట్టాలి

### సర్వే ద్వారా వచ్చే ఫలితాలను ప్రజలకు అందించాలి

### ఖమ్మంలో డిప్యూటీ సిఎం భట్టికి బిసి నేతల ఘనసన్మానం

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** అఖిల భారత కాంగ్రెస్, తెలంగాణ ప్రభుత్వం చేసిన ఒత్తిడి ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం తలొంచి దిగొచ్చి కులగణన చేస్తామని ప్రకటించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియ జేస్తూ శనివారం ఖమ్మంలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో బీసీ సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రక టించడం తెలంగాణ ప్రజాప్రభుత్వం, ప్రజల విజయమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రజాప్రభుత్వం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా కులగణన సర్వే చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానంచేసి, కేంద్రానికి పంపించి ఒత్తిడి చేయడంతో పాటు గుజరాత్‌లో జరిగిన సిడబ్ల్యుసి సమావేశంలో తెలంగాణలో జరిగినట్టుగానే దేశం మొత్తం కులగణన సర్వే చేయాలని తీర్మానంచేసి పార్లమెంట్‌లో గొంతు ఎత్తిన ఫలితంగా కేంద్రం తలదించి వచ్చి కులగణన చేస్తామని ప్రకటించడం తెలంగాణ ప్రభుత్వం, ప్రజల విజయమని అభివర్ణించారు.

1930 తర్వాత దేశంలో కులగణన జరగలేదని దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం మాత్రమే ఎలాంటి ఆక్షేపణ లేకుండా విజయ వంతంగా కులగణన సర్వే నిర్వహించి దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. రాష్ట్రంలో కులగణన సర్వే నిర్వహించడం క్లిష్టమైన సమస్య అయినప్పటికీ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రిగా నేను (భట్టి విక్రమార్క), యావత్తు మంత్రిమండలి ఎంత ఇబ్బంది ఉన్నప్పటికీ కులగణన సర్వే నిర్వహించాలని నిర్ణయం తీసుకొని 50 నుంచి 55 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. కులగణన సర్వేలో కులాల గురించి మాత్రమే కాకుండా ప్రజలకు సంబంధించిన ఆర్థిక, రాజకీయ, ఉద్యోగ అవకాశాలు, సహజ వనరులు అన్ని వర్గాలకు ఎంతవరకు పంచబడ్డాయి?, వారి జీవన ప్రమాణ పరిస్థితులు ఎలా ఉన్నాయన్న అంశాలను సేకరించమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమం అభివృద్ధికి సంబంధించి విధానపరమైన నిర్ణయాల్లో కులగణన సర్వేలో వచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. తాను మంత్రిత్వ బాధ్యతలు నిర్వహిస్తున్న ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా కులగణన సర్వే జరిగిందని అన్నారు. 150 ఇళ్లను ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేసి, ఎన్యుమరేటర్‌ను నియామకం చేసి రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే చేపట్టామని వివరించారు. పది బ్లాకులకు ఒక సూపర్‌వైజర్, మండల జిల్లా స్థాయిలో కోఆర్డినేటర్లు, జిల్లా కలెక్టర్, రాష్ట్ర స్థాయిలో తాము నిత్యం పర్యవేక్షణ చేసి పకడ్బందీగా సర్వే నిర్వహించి ఎలాంటి ఆక్షేపణ లేకుండా అసెంబ్లీలో బిల్లు పెట్టామని వివరించారు.

రాష్ట్రంలో బీసీలు 56 శాతం ఉన్నారని లెక్కలు తేల్చడంతోపాటు 42 శాతం బీసీలకు స్థానిక సంస్థల్లోను, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని అసెంబ్లీలో బిల్ పాస్ చేయించి కేంద్రానికి పంపించడమే కాకుండా తెలంగాణలో జరిగినట్టుగానే దేశవ్యాప్తంగా కులగణన సర్వే చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రధానమంత్రి కి లేఖ రాసి కేంద్రంపై ఒత్తిడి చేశామన్నారు. అదే విధంగా అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో గుజరాత్‌లో జరిగిన సీడబ్ల్యుసి సమావేశంలో కూడా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన విధంగానే దేశవ్యాప్తంగా కులగణన సర్వే చేయాలని తీర్మానంచేసి కేంద్రానికి పంపించారన్నారు.

అలాగే పార్లమెంట్లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కులగణనపై గొంతెత్తి మాట్లాడారని చెప్పారు. సమష్టి పోరాట ఫలితంగా కేంద్రం తలొంచి దిగివచ్చి దేశవ్యాప్తంగా కులగణన సర్వే చేస్తామని ప్రకటించిందని అన్నారు. కులగణన సర్వే ద్వారా వచ్చే ఫలితాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి ప్రజాప్రభుత్వానికి బీసీలు అండగా ఉండాలని కోరారు. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలు చేయడం రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యావత్ మంత్రిమండలి చిత్తశుద్ధితో పని చేస్తున్నదని వెల్లడించారు. ఎస్జీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులు, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణను విజయవంతంగా నిర్వహించుటలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అకుంఠిత దీక్ష పట్టుదలతో శాస్త్రీయ బద్ధంగా నిర్వహించి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

శతాబ్దాల బీసీల అణిచివేతకు కులగణన సర్వే ద్వారా పరిష్కారం చూపారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి ఉద్యోగుల సంఘం నాయకులు, గౌడ, యాదవ, నాయీ బ్రాహ్మణ, రజక, పద్మశాలి, విశ్వకర్మ, శాలివాహన, కాపు కులాల నాయకులు గండు యాదగిరి, మన్సూర్, పోతగాని వెంకన్న బెజ్జంకి ప్రభాకరచారి, ఎర్రమల శ్రీనివాస్, చంద్రశేఖర్‌గౌడ్, బచ్చుల పద్మచారి, సున్నం రమేశ్, పాపారావు యాదవ్, నవీన శ్రీనివాస్, వెంకన్న యాదవ్, రవీంద్రప్రసాద్, వెంకటరామకృష్ణ, జైపాల్, యర్రా రమేశ్ పాల్గొన్నారు.

# గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా తెలంగాణ



### మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు మెడికల్ టూరిజంపై పరిచయం కార్యక్రమం

### ప్రపంచవ్యాప్తంగా పెద్దఎత్తున విదేశీ హెల్త్ టూరిస్ట్‌లను ఆకర్షించడమే లక్ష్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 3:** మిస్ వరల్డ్ పోటీలతో ప్రపంచ వైద్య పర్యాటక పటంలో తెలంగాణ ప్రముఖ కేంద్రంగా మారనుంది. సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకాల మేరకు 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే, 150 కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యేమిస్ వరల్డ్ ఈవెంట్ లో మెడికల్ టూరిజంను ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. 16న తెలంగాణ మెడికల్ టూరిజంపై పరిచయం సీఎం రవంత్ రెడ్డి సూచనతో తెలంగాణలో తక్కువ ఖర్చుతో అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలను, మెడికల్ టూరిజంలో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని తెలియజేసేలా మిస్ వరల్డ్ కాంటెస్టెంట్‌లకు ఈ నెల 16 వ తేదీన హైదరాబాద్‌లోని ఏఐజి హాస్పిటల్‌లో నిర్వహించే మెడికల్ టూరిజం ఈవెంట్‌ను ప్రత్యేకంగా అధికారులు నిర్వహిస్తున్నారు. ఖర్చు తక్కువ ప్రభావవంతమైన చికిత్సలు అమెరికా, యూరప్ వంటి దేశాలతో పోలిస్తే తెలంగాణలో చికిత్స ఖర్చులు 60-80శాతం తక్కువ. దాదాపు శతాబ్ద కాలంగా వైద్య సేవలు అందిస్తున్న ఉస్మానియా ఆస్పత్రి , నిమ్స్ ,ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రి, అపోలో హాస్పిటల్స్, యశోదా హాస్పిటల్స్, అపోలో కాంటినెంటల్ హాస్పిటల్స్ వంటి ప్రైవేట్ ఆసుపత్రులు అత్యాధునిక సాంకేతికత (రోబోటిక్ సర్జరీ, టెలిమెడిసిన్), మల్టీస్పెషాలిటీ కేంద్రాలతో.... కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, క్యాన్సర్ చికిత్స, ట్రాన్స్‌ప్లాంటేషన్, కాస్మెటిక్ ప్లాస్టిక్ సర్జరీ,ఫెర్టిలిటీ చికిత్సలు (ఐవిఎఫ్), అవయవ మార్పిడి వంటి సంక్లిష్ట ప్రక్రియలకు నిపుణులైన వైద్యులతో సమర్థవంతమైన చికిత్స అందిస్తున్నారు.

ఇక, మెడికల్ చార్జీల కొస్తే, అమెరికా తదితర పాశ్చాత్య దేశాలలో హార్ట్ సర్జరీకి/ బై పాస్ సర్జరీ ఒక లక్ష డాలర్లు అవుతుండగా హైదరాబాద్‌లో మాత్రం కేవలం 5 వేల డాలర్ల నుండి 10 వేల డాలర్లు మాత్రమే ఖర్చు అవుతున్నాయి అదేవిధంగా, మోకాలు నీ రీప్లేస్ మెంట్ సర్జరీకి వెస్ట్రన్ కౌంటరి లలో 40 వేల నుండి 60 వేల డాలర్లు అవుతుండగా, హైదరాబాద్ లో మాత్రం ఐదు వేల డాలర్ల లోపే అవుతున్నాయి. డెంటల్ సమస్యలకు విదేశాలలో ఐదు వేల డాలర్లు అవుతుండగా మన దగ్గర వ్యయి డాలర్ల లోపే అవుతున్నాయి అందుకే, విదేశాలనుండి వైద్య అవసరాలకు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ వస్తున్నారు పైగా తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్ లో అనేక ఆసుపత్రులు అత్యుత్తమ వైద్య చికిత్సగా గుర్తింపుగా భావించే జెసిఐ (జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్) , ఎన్ఏబిహెచ్ అక్రెడిటేషన్లను సాధించాయి, ఇది రోగుల నమ్మకాన్ని మరింతగా పెంచింది.

ఆధునిక వైద్యంతో పాటూ భారత సంప్రదాయ వైద్య విధానాల పట్ల విదేశీయులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ వైద్య విధానాలైనా ఆయుర్వేద, హోమియో, యునాని పై కూడా ప్రచారం నిర్వహించేందుకు, వాటి ప్రయోజనాలను తెలిపేందుకు తద్వారా భారత సంప్రదాయ వైద్య సేవలను విదేశీయులకు చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. మెడికల్ హెల్త్ టూరిస్ట్‌లను ఆకర్షిస్తున్న అంశాలు ఇవే తక్కువ ఖర్చుతో సమర్థవంతమైన చికిత్సలు, అత్యంత నైపుణ్యం కలిగిన వైద్యులు, నిపుణులు, కనీస నిరీక్షణ సమయాలు, ఇంగ్లీష్ మాట్లాడే సిబ్బంది, కమ్యూనికేషన్ సౌలభ్యం, ప్రభుత్వ మద్దతు , వైద్య వీసా (ఇ-వీసా), స్నేహపూర్వక వాతావరణం, కనెక్టివిటీ, రాష్ట్ర ప్రభుత్వ మద్దతు ఫలితంగా అమెరికా, రష్యా, బ్రిటన్, ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం నుండి రోగులు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. దీనివల్ల తెలంగాణలో మెడికల్ టూరిజం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. రెండు రెట్లు పెరిగిన విదేశీ హెల్త్ టూరిస్టులు 2014 సంవత్సరంలో 75 వేల 171 మంది విదేశీ విదేశీ హెల్త్ టూరిస్టులు వైద్య సేవలు పొందేందుకు హైదరాబాద్‌కు రాగా... 2024 సంవత్సరం వరకూ దశాబ్ద కాలంలో 1 లక్షా 55 వేల 313 మంది విదేశీయులు వచ్చారు. అదే సమయంలో 2024 సంవత్సరంలో 8 కోట్ల 82 లక్షల 39 వేల 675 మంది రోగులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వైద్య సేవల కోసం తెలంగాణకు వచ్చారు. ఇప్పటికే మెడికల్ టూరిజంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉండగా, మిస్ వరల్డ్ ఈవెంట్ నిర్వహణతో మెడికల్ టూరిజంలో తెలంగాణను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన బంజారా విద్యార్థినుల కుటుంబానికి కెటిఆర్ అండ

### మలేషియాలో చిక్కుకున్న తండ్రికి తిరుగుప్రయాణ ఏర్పాట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 3:** నిర్మల్ జిల్లాలోని పెంబి మండలం లోతేర తండాకు చెందిన అక్కచెల్లెలు బాణావత్ మంజుల మరియు బాణావత్ అశ్వినీలు ఎంసెట్ పరీక్ష రాసి తిరిగే ప్రయాణంలో నిన్న ఆర్మూర్ వద్ద జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదానికి దారితీసింది. విద్యాభ్యాసంలో ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతున్న ఈ బంజారా విద్యార్థినుల చిన్న వయసులోనే జీవితం ముగిసిపోవడం స్థానిక ప్రజల మనసును కలిచివేసింది.

ఈ విషాద ఘటనపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందిస్తూ, బాధిత కుటుంబానికి పూర్తిగా అండగా ఉంటామని తెలిపారు. మృతురాలుల తండ్రి బాణావత్ రెడ్డి ఉపాధి నిమిత్తం మలేషియాలో ఉన్న విషయం తెలుసుకున్న కేటీఆర్, ఆయన వెంటనే తెలంగాణకు తిరిగి రాగలిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తన కార్యాలయ అధికారులను ఆదేశించారు.

అంతేగాకుండా, మలేసియా లోని భారత దౌత్యాధికారులతో సమన్వయం చేసి, ప్రయాణ అనుమతులు, టిక్కెట్ల సహా అన్ని ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ విషాద ఘటన విషయం తెలిసిన వెంటనే, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ అర్ధరాత్రి సమయంలోనే ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని మృతుల కుటుంబ సభ్యులకు మద్దతుగా నిలిచారు. వైద్యులు, పోలీసులు అధికారులు అందరితో సమన్వయం చేస్తూ మరణాంతర పరీక్షల ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం మృతదేహాలను అంబులెన్స్ ద్వారా స్వగ్రామం లోతేర తండాకు తరలించి, అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ, 'చిన్నవయసులో ప్రాణాలు కోల్పోయిన మంజుల, అశ్వినీలు ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగిన విద్యార్థినులు. వారి మరణం మా అందరికీ తీరనిగాయం. తండ్రి విదేశాల్లో ఉండటంతో కుటుంబం తీవ్ర బాధలో ఉంది. కేటీఆర్ ఆదేశంతో తండ్రి తిరిగి రావడానికి ఏర్పాట్లు వేగంగా జరిగాయి' అని పేర్కొన్నారు. బంజారా సమాజం నేతలు, స్థానిక తండాల నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ అంత్యక్రియల్లో పాల్గొని మృతుల కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టుకు ప్రభాకర్‌రావు?

### ఫోన్ ట్యాపింగ్ కేసులో..

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా వుండి ఏడాదికి పైగా పరారీలో వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ పిటి షన్‌ను హైకోర్టు కొట్టి వేయడం తెలిసిందే. దీంతో ఆయన తరపు న్యాయవాదులు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. ఈ కేసు వెలుగులోకి రాకముందే ప్రభాకర్ రావు అమెరికాకు పారిపోవడం తెలిసిందే. అప్పటి నుంచి ఆయనను భారత్‌కు రప్పించేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో చివరగా ఇంటర్ పోల్ సహాయంతో రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేయించారు. ఈ ప్రక్రియ తరువాత ప్రభాకర్ రావును చట్టపరమైన విధానం ప్రకారం భారత్‌కు రప్పించే ప్రయత్నం కొనసాగుతుండగా ఆయన హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ డిస్మిస్ అవడ ంతో ఆయన తన అనారోగ్య కారణాలను చూపి సుప్రీం కోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అయితే దీనిని అడ్డుకునేందు కు పోలీసులు కూడా తమ వంతు ప్రయత్నాలు చేబట్టారు. ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టులో ముందస్తు బెయిల్ రాకుండా వుండేందుకు కెవియట్ పిటిషన్ దాఖ లు చేసేందుకు పోలీసు శాఖ సన్నద్ధమవుతుందని తెలిసింది.



# పహల్గాం ఉగ్రదాడిపై కేంద్రానికి ఎన్ఐఎ నివేదిక

**న్యూఢిల్లీ, మే 3:** జమ్ముకశ్మీర్‌లో ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ తన ప్రాథమిక నివేదికను అతి త్వరలోనే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించడానికి సన్నాహాలు చేస్తోంది. దక్షిణ కశ్మీర్‌లోని అత్యంత సుందరమైన పర్యాటక ప్రదేశాల్లో ఒకటైన పహల్గాంను చూడడానికి వచ్చిన పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులు చేశారు. దీని వెనుక ఉన్నది పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అని భారత్ భావిస్తోంది. దీనికి పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఐఎస్ఐ పాక్ సైన్యం నుంచి పూర్తి మద్దతు ఉన్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఎన్ ఐఏ డైరెక్టర్ జనరల్ సదానంద్ ప్రత్యక్ష పర్యవేక్షణలో పహల్గాం ఉగ్రదాడి నివేదిక రూపొందించారు. దాదాపు 150 మంది సాక్షులు చెప్పిన సాక్ష్యాలు, దాడి జరిగిన రీతిని వివరించే త్రీడీ రీక్రియేషన్, ఘటనా స్థలంలో దొరికిన కాట్రిడ్జెస్, బాలిస్టిక్ విశ్లేషణలు సహా పలు ఆధారాలతో ఈ నివేదిక రూపొందించినట్లు, దీనిని అతిత్వరలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖను సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇది సరిహద్దు అవతల నుంచి సమన్వయంతో, పక్కా ప్రణాళికతో, చాలా జాగ్రత్తగా చేసిన ఉగ్రదాడి. ఉగ్రవాదులు బేతాబ్ లోయలో ముందుగానే ఆయుధాలను మోహరించారు. ఆ ప్రాంతంలోని ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చారు. వారికి నిఘా సమాచారాన్ని కూడా అందించారని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ సీనియర్ అధికారి తెలిపారు. పహల్గాం దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు పాక్ ఆక్రమిత కశ్మీర్ పీఓకేలో ఉన్న హ్యాండ్లర్స్‌తో సంప్రదింపులు కొనసాగించారు. అంతేకాదు ఇప్పటికీ వాళ్లు దక్షిణ కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో చురుగ్గా ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులకు సహకరిస్తున్న జాబితాను ఎన్ఐఏ రూపొంచింది. వారి నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేయడమే లక్ష్యంగా చట్టపరమైన, పరిపాలనా చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతోంది. ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్ ఈ వారం స్వయంగా బైసరన్‌కు వెళ్లారు. దర్యాప్తు పరోగతి గురించి స్వయంగా పర్యవేక్షించారు. ఎన్ఏఐ బృందాలు ఫోరెన్సిక్ నిపుణుల సహాయంతో మరిన్ని సాక్ష్యాల కోసం ప్రయత్నిస్తోంది. అలాగే మరింత మంది సాక్ష్యాల ను సేకరించేందుకు ప్రయత్నిస్తోంది. ఉగ్రదాడి జరిగిన విధానాన్ని , ఆ సంఘటనల క్రమాన్ని తెలుసుకునేందుకు ఎన్ఐఏ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఉగ్రదాడి నుంచి బతికి బయటపడిన వ్యక్తుల వాగ్మూలాలను సేకరించడానికి అదనపు బృందాలను పంపించింది. అలాగే స్థానికులు, కీలక ప్రత్యక్ష సాక్షులను, ఫొటోగ్రాఫర్‌లను కూడా ఎన్ఐఏ ప్రశ్నిస్తోంది. పహల్గాం ఉగ్రదాడులకు పాల్పడినట్లు భావిస్తున్న ముగ్గురు అనుమానితుల స్కెచ్‌లను అధికారులు విడుదల చేశారు. వారిలో ఇద్దరు పాకిస్థానీయుల కాగా, ఒకరు భారత్‌లోని అనంత్‌నాగ్ జిల్లాకు చెందినవాడు. తల్హా భాయ్ అలీ భాయ్, హాషీమ్ ముసా పాక్‌కు చెందినవారు కాగా, ఆదిల్ హుస్సేన్ థోకర్ స్థానిక ఉగ్రవాది. ఈ ముగ్గురికి లష్కరే తోయిబాతో అనుబంధం ఉంది. ఈ ఉగ్రదాడికి సంబంధించి ప్రశ్నించేందుకు కశ్మీర్ లోయలో దాదాపు 2000 మందికి పైగా వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అంతేకాదు ఈ ఉగ్రవాదుల ఆచూకీ తెలిపిన వారికి రూ.20 లక్షల రివార్డ్‌ను పోలీసులు ప్రకటించారు.

# ఆందోళనకరంగా ఎరువుల వినియోగం

### 20 లక్షల టన్నులకుపైగా యూరియా

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** తెలంగాణలో పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం ఏటా భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పైర్లు పచ్చగా, ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశ్యంతో రైతులు అధిక శాతం విష రసాయనాలను విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో పంట పొలాల్లో భాస్వరం నిల్వలు భారీగా పేరుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణలో ప్రతీ ఏటా వానాకాలం, యాసంగి వ్యవసాయ సీజన్లలో ఒక్క యూరియానే 20 లక్షల టన్నులకు పైగా వినియోగిస్తున్నారని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి.

దేశంలో పంజాబ్ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రసాయనిక ఎరువులు, క్రిమి సంహారిక పురుగు మందుల వినియోగం అధికంగా ఉంది. రాష్ట్రంలో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడుతున్నట్లు ఒక అధ్యయనంలో వెల్లడైంది. కొన్ని జిల్లాల్లో భాస్వరం, నత్రజని, పొటాష్ ఎక్కువగా ఉన్నా మళ్లీ రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. ఏడేళ్ల కాలంలో తెలంగాణలో ఏకంగా 38 శాతం డై అమ్మోనియం ఫాస్పేట్ వినియోగం పెరిగింది. ప్రధాన వాణిజ్య పంట పత్తితో సహా పసుపు, వేరుశెనగ తదితర పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు అధికంగా సాగు చేసే ప్రాంతాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తే అందులో అవసరానికి మించి భాస్వరం ఉన్నట్లు తేలింది.

అయినా రాష్ట్రంలో వానాకాలం, యాసంగి సీజన్లలో ప్రతీ ఏటా 5 లక్షల టన్నులకు పైగా డై అమ్మోనియం ఫాస్ఫేట్‌ను పొలాల్లో చల్లుతున్నట్లు అధికారులు గుర్తించారు.

# రాష్ట్రంలో కనీస సౌకర్యాలు లేని గిరిజన స్కూళ్లు

### 40 శాతం పాఠశాలల్లో ఒకే టీచర్!

### భాష సమస్యలతో గందరగోళం

### సమస్యలకు నిలయాలుగా పాఠశాలలు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ పనితీరు అపహాస్యం పాలవుతోంది. రాను రాను విద్యా రంగంలో ఆధునిక పరిజ్ఞానం చోటు చేసుకుంటున్నా వాటిని అందిపుచ్చుకోవడంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా పలు ప్రాంతాల్లో అక్షరాస్యత కాగితాలకే పరిమితం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంక్షేమ శాఖ పాఠశాలల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. దీనికి తగినట్లుగా వివిధ స్కూళ్లలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలతో చదువులు సాగక పలువురు తల్లిదండ్రులు తమ పిల్లను స్కూళ్లకు పంపించడం లేదు. తెలంగాణ వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖ నేతృత్వంలో 1,920 పాఠశాలలు ఉన్నాయి. అయితే వీటిలో దాదాపు 40 శాతం మేర 765 పాఠశాలలు ఇప్పటికీ ఒకే ఉపాధ్యాయునిచే నిర్వహించబడుతున్నాయి. ఈ విధంగా రాష్ట్రంలోనే అత్యధికంగా ఆసిఫాబాద్ జిల్లాలో 489 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా, నల్లగొండ జిల్లాలో 340 పాఠశాలలు, కొత్తగూడెంలో 297 పాఠశాలలు ఉన్నాయి. అలాగే గద్వాల గ్రామీన ప్రాంతాల్లో ఇలాంటివి 67 పాఠశాలు ఉండగా, జిల్లా వ్యాప్తంగా మరో 285 పాఠశాలలను ఇద్దర ఉపాధ్యాయులతోనే నడుపుతున్నారు.

మండల స్థాయి సమావేశాలకు హాజరు కావాల్సిన నేపథ్యంలో ఏకోపాధ్యాయ పాఠశాలలను మూసివేయాల్సిన పరిస్థితి తప్పడం లేదు. మరోపక్క రాష్ట్రంలోని పలు గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలతో కూడిన పాఠశాలలు ఉండాల్సి ఉండగా వాటిల్లో కనీస సౌకర్యాలు లేకుండా పోయాయనే విమర్శలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని పలు గిరిజన సంక్షేమ పాఠశాలల్లో తరగతి గదుల కొరత, కిటీలు, తలుపులు లేకపోవడం, అపరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగు నీటి సౌకర్యం లేకపోవడం, కాంపౌండ్ వాల్స్ లేక ముఖ్యంగా బాలికలు అవస్థలు, నిర్వహణ కోసం తగిన సిబ్బంది లేకపోవడం లాంటి పలు సమస్యలు గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలను పట్టిపీడిస్తున్నాయి. కొన్నిన పాఠశాలల్లో ఫర్నిచర్ లేక విద్యార్థులు నేల మీదే కూర్చోవాల్సిన దుస్థితి నెలకొంది. మరికొన్ని స్కూళ్లకు తలుపులేని బాత్‌రూంలతో ప్రధానంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆయా పాఠశాలకు తమ పిల్లలను పంపకుండా వారి తల్లిదండ్రులు తమకు చేదోడువాదోడుగా ఉంటారనే ఉద్దేశ్యంతో వారిని ఇతర పనుల్లో వినియోగిస్తున్నారు. దీంతో విద్యార్థుల హాజరు శాతం దారుణంగా ఉంటోంది. ఫలితంగా విద్యలో నాణ్యతా ప్రమాణాలు దెబ్బతింటున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో భాష, పాఠ్యపుస్తకాల్లోని లిపి వంటి మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ విధంగానే ఆసిఫాబాద్ జిల్లాలోని పవర్‌గూడ ప్రాంతంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడే భాషపై కచ్చితత్వంలో గందరగోళం నెలకొంది. పవర్‌గూడ పొరుగున ఉన్న మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు సమీపంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడే భాషలు వేరుగా ఉండగా, పాఠ్యపుస్తకాలలోని లిపి గురించి తెలియక గందరగోళ వాతావరణంలో నెట్టుకొస్తున్నారు.

సరిహద్దులోని అనేక పాఠశాలల్లో చాలా మంది విద్యార్థులు కొలామి లేదా అంద్ భాషను మాట్లాడుతుండగా, మరాఠీలో విద్యభ్యాసం చేసిన ఉపాధ్యాయుడు గోండి భాషను మాట్లాడుతుంటారు. ఇక పాఠ్యపుస్తకాలలు తెలుగు లేదా ఇంగ్లీషులో ఉండగా, విద్యార్థులు వారి స్థానిక భాషలతో పాటు, ఎక్కువగా మరాఠీ మాట్లాడతారు. ఈ విధంగా విద్యార్థులు ఒక భాష, ఉపాధ్యాయులు మరో భాష, పుస్తకాల్లోని పాఠ్యాంశాలది ఇంకో భాష కావడంతో వారు పడే ఇబ్బందుల వర్ణనాతీతంగా ఉంటాయని స్థానికులు వాపోతున్నారు.

# ఇండియన్ సెన్సిబిలిటీస్‌తో ఇంటర్నేషనల్ ఫిలిం..అల్లు అర్జున్

భారతదేశ సినీ ప్రేమికులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ అభిమానులు ఎదురుచూస్తున్న అత్యంత సన్సేషనల్ కాంబో అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించనున్న అత్యంత భారీ చిత్రం, సన్సేషనల్ చిత్రం ప్రకటన ఇటీవల అధికారికంగా వచ్చేసింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా సన్‌పిక్చర్స్ సంస్థ ఈ భారీ ప్రకటనను ఎంతో ప్రస్టేజియస్‌గా విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇండియన్ సినిమా పరిశ్రమనలో నూతన ఉత్తేజాన్ని నింపిన ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ ఎంటర్టైన్‌మెంట్ సంస్థ సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ సమర్పణలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న అంతర్జాతీయ ప్రాజెక్ట్ ఇది. లాస్ ఏంజెల్స్‌లోని ఓ స్టూడియోలో ప్రత్యేకంగా హీరో అల్లు అర్జున్, హాలీవుడ్ టెక్నిషియన్స్, దర్శకుడు అట్లీలపై చిత్రీకరించిన ఓ ప్రత్యేక వీడియోద్వారా ఈ అనౌన్స్‌మెంట్‌ను చేసి అందర్నీ సర్‌ప్రైజ్ చేసిన సంగతివిదితమే. కాగా ఈ వీడియోకు వచ్చిన స్పందన అంతా ఇంతా కాదు. ఈ ఇద్దరి సన్సేషన్ కలయికలో రాబోతున్న సినిమా ఎలా వుండబోతుందనే ఓ ఊహకు ఈ వీడియో ఊతం ఇచ్చింది. ఈ వీడియో చూసిన వాళ్లందరూ ఎదో అద్భుతంగా జరగబోతుందని ముందే ఊహిం చేసుకున్నారు. ఇప్పటివరకు టైటిల్ ఖరారు కాని ఈ పాన్‌ఇండియా చిత్రంతో, మూడు ముఖ్యమైన సృజనాత్మక శక్తులు ఏకమవుతున్నాయి: భారీ బ్లాక్‌బస్టర్ చిత్రాల దర్శకుడు అట్లీ (జవాన్, థెరి, బిగిల్, మెర్సల్ వంటి చిత్రాలతో ప్రఖ్యాతి గాంచిన వాడు), పుష్ప చిత్రంతో దేశవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించిన, జాతీయ అవార్డు గ్రహీత ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, భారతదేశం లోని అగ్రగణ్య మీడియా సంస్థలలో ఒకటైన సన్ టీవీ నెట్‌వర్క్‌కు చెందిన సన్ పిక్చర్స్. ప్రస్తుతం ప్రాజెక్ట్ ఎ22ఎక్స్ ఎ6గా పిలవబడుతున్న ఈ చిత్రం, భారతీయ విలు వలతో కూడిన కథనంతో కూడిన ఓ భారీ ఎమోషనల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. అంతర్జాతీయ స్థాయిలో ఆకర్షణ కలిగించేలా రూపొందించనున్న ఈ సినిమా, భావోద్వేగాలు, మాస్ యాక్షన్, పెద్ద స్కేలు నిర్మాణంతో ఓ చారిత్రక సినిమాగా నిలవనుందని చెప్ప బడుతోంది. ఈప్రత్యేక వీడియో చూసిన అందరూ ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో ఓ మ్యాజిక్ జరగబోతుంది.



# దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'రజాకార్'

భారతదేశంలో స్వతంత్ర, ప్రభుత్వేతర, లాభాపేక్షలేని, వాణిజ్యేతర చలనచిత్రోత్స వంగా 2011నుంచి దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 30న జరిగే ఈ ఉత్సవం, భారతీయ సినిమా పితామహుడిగా గౌరవించబడే దాదా సాహెబ్ ఫాల్కే అని ప్రేమగా పిలుచుకునే దివంగత శ్రీ ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే వారసత్వాన్ని గౌరవిస్తుంది. యువ, అనుభవజ్ఞులైన చిత్ర నిర్మాతల నుండి వినూత్నమైన, ఆలోచనలను రేకెత్తించే, ప్రగతిశీల చిత్రాలను గుర్తించి ప్రోత్సహించడం దీని లక్ష్యం. ఈ క్రమంలో రజాకర్ ఉత్తమ తొలి దర్శకుడు, ఉత్తమ సినిమాటోగ్రాఫర్ అవార్డులను గెల్చుకుంది. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకలోని 16 జిల్లాలలో విస్తరించి ఉన్న నిజాం రాజ్యాన్ని మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలించారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత, చాలా రాజ్యాలు ఐక్యంగా ఉండగా, నిజాం రాజ్యం మాత్రం ప్రతిఘటించింది. తుర్కిస్తాన్ పేరుతో సార్వభౌమత్వాన్ని కోరింది. అన్ని రాజ్యాల్ని భారతదేశంలో విలీనం చేయడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ నడుం బిగించారు. ఈ క్రమంలో ఒక స్టాండ్‌స్టిల్ ఒప్పందం ప్రజలు నిర్ణయించుకోవడానికి ఒక సంవత్సరం సమయం ఇచ్చారు. కానీ నిజాం మాత్రం ఖాసిం రజ్వీ నేతృత్వంలోని ప్రైవేట్ సైన్యమైన రజాకర్‌ను ఏర్పాటు చేసి బలవంతపు మతమార్పిడులు, హింసాత్మక ఆక్రమణలకు ప్రయత్నించాడు. పెరుగుతున్న అశాంతి మధ్య పటేల్ ఆపరేషన్ పోలోతో నిజాంను ఓడించారు. సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ భారతదేశంలో విలీనం అయ్యింది. ఈ చరిత్ర ఆధారంగానే రజాకార్ చిత్రాన్ని తీశారు.




ఈ తరం యువత తమ చరిత్రను అర్థం చేసుకోవాల్సిన ముఖ్యమైన అవసరాన్ని గుర్తించి ఈ సినిమాను తీశారు. సీనియర్ జర్నలిస్ట్, దర్శకుడు యాట సత్యనారాయణ తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక నివాళిగా రజాకార్ చిత్రాన్ని అందంగా చిత్రీకరించారు. దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో కుశేందర్ రమేష్ రెడ్డికి ప్రతిష్టాత్మకమైన ఉత్తమ సినిమాటోగ్రాఫర్ అవార్డు లభించింది. అతని అసాధారణ సాంకేతిక ప్రతిభకు గుర్తింపుఅని చెప్పుకోవచ్చు. రజాకార్ విజువల్స్ ప్రేక్షకులపై శాశ్వత ప్రభావాన్ని చూపింది. ప్రేక్షకుల్ని లీనమయ్యేలా అద్భుతమైన విజువల్స్ అందించారు. యాట సత్యనారాయణ విజన్‌కు ప్రాణంపోశారు. ప్రతి షాట్ ఆలోచనాత్మకంగా రూపొందించారు. చరిత్ర పట్ల లోతైన మక్కువ, తన జన్మస్థలం పట్ల గర్వంతో నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి తెలంగాణా అన్ సంగ్ హీరోలను గౌరవించటానికి ఈ చిత్రాన్ని నిర్మించారు.

# 'హిట్ 3' కి అంచనాలకు మించి ఆడియన్స్..

నేచురల్ స్టార్ నాని సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్: దిథర్డ్ కేస్. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించింది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా, నాని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే 1న పాన్ ఇండియా గ్రాండ్‌గా రిలీజ్ అయిన హిట్: ది థర్డ్ కేస్ అందరినీ ఆకట్టుకొని బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని అందుకొని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ శైలేష్ కొలను విలేకరలు సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. **నానిని ఎంత వైలెంట్‌గా చూపించాలని దసరా చూసిన తర్వాత అనిపించిందా?**

హిట్ సెకండ్ పార్ట్‌లోనే నాని క్యారెక్టర్ ఎలా ఉండబోతుందో చివర్లో ఒక గ్లింప్స్ లాగా చూపించా. అర్జున్ సర్కార్ ఎలా ఉంటాడో అప్పుడే ఆడియన్స్ కి ఒక అవగాహన వచ్చింది. ఈ తరహా పాత్రకు ఎలాంటి క్యారెక్టరైజేషన్ కావాలో అలా డిజైన్ చేయడం జరిగింది. **ఇందులో డార్క్ వెబ్‌ని ఎక్స్లోర్ చేశారు కదా.. దాని గురించి?** డార్క్ వెబ్ బిగ్ ప్రాబ్లమ్ ఇన్ ఇండియా. చాలా ఇల్లీగల్ యాక్టివిటీస్ జరుగుతున్నాయి. సైబర్ డిపార్ట్మెంట్ దీని మీద వర్క్ చేస్తోంది. ఈ సినిమా కోసం కూడా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ డిపార్ట్మెంట్ వారు చాలా హెల్ప్ చేశారు. డార్క్ వెబ్ గురించి చాలా ఇన్ఫర్మేషన్ ఇచ్చారు. **హిట్ 4లో కార్తీ గారిని ఎలా చూపించబోతున్నారు?** క్యారెక్టర్ ఏంటి అనేది నాకు ఐడియా ఉంది. ఆల్రెడీ సినిమాలో చూపించాం తనకి క్రికెట్ అంటే ఇష్టం బెట్టింగ్స్ వేస్తుంటాడు. ఆ క్యారెక్టర్ కొంచెం రూటేడ్‌గా ఉండబోతుంది. క్యారెక్టర్‌లో ఫన్ కూడా ఉంటుంది. **రావు రమేష్ గురించి?** రావు రమేష్ చాలా కైండ్. ఆయన హిట్ 2లో చేశారు. ఆ డివిజన్‌కి అయిన హెడ్ కాబట్టి ఆ క్యారెక్టర్‌నే చూపించాలి. ఆయన కథ కూడా వినకుండా ఎంత చిన్న క్యారెక్టర్ అయినా వచ్చి చేస్తానని చెప్పారు. **చాగంటి వారి వాయిస్ ఎవరి గురించి?** చాగంటి వాయిస్ ఓవర్ వాడడం వలన సినిమాకి ఒక ఇంట్రెస్టింగ్ టింజ్ వచ్చింది. నిజంగా క్వైట్ కాంట్రస్ట్ ఇమేజ్‌కి ఆ వాయిస్ వాడడం ఒక గూస్ బంప్ మూమెంట్. ఈ సినిమా ఐడియా చాగంటికి చెప్పాను.



## నివేత థామస్ నయా లుక్



# 'కింగ్‌డమ్' ఫస్ట్ సాంగ్ విడుదల

కింగ్‌డమ్ చిత్రం నుండి ఇటీవల విడుదలైన హృదయం లోపల ప్రోమోకి విశేష స్పందన లభించింది. తక్కువ వ్యవధిలోనే 20 మిలియన్లకు పైగా వీక్షణలు సాధించి, పూర్తి గీతం కోసం అందరూ ఎదురు చూసేలా ఉంది. తాజాగా హృదయం లోపల గీతం విడుదలైంది. విడుదలైన నిమిషాల్లోనే ఊహించిన దానికంటే భారీ స్పందనను సొంతం చేసుకుంది.

అనిరుధ్ రవిచందర్ తన మనోహరమైన సంగీతంతో హృదయం లోపల గీతాన్ని అందంగా మలిచారు. గాయని అనుమిత నదేశన్‌తో కలిసి అనిరుధ్ స్వయంగా ఈ పాటను ఆలపించడం విశేషం. వీరి మధుర గాత్రం పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. ఈ గీతానికి కెకె కవితాత్మకమైన సాహిత్యాన్ని అందించారు. దార్ గై తనదైన కొరియోగ్రఫీతో పాటలోని భావోద్వేగానికి దృశ్యరూపం ఇచ్చారు. హృదయం లోపల గీతం విడుదల సందర్భంగా సంగీత దర్శకుడు అనిరుధ్ కి కథానాయకుడు విజయ్ దేవరకొండ తన సామాజిక మాధ్యమం ఖాతా అయిన ట్విట్టర్ ద్వారా భావాలను పంచుకున్నారు. నటుడు కావాలనే నా కల నెరవేరితే, అతనితో కలిసి పని చేయాలి అనుకున్నాను. పదేళ్ల తర్వాత, నా పదమూడో సినిమాకి ఇది సాధ్యపడింది. మా కలయికలో మొదటి గీతం విడుదల కావడం చాలా సంతోషంగా ఉంది. అని విజయ్ దేవరకొండ రాసుకొచ్చారు. కథానాయకుడు విజయ్ దేవరకొండ, దర్శకుడు గౌతమ్ తిన్ననూరి, సంగీత దర్శకుడు అనిరుధ్ త్రయం చేతులు కలిపితే అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా హృదయం లోపల గీతం ఉంది. కింగ్‌డమ్ రూపంలో ఓ మంచి ఆల్బమ్‌ని అందించబోతున్నట్లు తొలి గీతంతోనే ఈ త్రయం హామీ ఇచ్చింది. వీడియో సాంగ్‌లో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. కథ లోతును తెలియజేస్తూ.. సినిమా పట్ల ఆసక్తిని, అంచనాలను రెట్టింపు చేస్తున్నాయి. ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలకు తగ్గట్టుగా, ఎక్కడా రాజీ పడకుండా సినిమాని భారీస్థాయిలో రూపొందిస్తున్నారని విజువల్స్‌ని బట్టి అర్థమవుతోంది. జోమోన్ టి. జాన్ మరియు గిరీష్ గంగాధరన్ ఛాయాగ్రహణం అత్యున్నత స్థాయిలో ఉంది.



జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఈ చిత్ర ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి అద్భుతమైన కథను, అంతే అద్భుతంగా తెరకెక్కిస్తూ కింగ్‌డమ్‌తో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించడానికి సిద్ధమవుతున్నారు.

# 'గుర్రం పాపిరెడ్డి' మోషన్ పోస్టర్ రిలీజ్

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా గుర్రం పాపిరెడ్డి. ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేను సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉన్న గుర్రం పాపిరెడ్డి సినిమా మోషన్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. గుర్రం పాపిరెడ్డి మూవీ మోషన్ పోస్టర్ పూర్తిగా కొత్తగా ఉండి ఆకట్టుకుంటోంది. పర్ఫెక్ట్ డార్క్ కామెడీ మూవీ ఎలా ఉండబోతుందో ఈ మోషన్ పోస్టర్ చూపిస్తోంది. డిఫరెంట్‌గా డిజైన్ చేసిన క్యారెక్టర్స్‌ను హైదరాబాద్ సిటీ బ్యాక్ డ్రాప్‌లో కాంటెం



పరరీగా, స్టైలిష్‌గా ప్రెజెంట్ చేశారు దర్శకుడు మురళీ మనోహర్. మోషన్ పోస్టర్‌లోని సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్, కామెడీ హైలైట్‌గా నిలుస్తున్నాయి. నటీనటులు: నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా, బ్రహ్మానందం, యోగి బాబు, రాజ్ కుమార్ కాసిరెడ్డి, జీవన్ కుమార్, వంశీధర్ కోసిగి, జాన్ విజయ్, మొట్ట రాజేంద్రన్, తదితరులు. టెక్నికల్ టీమ్: సమర్పణ: డా.సంధ్య గోలీ పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్)
నిర్మాతలు: వేను సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ)
రచన, దర్శకత్వం: మురళీ మనోహర్.

# నేహా శెట్టి ట్రెడిషనల్ లుక్

టాలీవుడ్‌లో ఉన్న హీరోయిన్లలో అందంలో తిరుగులేని బ్యూటీ నేహా శెట్టి. గతేడాది గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, టిల్లు స్క్వేర్ చిత్రాలతో ఆడియన్స్ ముందుకు వచ్చింది నేహా. ఇందులో టిల్లు స్క్వేర్‌లో కేమియోనే చేసింది. ఈ రెండూ నేహాకి మంచి సక్సెస్‌నే ఇచ్చాయి. కానీ ఆ తర్వాత కొత్త సినిమా అయితే ఏం ప్రకటించలేదు ఈ బ్యూటీ. నేహా శెట్టి ట్రెడిషనల్ లుక్.. ఫొటోల్లో మాత్రం గ్లామర్ కిక్



మెహబూబా చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది నేహా శెట్టి. ఆ తర్వాత పలు సినిమాలు చేసినా డీజే టిల్లుతో బ్లాక్ బస్టర్ కొట్టేసింది. ఈ సినిమాలో రాధికగా నేహా అందాలకి ఆడియన్స్ ఫ్యాన్స్ అయిపోయారు. ఇక తాజాగా లెహంగాలో అందాలు ఆరబోస్తూ కిక్కిచ్చింది ఈ బ్యూటీ. ఈ ఫొటోల్లో నేహా అందాలకి ఫ్యాన్స్ ఆహా అనదే. ఈ ఫొటోలు మీరూ చూసేయండి.

# 'రెట్రో' మూవీ ఈవెంట్ వ్యాఖ్యలపై విజయ్ దేవరకొండ అపాలజీ

సూర్య హీరోగా నటించిన రెట్రో మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తన వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చారు హీరో విజయ్ దేవరకొండ. ఈ ఈవెంట్ లో విజయ్ దేవరకొండ మాటల్లో ట్రైబ్ అనే పదం వచ్చింది. ఈ మాటను కొందరు అపార్థం చేసుకుని హర్ట్ అయ్యారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో విజయ్ దేవరకొండ తన మాటలపై స్పష్టత ఇచ్చారు. ట్రైబ్ అని తను వాడిన పదం వెనక ఉద్దేశం భూమ్మీద తొలినాళ్లలో మనమంతా తెగలుగా, జాతులుగా ఉన్నామని చెప్పడమే కానీ అందులో షెడ్యూల్ ట్రైబ్స్ గురించి కాదని విజయ్ వివరణ ఇచ్చారు. షెడ్యూల్ ట్రైబ్స్ వారిని తాను ఎంతగానో గౌరవిస్తానని, ప్రేమిస్తానని, వారూ మన సమాజంలో ఒక ముఖ్య భాగమని భావిస్తానని విజయ్ దేవరకొండ తన తాజా సోషల్ మీడియా పోస్ట్ ద్వారా వెల్లడించారు. విజయ్ దేవరకొండ స్పందిస్తూ రెట్రో ఈవెంట్‌లో నేను మాట్లాడిన మాటలు కొందరిని ఇబ్బంది పెట్టాయనే విషయం నా దృష్టికి వచ్చింది. కానీ నా మాటల్లో ఎవరినీ బాధ పెట్టాలనే ఉద్దేశం ఏమాత్రం లేదు. షెడ్యూల్ ట్రైబ్స్ అంటే నాకు ఎంతో గౌరవం, ప్రేమ. నేను మన సమాజంలో ఐక్యత ఉండాలి, ఒక్కటిగా మనమంతా ముందుకెళ్లాలనే చెప్పాను. దేశమంతా ఒక్కటిగా నిలబడాలని మాట్లాడాను. మానవ జాతి తొలినాళ్లలో ట్రైబ్స్, క్లాన్స్‌గా ఉండేవాళ్లం. ఆ ఉద్దేశంతో ట్రైబ్ అనే మాట వాడాను. ఈ మాటకు ఎవరైనా హర్ట్ అయితే చింతిస్తున్నాను. శాంతి, పురోభివృద్ధి, ఐక్యత కోసం నా సినిమా మీడియంను ఉపయోగిస్తాను అన్నారు.



# క్రేజీ బ్యూటీ అయేషా ఖాన్..


అయేషా ఖాన్ తెలుగు, హిందీ చిత్రాలతో పాపులర్ అయింది. ముంబైలో జన్మించిన ఈ ముద్దుగుమ్మ సోదరుడు షహబాజ్ ఖాన్ ఇండియన్ మర్చంట్ నేవీలో అధికారి. ఈ అమ్మడు తన అందం, అభియనంతో ఆకట్టుకుంటుంది. అయేషా 2020లో ఏక్తా కపూర్ యొక్క డైలీ సోప్ కసౌతీ జిందగీ కేలో జూనియర్ ఆర్టిస్ట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. అయేషా ఖాన్ తెలుగు, హిందీ చిత్రాలతో పాపులర్ అయింది. ముంబైలో జన్మించిన ఈ ముద్దుగుమ్మ సోదరుడు షహబాజ్ ఖాన్ ఇండియన్ మర్చంట్ నేవీలో అధికారి. ఈ అమ్మడు తన అందం, అభినయంతో ఆకట్టుకుంటుంది. అయేషా 2020లో ఏక్తా కపూర్ యొక్క డైలీ సోప్ కసౌతీ జిందగీ కేలో జూనియర్ ఆర్టిస్ట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. 2019లో బాలవీర్ రిటర్న్స్ షోలో బిర్బా పాత్రలో నటించి గుర్తింపు పొందింది. 2022లో తెలుగు చిత్రం ముఖచిత్రం ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత ఓం భీమ్ బుష్, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, మనమే వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించింది. ఓం భీమ్ బుష్లో ఆమో గ్లామరస్ పాత్రకు మంచి గుర్తింపు లభించింది. 2023లో హిందీ బిగ్‌బాస్ సీజన్ 17లో కంటెస్టెంట్‌గా పాల్గొని, స్టార్‌డమ్‌ను సంపాదించింది. ఈ షో ఆమెను దేశవ్యాప్తంగా గుర్తించేలా చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ బ్యూటీ సిజ్లింగ్ డ్యాన్స్ రీల్స్ ద్వారా



సోషల్ మీడియా సంచలనంగా మారింది. అయేషా అభిమానులను ఆకర్షిస్తుంది. తాజాగా చీరకట్టులోనూ ఓ బ్యూటీ నటించి మెప్పిస్తుంది.

# ముఖంపై మెరుపుకోసం..

శరీరానికి ముఖమే ప్రాధాన్యం. ఎవరికైనా ముఖం అందంగా ఉండాలని ఉంటుంది. ముఖానికి అందంగా చేసుకునేందుకు ఎన్నో చిట్కాలు, మరెన్నో ఉపాయాలు ఉన్నాయి. పాలను ముఖానికి అప్లై చేసుకొని పావుగంటయ్యాక కడిగేసుకోవాలి. తద్వారా చర్మంపై జిడ్డుదనం తొలగుతుంది. జిడ్డుకు కారణమయ్యే సీబమ్ ఉత్పత్తి కూడా అదుపులోకొస్తుంది. తేనెతోనూ ముఖంపై జిడ్డుదనాన్ని తొలగించచ్చు. ఇందుకోసం తేనెను ముఖానికి పూతలా వేసుకోవాలి. 15 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఫలితం ఉంటుంది. ముఖాన్ని శుభ్రపరుచుకునే నీళ్లలో నిమ్మరసం కలుపుకొన్నా, నిమ్మరసంతో తయారుచేసిన ఐస్క్యూబ్‌తో ముఖాన్ని రుద్దుకున్నా చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. గుడ్డులోని తెల్లసొన, ద్రాక్షరసం, నిమ్మరసం.. ఈ మూడింటినీ కొద్ది మొత్తాల్లో తీసుకొని మిశ్రమంగా చేసుకోవాలి. దీన్ని ముఖానికి పూసుకొని పావుగంట తర్వాత కడిగేసుకోవాలి. నిమ్మరసం సహజసిద్ధమైన క్లెన్సర్‌గా పనిచేస్తుంది, గుడ్డులోని తెల్లసొన చర్మం బిగుతుగా మారడానికి, ద్రాక్షరసం చర్మం మృదువుగా మారడానికి ఉపకరిస్తాయి. కొబ్బరి పాలను ముఖానికి రాసుకొని అరగంటయ్యాక శుభ్రం చేసుకుంటే జిడ్డుదనం తగ్గుతుం



సాధారణంగా ఆయిలీ స్కిన్ ఉన్నవారు ఎక్కువసార్లు ముఖం కడుక్కుంటూ ఉంటారు. ఇది మంచిది కాదు. ఎందుకంటే ఈ క్రమంలో పదే పదే సోప్ లేదా ఫేస్‌వాష్ వాడితే..వాటిలో ఉండే రసాయనాలు చర్మాన్ని పొడిబారేలా చేస్తాయి. కాబట్టి సాధారణ నీటితో రోజుకు రెండు లేదా మూడుసార్లు ముఖం శుభ్రం చరేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. తద్వారా కూడా జిడ్డుదనం అదుపులోకొస్తుందంటున్నారు. నీళ్లలో చెంచా ఉప్పు కలిపి ఒక స్ప్రే బాటిల్‌లో పోసుకుని దగ్గర పెట్టుకోండి. రోజులో ఒకటి లేదా రెండుసార్లు ఆ నీటిని ముఖం మీద స్ప్రే చేసుకుని ముఖం అంతా సమానంగా పరచాలి. కాసేపు అలాగే ఆరనివ్వాలి. దీనివల్ల కూడా జిడ్డుదనం క్రమంగా తగ్గముఖం పడుతుంది.

# మన సహవాసం దేవుడితోనే..

'ఆయనతో (దేవుని) సహవాసము చేసినయెడల నీకు సమాధానము కలుగును. అలాగున నీకు మేలు కలుగును'. (యోబు 22:21). నిజమే దేవుడితో మనకు నిత్యం సహవాసం కలిగి ఉంటే చాలు సమాధానంతో జీవిస్తాం. 'సమాధానం' అంటే మనసులో నెమ్మది, శాంతి, నిర్మలత్వం.



కోపాలు, ద్వేషాలు వంటి భావోద్వేగాలతో నలిగిపోతున్నాం. నెమ్మదిలేక, విశ్రాంతి లేక, శాంతిలేక జీవిస్తున్నవారు ఎందరో. ఇంకా కొందరైతే వీటిని పొందేందుకు ఎక్కడికెక్కడికో వెళ్లిపోతున్నారు. అలాగని మన పనులన్నీటిని వదిలిపెట్టి దేవుడు తనవద్ద గడపమని అడగడు. కానీ మన మొదటి ప్రాధాన్యత మాత్రం దేవుడికే ఇవ్వాలి అనేది ప్రభువు కోరుతున్నాడు. ఎందుకంటే మొదట ప్రభువుకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడు మన జీవితంలో ఎలాంటి సమస్యలు, ఒడిదుడుకులు ఎదురైనా వాటిని చక్కటి పరిష్కరించుకుంటాం..కాదు దేవుడే పరిష్కరిస్తాడు. లేదా వాటి నుంచి బయటపడే మార్గాలను, తెలివితేటలను దేవుడు అనుగ్రహిస్తాడు.

అంతేకాదు ఓ నిశ్చయత కలిగి ఉంటాం. సరే దేవుడితో సహవాసం ఉండాలంటే ఏం చేయాలి? ఏవిధంగా ఆయనతో సహవాసం చేయగలం? ప్రార్థన చేయడం, బైబిల్ చదవడం, చర్చికి వెళ్లి దేవుడి వాక్యాన్ని వినడం ఇలా రోజులో మనకు అవకాశం దొరికినంత సమయం దేవుడితోనే మన సహవాసం ఉండేందుకు ప్రయత్నించాలి. నేటి కాలంలో మనకు అన్నింటికి టైమ్ ఉంది కానీ, దేవుడి సన్నిధిలో గడిపేందుకు మాత్రం టైమ్ లేదు అనుకుంటాం. అందుకే మన జీవితంలో నిత్యం పోరాటాలు,

కాబట్టి ఉదయం నిద్రలేచిన వెంటనే, రాత్రి నిద్రపోయేముందు దేవుడి సన్నిధిలో కొద్దిసేపు గడిపేందుకు ప్రతిఒక్క విశ్వాసి స్థిరమైన నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే మన ఆధ్యాత్మిక జీవితం బాగుంటుంది. ఇతరులకు ఆదర్శవంతంగా, దేవుడికి మహిమాకరంగా ఉండగలం.

- పి.వాణిపుష్ప

అంత ర్వాణి

కాలిఫ్లవర్‌ను నీళ్లలో ఉడికించి ఆ నీళ్లు తాగితే గుండె బలపడి రక్తవృద్ధి జరిగి రోగి త్వరగా కోలుకుంటాడు

తేనె వేడిచేసి పోటు ఉన్న చెవిలో రెండు చుక్కలు వేస్తే నొప్పి తగ్గుతుంది

# పోహా పులావ్

**కావలసినవి:** మందంగా ఉండే అటుకులు: ఒకటిన్నర కప్పు, నూనె రెండు చెంచాలు, పచ్చిమిర్చి : మూడు, యాలకులు: రెండు, లవంగాలు : మూడు, అనాస పువ్వు : ఒకటి, దాల్చిన చెక్క: చిన్న ముక్క, ఉల్లిపాయల ముక్కలు, కప్పు, పుదీనా: పావుకప్పు, అల్లం వెల్లుల్లీ పేస్ట్: చెంచా, పచ్చి బఠాణీలు : అరకప్పు, తరిగి పెట్టుకున్న పుట్టగొడుగు ముక్కలు : అరకప్పు, జీడిపప్పు, పావుకప్పు, ఉప్పు : తగినంత.



**తయారీ విధానం :** అటుకుల్ని కడిగి నీళ్లను వార్చి, పది నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. స్టవ్ మీద కడాయి పెట్టుకుని అందులో నూనే వేసి యాలకులు, లవంగాలు, అనాసపువ్వు, దాల్చినచెక్కా, పచ్చిమిర్చీ వేసి అరనిమిషంపాటు వేయించాలి. ఆ తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి అది కూడా వేగాక పుదీనా, ఉల్లిపాయ ముక్కలూ వేసి మళ్లీ వేయించుకోవాలి. ఆ తర్వాత పుట్టగొడుగులూ, జీడిపప్పు, పచ్చిమిర్చి పేస్ట్ వేసి అది కూడా వేగాగా, పుదీనా, ఉల్లిపాయ ముక్కలూ వేసే మళ్లీ వేయించుకోవాలి. ఆ తర్వాత పుట్టగొడుగులూ, జీడిపప్పు, పచ్చిబఠానీలూ బాగా వేగి మెత్తబడ్డాక నానబెట్టి ఉంచుకున్న అటుకులు వేసి బాగా కలియ తిప్పుతుంటే రుచికరమైన పోహా పులావ్ సిద్ధం.

# ఇంట్లో ఒంటరిగా..

కొంతమంది తాము చేసే ప్రతి పనిని ఇతరులకు తెలియజేయాలనే ఆత్రుతతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటారు. ఒక్కోసారి ఇవే ప్రమాదకరంగా మారుతుంటాయి. ఇదే విషయాన్ని మీ పిల్లలకు తెలియజేయండి. మీరు మీ పిల్లలను ఇంట్లో వదిలి వెళ్లినప్పుడు వారు ఒంటరిగా ఉన్నారని తెలియజేసే విధంగా ఎలాంటి పోస్టులు పెట్టద్దని చెప్పండి. ఇలాంటిపోస్టులు పెట్టడం వల్ల కలిగే ప్రమాదాన్ని ఉదాహరణ రూపంలో వివరించండి. వారొస్తే డోర్ తీయద్దు.. సాధారణంగా పిల్లలను అపరిచితులకు దూరంగా ఉంచుతుంటాం. అలాగే వారు ఏది ఇచ్చినా తీసుకోవద్దని చెబుతుంటాం. ఇదే పద్ధతిని మీరు ఇంట్లో లేని సమయంలోనూ పాటించమని చెప్పాలి. అలాంటి వారెవరైనా వస్తే డోర్ తీయవద్దని చెప్పాలి. దీనికోసం మీ ఇంటి చుట్టూ సెక్యూరిటీ కెమెరాలను పెట్టండి. ఇలా చేయడం వల్ల ఎవరు డోర్ బెల్ కొట్టారో సులభంగా తెలుసు కోవచ్చు. అలాగే మీరు ఎక్కడున్నా సరే మధ్యమధ్యలో ఈ కెమెరాల మధ్య వాళ్ల ఎలా ఉన్నారో చెక్ చేయడం మర్చిపోవద్దు.

అత్యవసర నంబర్లు చెప్పండి.. అత్యవసర పరిస్థితుల్లో ఎవరికి ఫోన్ చేయాలో ముందుగానే



చెప్పండి. వాటిని ఎమర్జెన్సీ నంబర్లుగా వారి ఫోన్లో సేవ్ చేయండి. మీ సన్నిహితులు, ఇంటి పక్కన ఉన్నవారి నంబర్లను కూడా వారికి చెప్పండి. ఎమర్జెన్సీ లైట్లకు ఎప్పుడూ ఛార్జింగ్ ఉండేలా చూసు కోవాలి. దానిని ఎలా ఉపయోగించాలో పిల్లలకు చెప్పండి. ఎప్పుడైనా కరెంట్ లేనప్పుడు ఇది బాగా ఉపయోగపడుతుంది.

కొంచెం పెద్దవారైతే ఇంటర్నెట్‌ని ఎక్కువగా ఉపయోగి స్తుంటారు. అలాంటి వారికి ఇంటర్నెట్ వాడకానికి సంబంధించిన జాగ్రత్తలను వివరించండి. ఫోన్‌లో లొకేషన్‌ని ఆఫ్ చేయడం, సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాలను పంచుకోకుండా ఉండడం. వంటివి ఇందులో భాగమే. పిల్లలు ఆడుకుంటూ దెబ్బలు తగిలించుకోవడం సహజంగా జరుగు తుంటుంది. ఒకవేళ ఈరు లేనప్పుడు ఇలా జరిగితే వారే సొంతంగా ఫస్ట్ ఎయిడ్ చేసుకునే శిక్షణ ఇవ్వండి. ఇది చాలా సందర్భాల్లో ఉపయోగపడుతుంది. ఇంట్లో ఉండే ముందులను వారికి దూరంగా ఉంచండి.

# బంతిలాంటి చామంతి!

చైనా అధికార చిహ్నంగా చెప్పుకునే ఈ పూలు క్రిశాంతమమ్స్. అవే మన భాషలో చామంతులు! గ్రీకు భాషలో క్రిశాంత్ లేదా క్రుసోస్ అంటే బంగారం అని అర్థం. 15వ శతాబ్దం నుంచీ చైనాలో ఈ పూలని ఔషధంగా భావించేవారు. వాటి వేర్లూ ఆకులూ, పూలు అన్నింటినీ ఔషధాల్లో వాడేవారట. పండగపూట చామంతి టీ తాగడం గొప్పగా భావించేవారట. 18వ శతాబ్దం వరకూ చైనాకే పరిమితం అయిన ఈ పూలు అక్కడ నుంచీ యూరప్, ఆసియా దేశాలకూ పరిచయ మయ్యాయి. అలా ఆ స్టెరియాసియా అనే అతి పెద్ద పూల జాతి కుటుంబానికి చెందిన ఈ పూలల్లోని వందల రకాల గురించి ప్రపంచానికి తెలిసింది. అయితే, చైనా మాదిరిగా కాకుండా తక్కిన దేశాలు ఈ పూలని అలంకరణలో, దైనందిన కార్యక్రమాల్లో భాగం చేశాయి. అలా గులాబీల తర్వాత వాణిజ్యపరంగా అంతటి ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ పూలల్లో రెండు వారాలపాటూ వన్నె తగ్గని పింగ్‌పాంగ్ పూల చామంతులది మరింత ప్రత్యేక స్థానం. ఇవి ప్రస్తుతం మన దేశంలోనూ సందడి చేస్తున్నాయి. చలికి పూలన్నీ వన్నె తగ్గిపోయి.చెట్లన్నీ ఆకులు రాల్చే సమయంలో ఈ పింగ్‌పాంగ్ క్రిశాంతమమ్స్ మాత్రం చూడక్కని రంగుల్లో.. చూపుతిప్పుకోనివ్వనంత అందంగా విరగబూయటం మొదలు పెడతాయి. అందుకే వీటిని 'క్వీన్ ఆఫ్ ఫాల్ ఫ్లవర్స్' అనీ నవంబర్ పూలనీ, ముద్దుగా మమ్స్ అని కూడా అంటారు. చూడ్డానికి టెన్నిస్ బంతిలా గుండ్రంగా ఉంటాయి. కాబట్టి పింగ్ పాంగ్ పామ్ పామ్ పూలని కూడా అంటారు. ఎటు నుంచి చూసినా ప్రతి రేకూ అందంగా ఉంటూ ఓ పద్ధతి ప్రకారం విచ్చుకుంటూ పూలు, మొదట్లో బంగారు వర్ణంలో మాత్రమే ఉండే ఈ పూలకి ప్రాధాన్యం పెరగడంతో- సాగులో అనేక మార్పులూ, పరిశోధనలూ మొదలై ప్రస్తుతం అనేక రంగుల్లో దొరుకుతున్నాయి. పసుపు, నారింజ, నీలం, ఉదా, తెలుపు, గులాబీ, ఎరుపు, పచ్చతోపాటు అన్నిరంగులూ కలిసిన రెయిన్‌బో



వర్ణాల్లోనూ లభిస్తున్నాయి. మన దేశంలో ఓ మాదిరిగానే చాలా ఆసియా దేశాల్లో చామంతులని అదృష్టానికీ, స్నేహానికి సౌభాగ్యానికి చిహ్నంగా భావిస్తారు. అందుకే గృహ ప్రవేశాలప్పుడు, పూలల్లో డైనింగ్ టేబుల్ అలంకరణల్లో, బొకేల్లో ఈ పూల వాడకం పెరుగుతూ వచ్చింది. కట్ చేసిన తర్వాత రెండువారాల పాటు వన్నె తగ్గని ఈ పూలు వేజుల్లోనూ అందంగా అమరిపోతాయి.

# అప్పుడు మట్టి - ఇప్పుడు సున్నం..

## అమరావతి సభపై - వైఎస్ షర్మిలసెటైర్లు



అమరావతి పనుల పున:ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరైన అన్ని అబద్దాలు చెప్పి వెళ్ళిపోయారని ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ ఆరోపించారు. ఎక్స్ వేదికగా ఆమె ప్రధాని పర్యటనంశాలపై పలు విమర్శలు చేసారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 94(3) సెక్షన్ ప్రకారం నవ్యాంధ్ర నూతన రాజధాని నిర్మాణ భాధ్యత పూర్తిగా కేంద్రానిదేనని వైఎస్ షర్మిళ స్పష్టం చేశారు. నూతన రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పన కేంద్రం కల్పించి ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు. విభజన చట్టంలో కేంద్రం విధులేంటే ఇంత స్పష్టంగా పేర్కొంటే...మరి ప్రధాని మోడీ రాష్ట్రానికి ఇచ్చింది ఏంటి? అని ప్రశ్నించారు. ఆనాడు 2015లో మట్టి కొట్టారు...నేడు సున్నం కొట్టి వెళ్ళారని విమర్శలు చేశారు. 10 ఏళ్ళ క్రితం ఏం చెప్పి ఆంధ్రులకు ప్రధాని తీరని ద్రోహం చేశారో...నేడు అవే అబద్దాలను అందంగా చెప్పి ఘరానా మోసం చేశారని షర్మిళ విమర్శించారు. మళ్ళీ అభివృద్ధి చేస్తాం, భుజాలు కలుపుతాం అంటూ బూటకపు మాటలు చెప్పారని మండిపడ్డారు. 5 కోట్ల మంది కలల సౌధం అమరావతికి 2015 నుండి అన్నీ చేశామని పచ్చి అబద్దాలు చెప్పారని మోడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నీ ఇస్తే మాకు రాజధాని నిర్మాణం ఇంత వరకు ఎందుకు కాలేదని సూటిగా ప్రశ్నించారు. అమరావతి నిర్మాణానికి ఖర్చయ్యే లక్ష కోట్లలో ఒక్క రూపాయి అయినా సభా వేదికగా ప్రకటించారా? అంటూ ప్రధాని మోడీని షర్మిళ నిలదీశారు. రాజధాని నిర్మాణం కేంద్ర భాధ్యత అని హామీనిచ్చారా? అని ప్రశ్నించారు. కనీసం అమరావతికి చట్టబద్ధత ఇస్తున్నామని చెప్పారా? అంటూ ఫైర్ అయ్యారు. పోనీ విభజన హామీలపై టైమ్ బాండ్ క్లారిటీ ఇచ్చారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అటు సిఎం చంద్రబాబు సైతం ఈ విషయంలో ఆత్మ పరిశీలన చేసుకోవాలని షర్మిళ అన్నారు. ప్రధాని మోడీని నమ్మి మళ్ళీ మళ్ళీ మోసపోతున్నట్లు తెలుసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ తరపున సిఎం చంద్రబాబును సైతం పలు అంశాలపై షర్మిళ సూటిగా ప్రశ్నించారు. రాజధానికి కావాల్సింది అప్పులు కాదు. నిధులు అంటూ స్పష్టం చేశారు. రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందన్న షర్మిళ...అప్పు పుట్టనిదే జీతాలకు దిక్కులేదని తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని పదే పదే చెప్పే చంద్రబాబు రాజధాని నిర్మాణానికి ఎవరిని అడిగి రూ.60వేల కోట్లు అప్పు తెస్తున్నారని ప్రశ్నించారు. వడ్డీల భారం మోసేదెలా? వరల్డ్ బ్యాంక్, ఎడిబి, కెఎఫ్‌డబ్ల్యు, హడ్కోల దగ్గర రాష్ట్రాన్ని ఎందుకు తాకట్టు పెడుతున్నారు. అంటూ నిలదీశారు. ప్రభుత్వ భూములు అంటే ప్రజల ఆస్థి వాటిని అమ్మి రాజధాని ఎలా కడతారు? అంటూ ఫైర్ అయ్యారు. కేంద్రం మెడలు వంచే దమ్ములేక భావితరాల మీద ఎందుకు అప్పు భారం మోపుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

# సీమలో ఈదురు గాలులు, వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్ రైలుమార్గం

**గుంతకల్లు రైల్వే,మే 3,ప్రభాతవార్త** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో శుక్రవారం రాత్రి భారీగా వీచిన ఈదురు గాలులు, వర్షానికి విద్యుత్ రైలు మార్గం దెబ్బతింది. దీంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో నంద్యాల-ఎర్రగుంట్ల రైలు మార్గంలోని నంద్యాల జిల్లా సంజామల-నొస్సం మధ్య రాత్రి 7.40గంటల ప్రాంతంలో ఆర్‌టిపిఎం లోకో ఇంజన్ నెంబర్లు 33937/32691 సంజామల రైల్వే స్టేషన్ దాటాక సెక్షన్ మధ్యలో 65/14కి.మీ వద్ద విద్యుత్ శక్తిని వినియోగించే పరికరం (పాంటోగ్రాఫ్) తీవ్రంగా వీచిన ఈదురు గాలులు, వర్షానికి జారిపోవడంతో విద్యుత్ రైలు మార్గం 64/10నుంచి 65/10 దెబ్బతింది. విషయం తెలుసుకున్న సంబంధిత ఉన్నతాధికారులు విద్యుత్ రైలు మార్గానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో కోయిలకుంట్లలోని విద్యుత్ రైలు మార్గాల నిర్వహణ (ఓహెచ్ఇ) సిబ్బంది టవర్ కార్‌లో వెళ్లి మరమత్తులు చేసి రాత్రి 10.25గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అదేవిధంగా నంద్యాల-ఎర్రగుంట్ల రైలు మార్గంలోనే మరో సంఘటన కూడా చోటు చేసుకుంది. ప్రొద్దుటూరు-జమ్ములమడుగు మధ్య కి.మీ





నెంబర్ 95/05-93/14మధ్య మరో పాంటోగ్రాఫ్ దెబ్బతిన్న విషయాన్ని ఎం2 గూడ్స్ రైలు ఇంజన్ నెంబర్ 60393నిలిచిపోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న సంబంధిత ఉన్నతాధికారులు అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేసి రైలు మార్గాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రైలు సర్వీసులను డీజిల్ ఇంజన్‌లతో సాగనంపారు. దీని పర్యవసానంగా ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే నెంబర్ 17216ఎక్స్‌ప్రెస్‌ను ప్రొద్దుటూరులో గుంటూరు రెండుగంటల 20ని॥లు, గుంటూరు నుంచి తిరుపతి వెళే నెంబర్ 17261ఎక్స్‌ప్రెస్ మద్దూరులో మూడు గంటలు, తిరుపతి నుంచి గుంటూరు వెళ్లే నెంబర్ 17262ఎక్స్‌ప్రెస్ ఎర్రగుంట్లలో మూడు గంటల 10ని॥లు, బళ్లారి ఎఫ్‌సిఐకి వెళ్తున్న నెంబర్ 38142గూడ్స్ రైలును బనగానపల్లెలో రాత్రి 8.40గంటల నుంచి నిలిపివేశారు. ఈ సంఘటనల కారణంగా ఆరు గంటల పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా ఓహెచ్ఇ పునరుద్ధరణకు అదనంగా మరో 5గంటల సమయం పట్టింది.

అదనపు డిఆర్ఎం సుధాకర్, సీనియర్ డిఇఇలు సుదర్శన్‌రెడ్డి, వీరయ్య, ఆపరేటింగ్, విద్యుత్, కమర్షియల్ విభాగాలకు చెందిన సంబంధిత అధికారులు, సీనియర్ సబార్డినేట్లు డివిజనల్ నియంత్రణ కార్యాలయం నుండి పరిస్థితి సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు తగు సలహా, సూచనలిస్తూ, ఆదేశాలిస్తూ రైలు సర్వీసులను నిర్ణీత వేగంతో సాగనంపారు.

# రేషన్‌కార్డు దారులకు ఇ కెవైసి గడువు పెంపు

**విజయవాడ,మే3,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం మంచి కబురు తెలిపింది. ఈ కేవైసీనీ చేసుకునేందుకు గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ గడువును జూన్ 30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు చేసింది. ఆ గడువు లోపు ఈకేవైసీని పూర్తి చేయాలని స్పష్టం చేసింది. బోగస్ కార్డులను ఏరివేయడంతో పాటు రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈ కేవైసీ ప్రక్రియను తీసుకువచ్చింది ప్రభుత్వం. అందులో భాగంగానే జనవరిలోనే ఈకేవైసీపీ ప్రక్రియను ప్రారంభించింది. ఈకేవీసీ పూర్తి చేసుకునేందుకు ఏప్రిల్ 30 వరకు గడువు విధిస్తూ.. ఆలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయని పక్షంలో రేషన్ సరుకులు నిలిపివేస్తామని అధికారులు ప్రకటనలు ఇచ్చారు. రేషన్‌కార్డులు ఉన్న వారు రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాల వద్దకు వెళ్లి ఈ కేవైసీ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అలాగే ఆన్‌లైన్‌లో కూడా ఈ కేవైసీని చేసుకునే విధానాన్ని కూడా అమలులోకి తీసుకొచ్చారు. అయితే కొన్ని కారణాల వల్ల చాలా మంది ఈకేవైసీని పూర్తి చేయలేకపోయారు. అలాంటి వారి కోసమే మరో రెండు నెలల పాటు గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది ఏపీ ప్రభుత్వం. ఆన్‌లైన్‌లో ఈకేవైసీని చేసుకునేందుకే చాలా మంది ముందుకు వచ్చారు.

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి ఆదివాసీ హక్కులను కాపాడాలి

## ఆదివాసీ హక్కుల పోరాట సమితి విజ్ఞప్తి



**హైదరాబాద్, మే 3,ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం చేపట్టిన అపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి నక్సలైట్లతో చర్చలు జరిపి ఆదివాసీ హక్కులను కాపాడాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, (తుడుందెబ్బ) నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్స పోచయ్య, రాష్ట్ర అధ్యక్షులు కోట్నాక విజయ్, ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీనారాయణలు మాట్లాడారు. ఈసందర్భంగా వారు ఏప్రిల్ 12నుంచి 14వరకు అసిఫాబాద్ జిల్లా జోడేఘాట్‌లో జరిగిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) డిక్లరేషన్‌ను చదివి వినిపించారు. దేశవ్యాప్తంగా,

రాష్ట్రాల వారీగా ఆదివాసీల జీవన ప్రాంతాలల్లో "ఆపరేషన్ కగార్ " పేరు అల్లకల్లోలం సృష్టించి ఆదివాసీలను అడవుల నుంచి పంపించే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. చత్తీస్‌ఘడ్, బస్తర్ లాంటి ప్రాంతాల్లో ఆదివాసీలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతూ బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని కావునమావోయిస్టులు ప్రతిపాదించిన శాంతి చర్చలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వారితో చర్చలు జరిపి అడువుల్లో ప్రశాంత వాతావరణం కల్పించేలా కృషి చేయాలన్నారు. అలాగే ఎస్టీ రిజర్వేషన్లు ఆదివాసీలకు అందకుండా చేస్తున్న లంబాడీ, బంజారా, నుగారీ, గోరు మాటీలను ఎస్టీ జాబితాలోంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే రాజ్యాంగం ఆదివాసీలకు కేటాయించి ప్రత్యేక షెడ్యూల్, అధికరణాల ప్రకారం 29 జీవోను చట్టం చేయాలన్నారు.

# మొగిలి గౌని చెరువులో గజరాజు మృతి

**బంగారుపాళ్యం, మే 3 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి గౌని చెరువులో శనివారం ఉదయం ఓ ఏనుగు మృతి చెందింది. మృతి చెందిన ఏనుగు వయస్సు సుమారు 5 సంవత్సరాలు వుంటుంది. గత నెల యాదమరి మండలం తాళ్ళమడుగు వ్యవసాయ పొలాల వద్ద అటవీ జంతువుల రక్షణ కోసం వుంచిన మందుగుండును ఏనుగుల గుంపులోని ఓ మగ ఏనుగు తిన్నది. ఆ సమయంలో తీవ్రంగా ఈ మగ ఏనుగు గాయపడింది. ఈ సమయంలో దంతము నాలుక మధ్యకు చొచ్చుకుని వెళ్ళడంతో ఆ మగ ఏనుగు తీవ్ర అస్వస్థత గురై ఆహారం తినలేక ఇబ్బంది పడింది. అప్పటి నుండి ఆహారం సక్రమంగా తీసుకోకపోవడంతో మగ ఏనుగు బక్క చిక్కిపోయింది. గౌని చెరువులో నీరు వుండటంతో ఈ మగ ఏనుగు చెరువులోకి దిగి నీరు తాగి బయటికి వెళ్ళే సమయంలో తీవ్ర అస్వస్థతకు గురై చెరువు గట్టుపై పడిపోయింది. కొద్ది సమయానికి అక్కడే ఏనుగు మృతి చెందింది. శనివారం ఉదయం పశువుల కాపర్లు పశువులను చెరువు వద్దకు నీరు తాపడానికి తీసుకెళ్ళగా ఏనుగు మృతి చెందిన విషయంను గుర్తించారు. వీరు వెంటనే సంబంధిత అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. పలమనేరు అటవీ సెక్షన్ కాలువపల్లి బీటుకు చెందిన ఎఫ్ఎస్ఓ రమేష్ వెంటనే ఈ విషయంను అటవీశాఖ ఉన్నత అధికారులకు సమాచారం ఇచ్చారు. తిరుపతి, అనంతపురం అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్లు సెల్వం, యశోదాభాయ్, చిత్తూరు జిల్లా అటవీశాఖ అధికారిణి భరణి, పలమనేరు ఎఫ్ఆర్ఓ నారాయణ, ఇతర సిబ్బంది ఏనుగు మృతి చెంది వున్న గౌని చెరువు వద్దకు చేరుకున్నారు. మృతి చెందిన ఏనుగును పరిశీలించి మృతికి గల కారణాలను పర్యవేక్షించారు. ఈ విషయంను తిరుపతి శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాల వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలంలోనే ఏనుగుకు పంచనామా నిర్వహించారు. ఈ క్రమంలో యాదమరి మండలం తాళ్ళమడుగు సమీపంలో ఏనుగు మందుగుండు తినడంతో ఏనుగు శరీరం ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. ఏనుగుకు ఇన్‌ఫెక్షన్ ఎక్కువ కావడంతో తీవ్ర అనారోగ్యం గురై మృతి చెందిందని నిర్ధారించారు, అలాగే మృతి చెందిన ఏనుగు మృతదేహంను గౌనిచెరువు ఆవరణలోని



గౌని చెరువులో మృతి చెందిన మగ ఏనుగు

కట్టెలు, పెట్రోల్ పోసి ఖననం చేశారు. ఇందులో ఎఫ్ఎస్ఓ శేఖర్, ఎఫ్‌డిఓలు రాజశేఖర్, యుగంధర్, జయలక్ష్మీ, హేమలత, కుసుమకుమారి, వేణుగోపాల్, ఇతర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రై సిరీస్‌లో శ్రీలంక తొలి విజయం

## 5 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా చిత్తు

**న్యూఢిల్లీ:** స్వదేశంలో జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో శ్రీలంక మహిళల జట్టు బోణీ కొట్టింది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో లంక 5 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. డెర్క్‌సెన్ (61), లారా (46) ఆ జట్టును ఆదుకున్నారు. లంక బౌలర్లలో మల్కి (4/50), విహంగ (3/41) రాణించారు. స్వల్ప ఛేదనను శ్రీలంక 46.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి పూర్తి చేసింది. హర్షిత సమరవిక్రమ (77), కవిష (61) నాలుగో వికెట్‌కు 128 పరుగులు జోడించి లంక విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈటోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ సౌతాఫ్రికాకు ఇది రెండో పరాభవం.



మహిళల వన్డేల్లో శ్రీలంక తన నాల్గవ అత్యధిక పరుగుల వేటను పూర్తి చేసింది మరియు కొలంబోలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో దక్షిణాఫ్రికాను వరుసగా రెండవ ఓటమికి గురి చేసింది. కవిషా దిల్హారి మరియు హర్షిత సమరవిక్రమల మధ్య రికార్డు స్థాయిలో 128 పరుగుల భాగస్వామ్యం, ఇద్దరూ అర్ధ సెంచరీలు చేయడంతో, పిచ్ మందగించడం మరియు సిబ్బంది సమస్యలతో ఇబ్బంది పడుతున్న దక్షిణాఫ్రికా జట్టుపై శ్రీలంక కార్యకలాపాలను నియంత్రించింది. పదిహేడేళ్ల వికెట్ కీపర్ కరాబో మెసో శ్రీలంక ఇన్నింగ్స్‌లో 14 ఓవర్ల తర్వాత అనారోగ్యంతో మైదానం నుండి నిష్క్రమించాల్సి వచ్చింది. ఇక ఎనిమిది ఓవర్లు బౌలింగ్ చేసి 34 పరుగులకు 1 వికెట్ తీసుకున్న సునే లూస్ తన మోకాలిని టర్ఫ్‌లోకి లాక్కుని గాయాలపాలైంది, దీనితో ఆమె మైదానం నుండి బయటకు వెళ్లాల్సి వచ్చింది. శ్రీలంక జట్టులో అరంగేట్రం చేసిన ఆఫ్ స్పిన్నర్ దేవ్మి విహంగా తొలి వన్డేలోనే మూడు వికెట్లు తీసిన రెండో ఆఫ్ స్పిన్నర్‌గా రికార్డు సృష్టించగా, రెండో మ్యాచ్ ఆడుతున్న మల్కి మదారా 50 పరుగులకు 4 వికెట్లు పడగొట్టింది. అన్నెరీ డెర్క్సెన్ తొలి వన్డే అర్ధ సెంచరీతో నిర్మించిన దక్షిణాఫ్రికా మొత్తం 235 పరుగులు, ఆటలో సగం వరకు పోటీతత్వంతో కనిపించింది, కానీ శ్రీలంక మూడో ఓవర్‌లో చమరి అథపత్తును కోల్పోయినప్పుడు, అది మ్యాచ్ విన్నింగ్ అయ్యే అవకాశం ఉందని అనిపించింది. దిల్హారి మరియు సమరవిక్రమ 21 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని నమోదు చేశారు.

# జింబేబ్వేతో టెస్టుకు ఇంగ్లండ్ జట్టు ఖరారు

**న్యూఢిల్లీ:** జింబాబ్వేతో ఏకైక టెస్టు మ్యాచ్‌కు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు తమ జట్టును ఖరారు చేసింది. ఈ నెల 22 నుండి 25 వరకూ సొంత గడ్డపై ఇంగ్లండ్–జింబాబ్వే మధ్య నాలుగు రోజుల టెస్టు మ్యాచ్ జరగనుంది. ఇదుకు సంబంధించి 13 మందితో కూడిన వివరాలను వెల్లడించింది. ఈ జట్టులో 27 ఏళ్ల పేసర్ సామ్ కుక్‌కు తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కడం విశేషం. కుక్‌తో పాటు, జోర్డాన్ కాక్స్‌ను కూడా ఈ మ్యాచ్‌కు ఎంపిక చేసి ఇంగ్లీష్ జట్టు సెలక్టర్లు జోష్ టంగ్‌ను కూడా తిరిగి తీసుకున్నారు. ఇక కౌంటీ క్రికెట్‌లో సామ్ కుక్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. నిలకడైన ఆటకు మారు పేరైన ఈ ఎస్సెక్స్ పేస్ బౌలర్ కౌంటీల్లో ఇప్పటికే 38 వికెట్లు తీశాడు. అలాగే ఇంగ్లండ్ లయన్స్ తరఫున ఆస్ట్రేలియా ఎ జట్టుతో మూడు మ్యాచ్‌లలో కలిపి సామ్ కుక్ 13 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు జోరడ్డాన్ కాక్స్ 2024లోనే ఆరంగేట్రం చేయాల్సింది. న్యూజిలాండ్‌తో నవంబర్ నాటి మ్యాచ్‌లో ఆడాల్సి ఉండగా, ప్రాక్టీస్ సెషన్‌లో కుడిచేతి బొటన వేలికి గాయమైంది. దీంతో అప్పుడు అవకాశం కోల్పోయిన అతడికి మళ్లీ సెలక్టర్లు పిలుపునిచ్చారు. జోష్ టంగ్ విషయానికి వస్తే 2023లో ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్‌లో భాగంగా లార్డ్స్ టెస్టు తర్వాత మళ్లీ జాతీయ జట్టుకు ఆడ లేదు. ఇంగ్లండ్ జట్టులో బెన్ స్టోక్స్ (కెప్టెన్), జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, జామీ స్మిత్ (వికెట్ కీపర్). జోర్డాన్ కాక్స్ (వికెట్ కీపర్), సామ్ కుక్, గస్ అడ్కిన్సన్, షోయబ్ బషీర్, మాథ్యూ పాట్స్, జోష్ టంగ్ ఉన్నారు.




### ఆర్టిస్టిక్ ఛాంపియన్‌షిప్‌లో..


# తెలంగాణ అమ్మాయి నిష్కకు రజతం

**న్యూఢిల్లీ:** పుణె వేదికగా జరుగుతున్న జాతీయ జూనియర్, సీనియర్ అర్టిస్టిక్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ జిమ్నాస్ట్ నిష్క అగర్వాల్ సత్తాచాటింది. జాతీయ సీనియర్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్ ఆల్‌రౌండ్ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి నిషిక అగర్వాల్ రజతంతో మెరిసింది. ఈ పతకంతో ఆసియా జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిపకు కూడా నిషిక అర్హత సాధించింది. పుణెలో జరిగిన ఈ పోటీల్లో నిషిక 43.750 స్కోరుతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆసియా చాంపియన్‌షిప వచ్చే నెల 12 నుంచి 15వ తేదీ మధ్య కొరియాలో జరగనుంది. ఇదే విభాగంలో సమంత (రైల్వేస్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్, 43.900), స్నేహ తరియాల్ (ఢిల్లీ, 43.750) వరుసగా ఒకటి, మూడు స్థానాలు దక్కించుకున్నారు. జాతీయ టోర్నీలో రాణించడం ద్వారా కొరియా వేదికగా జూన్ 12 నుంచి మొదలయ్యే ఏషియన్ చాంపియన్‌షిప్ టోర్నీకి నిష్క ఎంపికైంది.

# ఐపిఎల్25లో సమ్‌థింగ్ స్పెషల్

## తొలుత సెంచరీ.. ఆపై డకౌట్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025లో 52 మ్యాచ్‌లు పూర్తవడంతో, ప్లేఆఫ్స్‌కు చేరుకునే జట్లపై ఉత్సుకత పెరిగింది. ఇదే సమయంలో ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు నలుగురు ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ సెంచరీలు సాధించడం విశేషం. ఈ 18వ సీజన్‌లో ఇప్పటి వరకూ



జరిగిన మ్యాచ్‌ల్లో యువ భారత క్రికెటర్లు అద్భుతంగా రాణిస్తుండగా, పలు చిరస్మరణీయ సంఘటనలు కూడా జరిగాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 4 సెంచరీలు నమోదయ్యాయి. అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే, ఈ నాలుగు సెంచరీలూ వివిధ జట్లకు చెందిన నలుగురు ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్స్ సాధించారు. వారిలో, జీరోతో ప్రత్యేక సంబంధం ఉన్న ముగ్గురు బ్యాట్స్‌మెన్‌లు కూడా ఉన్నారు. ఈ సీజన్‌లో ఇషాన్ కిషన్, ప్రియాంష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మల సెంచరీలు హైలైట్స్‌గా నిలిచినప్పటికీ, ఈ సెంచరీల తర్వాత లేదా అంతకు ముందు డకౌట్‌గా అవుట్ కావడం యాదృచ్ఛికం. సన్‌రైజర్స్ హైదరాబాద్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ ఇషాన్ కిషన్, ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మతో పాటు, పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రియాంష్ ఆర్య, రాజస్థాన్ రాయల్స్ 14 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కూడా ఈ సీజన్‌లో సెంచరీలు సాధించారు. ఈ ఆటగాళ్ళు సెంచరీ చేయడానికి ముందు లేదా తర్వాత డకౌట్ అయ్యారు. తొలిసారి సన్ రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడుతున్న ఇషాన్ కిషన్ తన తొలి మ్యాచ్ లోనే సెంచరీ సాధించాడు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను 47 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 106 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో ఇది తొలి సెంచరీ. కానీ, తర్వాతి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ గోల్డెన్ డక్‌కు బలయ్యాడు. అలాగే, కిషన్ బాట్ సెంచరీ చేసినప్పటి నుంచి మౌనంగా ఉన్నాడు. పంజాబ్ కింగ్స్ యువ బ్యాట్స్‌మన్ ప్రియాంష్ ఆర్య ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. తన తొలి ఐపీఎల్ సీజన్‌లోనే సెంచరీ సాధించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ సీజన్‌లో మూడో మ్యాచ్‌లో, రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రియాంష్ ఆర్య గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన తదుపరి మ్యాచ్‌లో, ప్రియాంష్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి, 42 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సర్లతో 103 పరుగులు చేశాడు. ఈ సెంచరీ తర్వాత కూడా ప్రియాంష్ బ్యాట్ పరుగుల వర్షం కురిపిస్తూనే ఉంది. ఐపీఎల్‌లో ఆడిన అతి పిన్న వయస్కుడైన క్రికెటర్‌గా రికార్డు సృష్టించిన రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తన మూడో మ్యాచ్‌లోనే సంచలన సెంచరీ సాధించాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ కేవలం 38 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్సర్లతో 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీనితో, అతను ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన తొలి భారతీయుడిగా నిలిచాడు. అంతేకాకుండా, ఈ సెంచరీ ఐపీఎల్ చరిత్రలో రెండవ వేగవంతమైన సెంచరీగా కూడా నిలిచింది. కానీ ఈ సెంచరీ తర్వాత, ముంబై ఇండియన్స్‌తో జరిగిన తదుపరి మ్యాచ్‌లో అతను డకౌట్ అయ్యాడు.

# అమెరికాతో భారత్ ఢీ

## అక్టోబరు నుండి చెస్ టోర్నమెంట్

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది భారత్, అమెరికా దేశాల మధ్య చెస్ టోర్నమెంట్ జరగనుంది. ఇరు దేశాలకు చెందిన టాప్ స్టార్ ప్లేయర్లు ఐదరూ ఈ టోర్నీలో పాల్గొనున్నారు. దీనికి సంబంధించిన డ్రా తదితర వివరాలను నిర్వహకులు వెల్లడించారు. అక్టోబరు 4న అర్లింగ్టన్‌లోని ఇ స్పోర్ట్స్ స్టేడియాంలో ఈ చెస్ టోర్నమెంట్ పోటీలు జరుగనున్నాయి. ఇరు దేశాల నుండి ఐదుగురు ఆటగాళ్లు చొప్పున ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటారు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ భారత్ జట్టుకు నాయకత్వం వహించి ముందుండి నడిపించనున్నాడు. అమెరికన్ సూపర్ గ్రాండ్ మాస్టర్ హికారు నకమురను గుకేశ్ ఢీ కొంటాడు. గుకేశ్‌తో పాటు, తెలంగాణ గ్రాండ్ మాస్టర్ ఇరిగేసి అర్జున్, సాగర్ షా, ఎథన్ వాజ్‌తో పాటు, భారత్ మహిళా ప్లేయర్, అంతర్జాతీయ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్‌లు బరిలో ఉన్నారు. మొదటి బోర్డులో గుకేశ్, నకముర తలపడనుండగా, రెండో బోర్డులో అర్జున్ గ్రాండ్ మాస్టర్ ఫాబియానో కరువానాను ఎదుర్కొంటాడు. ఇక మూడో బోర్డులో సాగర్ షా, లెవి రొజ్మన్ పోటీపడనుండగా, మిగిలిన పోటీల్లో దివ్యతో కారిస్సా యిప్, ఎథన్ వాజ్‌తో టాని టొలువా అడ్యూమి తలపడతారు. కాగా టోరఈనన నిబంధనల విషయానికి వస్తే బోర్డులోని ఇరు ఆటగాళ్ల మధ్య ఐదు రౌండ్ల గేమ్‌లు జరుగుతాయి. పది నిముషాల్లో గేమ్‌ను ముగించాల్సి ఉంటుంది. అప్పటికీ డ్రా అయితే మరో 5 నిముషాల ఆటను కొనసాగిస్తారు. షూటౌట్‌కు వస్తే మరో నిముషం అదనంగా కేటాయిస్తారు. అప్పటికీ సమ ఉజ్జీలుగా నిలిస్తే మాత్రం విజేత తేలేంత వరకూ పోటీ కానసాగుతుంది.

# యుపిఐ సేవల్లో మరింత వేగం

**ముంబై, మే 3:** దేశంలో పెరిగిన యూపీఐ లావాదేవీల నేపథ్యంలో వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరచడానికి, అలాగే జాప్యాలను తగ్గించడానికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కీలక చర్యలు తీసుకుంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలకు సంబంధించిన రెస్పాండ్ సమయాన్ని కఠినతరం చేసింది. ఇటీవల జారీ చేసిన సర్క్యులర్‌లో జూన్ 16, 2025 నుంచి వివిధ యూపీఐ సేవలలో వేగవంతమైన ప్రాసెసింగ్ ప్రమాణాలను అమలు చేయాలని ఎన్‌పీసీఐ బ్యాంకులు, చెల్లింపు యాప్‌లను ఆదేశించింది. చెల్లింపు ప్రాసెసింగ్, లావాదేవీల ధ్రువీకరణ, రివర్సల్స్‌లో జాప్యాలను తగ్గించడం ఈ చర్య లక్ష్యం. ముఖ్యంగా లావాదేవీ స్థితిని తనిఖీ చేయడానికి గతంలో 30 సెకన్ల సమయం ఉండగా దాన్ని 10 సెకన్లకు తగ్గించారు. లావాదేవీ రివర్స్ చేయడానికి గతంలో 30 సెకన్ల సమయం ఉండగా దాన్ని కూడా 10 సెకన్లకు తగ్గించారు. అలాగే యూపీఐ ఐడీను ధ్రువీకరించడానికి గతంలో 15 సెకన్ల సమయం ఉండగా దాన్ని కూడా 10 సెకన్లకు తగ్గించారు. ఏప్రిల్ 12న యూపీఐ లావాదేవీలకు చాలా అంతరాయం కలిగింది. ముఖ్యంగా ఎన్‌పీసీఐ సాంకేతిక సమస్యల కారణంగా పాక్షిక లావాదేవీ వైఫల్యాలను అంగీకరించింది. అలాగే త్వరిత పరిష్కారానికి హామీ ఇచ్చింది.




ఏప్రిల్ నెలలో దేశంలో రోజువారీ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు 600 మిలియన్ల మార్కును చేరుకున్నాయి. ఈ నెలలో 596 మిలియన్ల లావాదేవీలను నమోదు చేసింది. మార్చిలో ఇది 590 మిలియన్లు దాటిందని ప్రభుత్వం తెలుపుతుంది. యూపీఐ మార్చి, ఏప్రిల్ నెలల్లో అనేక అంతరాయాలను ఎదుర్కొంది. అందువల్ల జీపే, ఫోన్‌పే వంటి యాప్‌లలో తీవ్రమైన అంతరాయాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా మార్చి 26, ఏప్రిల్ 1, ఏప్రిల్ 12 తేదీల్లో వినియోగదారులకు పెద్ద అంతరాయాలు సంభవించాయి. నెలవారీ డిజిటల్ లావాదేవీల్లో దాదాపు రూ. 25లక్షల కోట్లను ప్రాసెస్ చేసే వ్యవస్థలోని కొన్ని ఇబ్బందులను ఈ అంతరాయాలు బయట పెట్టాయి.

# ప్రపంచంలోనే పెద్ద బ్యాంకులు ఇవే..

**న్యూఢిల్లీ, మే 3:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మూలం బ్యాంకులే. ఆర్థికపరమైన పరిణామాలన్నీ బ్యాంకుల ద్వారానే జరుగుతాయి. అప్పు కావాలన్నా, సంపాదించిన సొమ్ము దాచుకోవాలన్నా అన్నింటికీ బ్యాంకులే ఆధారం. లక్ష కోట్ల డాలర్ల విలువైన ఆస్తులను నిర్వహించే సంస్థలతో ప్రపంచ బ్యాంకింగ్ పరిశ్రమ ఆధిపత్య ఉనికిని కొనసాగిస్తోంది. స్టాటిస్టా నివేదిక ప్రకారం 2025 నాటికి ఈ రంగం నికర వడ్డీ ఆదాయం 8.94 లక్ష కోట్ల డాలర్లకు పెరుగుతుందని అంచనా. మార్కెట్ కేపిటలైజేషన్ పరంగా అమెరికాకు చెందిన జెపి మోర్గాన్ ఛేజ్ ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాంకు. మొత్తం ఆస్తులపరంగా ఇది అమెరికాలో అతి పెద్ద బ్యాంకు. ఈ ర్యాంకింగ్స్‌లో అమెరికన్ బ్యాంకులు ఆధిపత్యం కొనసాగిస్తుండగా, చైనా బ్యాంకులు టాప్ టెన్‌లో నాలుగింటిని ఆక్రమించాయి. ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంకు ఆఫ్ చైనా ఆసియాలోనే అతిపెద్దదిగా అవతరించింది. మార్కెట్ కేపిటలైజేషన్ పరంగా టాప్ 10 బ్యాంకులలో ఓ భారతీయ బ్యాంకు కూడా చోటు దక్కించుకుంది. హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్‌తో విలీనం తర్వాత భారత్‌కు చెందిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు భారతదేశంలో అతిపెద్ద బ్యాంకుగా, ప్రపంచవ్యాప్తంగా పదో అతిపెద్ద బ్యాంకుగా మారింది. 2025 మే 2 నాటికి ఇది




184.44 బిలియన్ డాలర్లు అంటే రూ.1,553,706 కోట్లుగా మార్కెట్ టర్నోవర్ కలిగి ఉంది. జెపి మోర్గాన్ ఛేజ్ రూ.57,80,495 కోట్లు, ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంకు ఆఫ్ చైనా రూ.2,696,421 కోట్లు, బ్యాంకు ఆఫ్ అమెరికా రూ.2,549,084కోట్లు, అగ్రికల్చరల్ బ్యాంకు ఆఫ్ చైనా రూ.2,163,540 కోట్లు, వెల్స్ ఫార్గో రూ.1,968,702 కోట్లు, చైనా కన్‌స్ట్రక్షన్ బ్యాంకు రూ.1,8,24,265 కోట్లు, బ్యాంకు ఆఫ్ చైనా రూ.1,745,070 కోట్లు, హెచ్‌ఎస్‌బిసి రూ.1,660,165కోట్లు, మోర్గాన్ స్టాన్లీ రూ.1,580,581కోట్లు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు రూ.1,553,706 కోట్లుగా ఉన్నాయి.

**ముంబై, మే 3:** స్టాక్ మార్కెట్లలో చాలా మంది పెట్టుబడులు పెడుతుంటారు. డబ్బులు ఎక్కువ సంపాదించాలనే ఆశతో స్టాక్స్‌పై సరైన అవగాహన లేకపోయినా భారీగా డబ్బులు పెట్టుబడిగా పెడుతుంటారు. అలాంటి వారికే కాక.. స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసే అందరికీ

# ఈక్విటీలకు రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత వార్నింగ్!

ఒక షాకింగ్ న్యూస్ చెప్పారు రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి. సమీప భవిష్యత్తులో స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతాయని అన్నారు. అయితే ఇలాంటి పరిస్థితుల్లో ఆందోళన చెందకుండా దీన్నో అవకాశంలా భావించాలని కూడా అంటున్నారు. ఇటీవలె ఆయన ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు అందులో పలు విషయాలపై స్పందించారు.



నిరుద్యోగ భయం ప్రపంచవ్యాప్తంగా వైరస్ లాగా ఎలా వ్యాపిస్తుందో వివరించారు. జాగ్రత్తగా ఉండండి అని చెబుతూ నేటి ప్రపంచ ఆర్థికవ్యవస్థలో నిరుద్యోగ సమస్య వాస్తవికత గురించి చెప్పారు. రానున్న మహా మాంద్యం గురించి హెచ్చరించిన తన మునుపటి పుస్తకాన్ని ప్రస్తావిస్తూ పుస్తకంలో తాను పేర్కొన్నట్లు జరగకపోతే మంచిదని అన్నారు. నా అంచనా ప్రకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది. స్టాక్ మార్కెట్లు క్రాష్ అవుతాయి. అందుకు భయపడొద్దు.. సిద్ధంగా ఉండాలి. దాన్ని ఒక అవకాశంలా భావించాలని అంటూ వెల్లడించారు. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని తిప్పికొట్టడానికి, దానిని సంక్షోభం కంటే కూడా ఒక అభ్యాస అవకాశంగా మార్చడానికి తాను ఒక మార్గాన్ని కనుగొన్నానని ఆయన తెలిపారు. సంక్షోభ సమయంలో తెలివిగా పెట్టుబడి పెట్టాలని అన్నారు. మార్కెట్ పతన సమయంలో నిజమైన ఆస్తులు అమ్మకానికి వస్తాయంటూ పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక అంశాలు స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపుతాయి కనుక మార్కెట్‌అల్లకల్లోల స్థితిలో పానిక్ సెల్లింగ్ ఒక సాధారణ విషయం అని అన్నారు. బిట్‌కాయిన్ ధర 300 డాలర్లకు పడిపోతే బాధపడతారా? సంతోషిస్తారా? అని ప్రశ్నిం చారు. అలా జరిగితే అది పెట్టుబడి పెట్టేందుకు ఒక చక్కటి అవకాశం అన్నారు. మీరు కొనుగోలు చేసినప్పుడు లాభంవస్తుంది, అమ్మినప్పుడు కాదు అని అని రాబర్ట్ అన్నారు. అయితే తాను ఈ పోస్ట్ చేయడానికి ఒక కారణం ఉందని రాబర్ట్ వెల్లడించారు. తన ప్రేక్షకులను ఆర్థికమాంద్యం గురించి సిద్ధంగా ఉంచాలని ఈ పోస్ట్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఆ మహా ఆర్థిక మాంద్యం ఆల్రెడీ మొదలైంది అని కూడా ఆయన తెలిపారు.

**ముంబై, మే 3:** ఏప్రిల్ 2025 నాటికి భారతదేశ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన మార్కెట్లో టీవీఎస్ మోటార్ అగ్రగామిగా అవతరించింది. గతంలో అగ్రస్థానంలో బజాజ్ ఆటో, ఓలా ఎలక్ట్రిక్‌లను అధిగమించి మరీ టీవీఎస్ ఈ స్థానానికి చేరింది. గత నెలలో టీవీఎస్ 19,736 యూనిట్లను విక్రయించింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 154 శాతం సూచిస్తుందని, అలాగే పెరుగుదల 22 శాతం మార్కెట్ వాటాతో ఉందని నిపుణులు

# విద్యుత్ వాహనాల మార్కెట్లో టివిఎస్ హవా

చెబుతున్నారు. అయితే ఓలా ఎలక్ట్రిక్ 19,709 యూనిట్లను విక్రయించింది. ఇది గత సంవత్సరం కంటే 42 శాతం తగ్గుదల, 21 శాతం మార్కెట్ వాటాతో కలిగి ఉంది. అలాగే బజాజ్ ఆటో 151 శాతం వృద్ధిని సాధించి 19,001 యూనిట్లకు చేరుకుంది. అలాగే 21 శాతం మార్కెట్ వాటాను పొందింది. అలాగే ఇటీవల అమ్మకాల్లో వృద్ధిని చూపుతున్న ఏథర్ ఎనర్జీ ఈవీ స్కూటర్ల అమ్మకాలు 31 శాతం పెరిగి 13,167 యూనిట్లకు చేరుకున్నాయి. అంటే దాదాపు 14 శాతం మార్కెట్‌వాటా ఏథర్ పొందింది. అలాగే హీరో మోటోకార్ప్ 6,123 యూనిట్లు అమ్ముడు పోయి 7 శాతం మార్కెట్ వాటాతో 540 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఓలా ఎలక్ట్రిక్ నెలనెలా తన మార్కెట్ వాటాను పెంచుకున్నప్పటికీ అమ్మకాలు తగ్గడానికి పెరిగిన పోటీ, వ్యూహాత్మక మార్పులే కారణమని నిపుణులు చెబుతున్నారు. భవిష్‌అగర్వాల్ నేతృత్వంలోని కంపెనీ మహారాష్ట్రతో సహా అనేక రాష్ట్రాల్లో ట్రేడ్ సర్టిఫికెట్లు, వాహన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఉల్లంఘనల కారణంగా గణనీయమైన నియంత్రణ పరిశీలనలో ఉంది. ముఖ్యంగా చాలా వరకు షోరూమ్‌లను మూసేసే పరిస్థితికి వచ్చింది. అయితే మహారాష్ట్రలోని 100 కి పైగా షోరూమ్‌లను మూసివేయాలని ఆదేశించిందని వార్తలు గుప్పుమన్నాయి. అయితే అధికారిక నోటీసు గురించి తమకు తెలియదని కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. అలాగే టీవీఎస్, బజాజ్, ఏథర్ వంటి ఈవీ స్కూటర్లకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ఓలా అమ్మకాల్లో వెనుకబడింది. టీవీఎస్ ఏప్రిల్ నెలలో అత్యుత్తమ అమ్మకాలను సాధించి మొదటిసారిగా మార్కెట్‌లో అగ్రస్థానంలో నిలిచింది. బజాజ్ ఆటోపనితీరు దాని చేతక్ ఈస్కూటర్‌కు సంబంధించిన అమ్మకాలతో బలపడింది. ఈ కంపెనీ క్యూ4 2025ఆర్థిక సంవత్సరంలో అమ్మకాల్లో అగ్రస్థానంలో నిలిచింది.



# వాణిజ్యం

**ముంబై, మే 3:** అధిక రాబడి అవకాశాల కోసం చూస్తున్న పెట్టుబడిదారులు ప్రభుత్వ మద్దతు ఉన్న స్టాక్‌ను ఎంచుకోవడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కేవలం ఒక నెలలోనే 49 శాతం వరకు రాబడిని అందించిందని వివరిస్తున్నారు. ఈ కంపెనీ మార్చి త్రైమాసికంలో బలమైన పనితీరుతో మెరుగైన రాబడిని అందించింది. ముఖ్యంగా దాని శుద్ధి విభాగంలో ఇది లాభాలను, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని గణనీ

# ఐఒసి స్టాక్‌లో పెట్టుబడితో రాబడుల వెల్లువ..

యంగా పెంచింది. ప్రస్తుతం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌ను 34 మంది విశ్లేషకులు కవర్ చేస్తున్నారు. వారిలో 22 మంది దీనికి కొనుగోల్లు రేటింగ్ ఇచ్చారు. ఏప్రిల్‌లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 10 డాలర్లు తగ్గితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఇండియన్ ఆయిల్ ఇన్వెంటరీ నష్టానికి దారితీయవచ్చని ఓ ప్రముఖ పరిశోధన సంస్థ తన నివేదికలో పేర్కొంది. రిఫైనింగ్ మార్జిన్‌లో కొంత బలహీనత ఉన్నప్పటికీ ఈ కంపెనీ మార్కెటింగ్ మార్జిన్‌లో గణనీయమైన పెరుగుదల కనిపించింది. మార్చి త్రైమాసికఫలితాల తర్వాత నిర్వహణ లాభం అంచనాలు వరుసగా 15 శాతం నుంచి 17 శాతం వరకు ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. అలాగే ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ కూడా ఈ స్టాక్‌కు కొను గోలు



రేటింగ్ ఇచ్చి దాని ప్రస్తుత ధర కంటే దాదాపు 49శాతం ఎక్కువ ధరను రూ.205గా నిర్ణయించింది. ఇండియన్ ఆయిల్ స్టాక్‌ను వ్యూహాత్మక ఆట్టగా మోర్గాన్ స్టాన్లీ కంపెనీ అభివర్ణించింది. ఈ స్టాక్ రాబోయే 30 రోజుల్లో గణనీయమైన లాభాలను అందిస్తుందని పేర్కొంటుంది.

**న్యూఢిల్లీ, మే 3:** ప్రముఖ టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్‌కు చెందిన వీడియో కాలింగ్ ప్లాట్‌ఫామ్ స్కైప్ సేవలకు శాశ్వతంగా నిలిచిపోతున్నాయి. ఈ నెల 5 నుంచి స్కైప్ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయిన స్కైప్‌కు కరోనా తర్వాత ఆదరణ తగ్గడం, మార్కెట్లో పోటీగా మెరుగైన ఇతర ప్రత్యామ్నాయాలు రావడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. దీనిని వాడుతున్న యూజర్లు టీమ్స్‌కు మారాల్సి ఉం

# స్కైప్ సేవలకు మైక్రోసాఫ్ట్ స్వస్తి..

టుందని తెలిపింది. 2003లో తొలుత తన సేవలను ప్రారంభించిన స్కైప్, వీడియో కాలింగ్ ఇన్ స్టంట్ మెసేజింగ్‌లో విప్ల వాత్మక మార్పులు తీసుకొచ్చింది. 2011లో దీనిని మైక్రోసాఫ్ట్ కొనుగోలు చేసింది. 2017లో మైక్రోసాఫ్ట్ టీమ్స్‌ను లాంచ్‌చేసింది. నాటి నుంచి స్కైప్ అంతర్గతంగా పోటీ ఎదుర్కొంటుంది. అలాగే మెసేజింగ్, వీడియో కాల్స్ ఇతర సర్వీసుల కోసం టీమ్స్‌ను ప్రాథమిక కేంద్రంగా సంస్థ పూర్తిగా దృష్టిపెడుతోంది. స్కైప్ నుంచి టీమ్స్‌కు మైగ్రేట్ అయ్యేందుకు మైక్రోసాఫ్ట్ యూజర్లకు చాలా నెలల సమయం ఇచ్చింది. టీమ్‌ల్లోకి లాగిన కావడానికి ఇప్పటికే ఉన్న స్కైప్ ఐడీలను ఉపయోగించవచ్చని తెలిపింది. ఇది యూజర్ ట్రాన్స్‌పర్మేషన్‌ను సులభతరం చేసింది. చాట్ హిస్టరీలు, కాంటాక్ట్‌లను నిరాటంకంగా టీమ్స్‌కు బదిలీ చేస్తామని మైక్రోసాఫ్ట్ హామీ ఇచ్చింది. కాగా మార్కెట్లో టీమ్స్‌కు కూడా ప్రత్యామ్నాయాలున్నాయి. యూజర్లు వీడియో కాలింగ్ ఫీచర్లను




అందించే గూగుల్ మీట్, జూమ్ లేదా వాట్సాప్ వంటి సర్వీసులు ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.